thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 177 కరీంనగర్ గురువారం, 4 సెప్టెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

### భారీ వర్షాల కారణంగా ఇళ్లపై విరిగిపడ్డ కొండ చరియలు..

భారీ వర్షాల కారణంగా హిమాచల్ ప్రదేశ్ అతలాకుతలం అవుతోంది. ప్రకృతి విలయానికి పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టం సంభవిస్తోంది. మండి జిల్లాలోని సుందర్‌నగర్‌లో ఓ రెండు ఇళ్లపై కొండ చరియలు విరిగిపడ్డాయి. ఈ సంఘటనలో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. నిన్న సెర్చ్ ఆపరేషన్‌లో శిథిలాల కిందనుంచి నాలుగు శవాలను బయటకు తీశారు. ఈ రోజు మరో రెండు శవాలు బయటకు తీశారు. పొక్‌లైన్‌తో మట్టి తవ్వి తల్లీ,కొడుకుల మృతదేహాలను వెలికితీశారు. వారిని సురిందర్ కౌర్, గురుప్రీత్ సింగ్‌గా గుర్తించారు. ఇంటి పైకప్పును కట్ చేసి రెండు శవాలను బయటకు తీశారు. కొండచరియలు విరిగి పడిన సమయంలో దద్యాల్ ఏరియాకు చెందిన ప్రకాష్ వర్మ స్కూటర్‌పై వెళుతూ ఉన్నాడు. కొండచరియలు స్కూటర్‌తో సహా అతడ్ని కప్పెట్టేశాయి. సెర్చ్ ఆపరేషన్‌లో అతడి శవాన్ని వెలికితీశారు. ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సెర్చ్ ఆపరేషన్‌ను ముమ్మరం చేశాయి.

# సామాన్య ప్రజలకు గుడ్ న్యూస్

## తగ్గనున్న 175 వస్తువుల ధరలు

## హస్తిన వేదికగా ప్రారంభమైన జీఎస్టీ కౌన్సిల్ 56వ సమావేశం




జీఎస్టీ కౌన్సిల్ 56వ సమావేశం బుధవారం నుంచి ప్రారంభమైంది. ఈ సమావేశంలో సామాన్య ప్రజలకు, కంపెనీలకు ప్రయోజనం చేకూర్చే కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఆగస్టు 15న ప్రధాని నరేంద్ర మోడీ ఎర్రకోట నుంచి కొత్త జీఎస్టీ సంస్కరణలను ప్రకటించిన తర్వాత ఇది మొదటి సమావేశం కావడంతో ప్రజలు, కంపెనీలు ఈ నిర్ణయాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశంలో పన్ను రేట్లను క్రమబద్ధీకరించడంపై చర్చ జరుగుతుందని, దీనివల్ల రోజువారీ అవసరాలతో పాటు ఖరీదైన వస్తువుల ధరలు కూడా తగ్గుతాయని అన్నారు.

**రెండు పన్ను శ్లాబులపై చర్చ....** కేంద్రం ప్రతిపాదన ప్రకారం.. ఇప్పుడు కేవలం రెండు జీఎస్టీ శ్లాబులు మాత్రమే ఉండవచ్చు. దీనిలో 28 శాతం శ్లాబ్‌లో ఉన్న హానికర వస్తువులను మినహాయించి, మిగిలిన అన్ని వస్తువులను 18 శాతం శ్లాబ్‌లోకి తీసుకురావచ్చు. అదేవిధంగా, 12 శాతం శ్లాబ్‌లో ఉన్న వస్తువులను 5 శాతం శ్లాబ్‌లోకి తీసుకురావాలని ప్రతిపాదించారు. 40 శాతం పన్ను శ్లాబ్ కూడా ఉండే అవకాశం ఉంది. ఇది 6-7 హానికర, లగ్జరీ వస్తువులకు వర్తిస్తుంది.

**175 వస్తువుల ధరలు తగ్గుతాయా?...** మనీకంట్రోల్ నివేదిక ప్రకారం.. దాదాపు 175 వస్తువులపై జీఎస్టీ రేట్లను తగ్గించే అవకాశం ఉందని తెలిపాయి. ఇందులో ఆహార పదార్థాలు, బాదం, స్నాక్స్, రెడీ-టు-ఈట్ వస్తువులు, జామ్, నెయ్యి, వెన్న, ఊరగాయలు, ఆటో మొబైల్స్, ట్రాక్టర్లు, ఎలక్ట్రానిక్స్, ఏసీలు, ఫ్రిజ్‌లు వంటివి ఉన్నాయి. మంత్రుల బృందం (జీవోఎం) రేట్ తగ్గింపు ప్రతిపాదనను జీఎస్టీ కౌన్సిల్ అంగీకరిస్తే, ప్రస్తుతం సగటున 11.5 శాతంగా ఉన్న జీఎస్టీ రేటు 10 శాతం కంటే తక్కువకు తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు.

**ఆరోగ్య, జీవిత బీమాకు జీఎస్టీ మినహాయింపు...** ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియంలను జీఎస్టీ పరిధి నుంచి తొలగించాలని కూడా మంత్రుల బృందం ప్రతిపాదించింది.

దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం తగ్గుతుంది. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకారం, ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియంలపై పూర్తి మినహాయింపు ఇవ్వడం వల్ల సుమారు రూ. 9,700 కోట్ల వార్షిక ఆదాయ నష్టం జరుగుతుందని అంచనా. ఈ ప్రతిపాదనను కౌన్సిల్ ఆమోదిస్తే, సామాన్య ప్రజలకు ఇది ఒక పెద్ద ఉపశమనం అవుతుంది.




## కుట్రదారుడు హరీశే.. కవిత సంచలన ఆరోపణలు

హైదరాబాద్, సెప్టెంబర్ 3 : ప్రెస్ మీట్‌లో హరీశ్ రావు, సంతోష్ రావుపై కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. వీరిద్దరూ బీఆర్ఎస్ పార్టీని అస్తగతం చేసుకోవాలని కుట్రలు చేస్తున్నారని కవిత అన్నారు. మొత్తం వాళ్లే చేశారు నాన్నా.. అంటూ కవిత వారిరువురి మీదా తీవ్ర ఆరోపణలు గుప్పించారు. హరీష్‌రావు టార్గెట్‌గా ఎమ్మెల్సీ కవిత మీడియా సమావేశం నిర్వహించి మరీ తీవ్ర విమర్శలు గుప్పించారు. 'రేపు కేటీఆర్‌కు ఇదే జరుగుతుంది.. కేసీఆర్‌కు ఇదే జరుగుతుంది. సీఎం రేవంత్, హరీష్‌రావు ఒకే విమానంలో ప్రయాణించారు. రేవంత్ కాళ్లు హరీష్‌రావు పట్టుకున్నాకే ఈ కుట్రలు మొదలయ్యాయి. హరీష్‌రావుకు పాల వ్యాపారం ఉండేది. అధికారంలోకి రాగానే హాస్టళ్లకు పాలు సరఫరా చేశారని ఆరోపణలున్నాయి. రూ.లక్ష కోట్ల కుంభకోణం జరిగిందని రేవంత్ అంటారు.. కానీ హరీష్‌రావు గురించి మాట్లాడరు.. కేసీఆర్‌ను మాత్రమే టార్గెట్ చేస్తారు. కేసీఆర్‌పై సీబీఐ విచారణ వచ్చిందంటే.. అందుకు కారణం హరీష్‌రావు, సంతోష్‌రావే.' అంటూ కవిత ఆరోపించారు. 'కేసీఆర్‌తో మొదటి నుంచి హరీష్‌రావు లేరు. టీడీపీ నుంచి బయటకు వచ్చే సమయంలో కూడా.. ఎందుకు ఈ నిర్ణయం అంటూ హరీష్‌రావు ప్రశ్నించారు. హరీష్‌రావు ట్రబుల్ షూటర్ కాదు.. డబుల్ షూటర్. కేసీఆర్‌కు హరీష్‌రావు కట్టప్ప లాగా అంటారు.. హరీష్‌రావు ఒక దశలో తన పక్కన ఎమ్మెల్యేలను పెట్టుకోవాలని చూశారు. నా ప్రాణం పోయినా కేసీఆర్‌కు అన్యాయం జరగనివ్వను. నాపై ఇన్ని కుట్రలు, ఇన్ని అవమానాలు అవసరమా? ఎన్నో జన్మల పుణ్యముంటే కేసీఆర్‌కు కూతురిగా పుట్టా. కేసీఆర్‌ను, పార్టీని నేనెందుకు ఇబ్బంది పెట్టాలనుకుంటా? అధికారంలో ఉన్నా.. లేకున్నా.. నేను ఒకేలా ఉన్నా. అధికారంలో ఉన్నా.. నన్ను ప్రతిపక్ష ఎంపీగానే చూశారు. ఆరడుగుల బుల్లెట్టే నన్ను గాయపరిచింది.' అంటూ కవిత తన ప్రెస్ మీట్ లో ఆద్యంతం హరీశ్ రావుని టార్గెట్ చేశారు.

# భారత్‌పై విషం చిమ్ముతున్న ట్రంప్!

## భారత్‌కు ట్రంప్ వెర్రీ బ్యాడ్‌న్యూస్.. ఆ కంపెనీలు కూడా వెనక్కి వెళ్లే ఛాన్స్..!

ఎన్నో ఏళ్లుగా భారత్ భారీగా టారిఫ్స్‌తో భారత్ బిజినెస్ చేస్తుంది. మన తెలివి తక్కువగా సుంకాలు వేయడంలో వారు ఇంత కాలం బిజినెస్ చేశారు. అంటూ భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి అక్కసు వెళ్లగక్కారు. దీంతో యుఎస్ ప్రొడక్షన్ నిలిచిపోయింది. హార్లీ డేవిడ్సన్ వంటి ఎన్నో కంపెనీలు ఇండియాకు వెళ్లాయి. వాటిని తిరిగి రప్పిస్తున్నాం. చైనా, మెక్సికో, కెనడా నుంచి కూడా కంపెనీలు మన అమెరికాకు వస్తాయని వ్యాఖ్యానించారు. సోషల్ మీడియాలో ఆ వీడియో వైరల్ అవుతుంది. ఆగస్టు 17 నుంచి భారత పై 50% అమెరికా టారిఫ్స్ విధింపు మొదలైంది. ఆ తర్వాత కూడా భారత్ పై ట్రంప్ అక్కసు వెళ్లగక్కారు అంతేకాదు వైట్ హౌస్ అధికారులు కూడా భారత పై రోజుకో విధంగా విషం చిమ్ముతున్నారు. ఇది రష్యా, చైనా, ఇండియా అధ్యక్షులు కలవడం ఒక సిగ్గుమాలిన చర్యను కూడా వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా తాజాగా మరోసారి ట్రంప్ భారత్ పై 50% సుంకాలకు వెనక్కి తగ్గేదే లేదని వ్యాఖ్యానించారు. మనం కూడా సుంకాల విధించకపోతే వారు పెద్ద మొత్తంలో బిజినెస్ చేసి మన దేశాన్ని ముంచుతారని ట్రంప్ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి హార్లీ డేవిడ్సన్ అనే సూపర్ బైక్ కంపెనీ గురించి కూడా ట్రంపు వ్యాఖ్యానించారు. నిన్న జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలా ఏళ్లుగా ఏకపక్షంతో భారత్ మన దేశంపై సుంకాలు విధిస్తుందని చెప్పారు. ప్రపంచంలో దాదాపు అత్యధికంగా భారత్ సుంకాల విధిస్తోందన్నారు.



**మరింత చౌకగా..** ఇదిలా ఉండగా భారత్ క్రూడ్ ఆయిల్ మరింతగా చౌకగా అందించేందుకు రష్యా ఆఫర్ చేసింది రష్యా డిస్కౌంట్ పెంచడమే ఎందుకు కారణం బేరాలు ధర పై మూడు నుంచి నాలుగు డాలర్ల మీద తగ్గనుంది ప్రస్తుతం ఇండియా రోజుకు 5.4 మిలియన్ ఆయిల్ దిగుమతి చేస్తుంది.

అందులో 36% రష్యా నుంచే కొనుగోలు చేస్తుంది. అమెరికా ఎంత ఒత్తిడి చేసిన భారత్ మాత్రం రష్యాతో చైనాకు దగ్గర అవుతూనే ఉంది.




# రాజకీయ ప్రళయాన్ని సృష్టిస్తోంది...

# కాళేశ్వరం కాక!

## సీబీఐ ఎంట్రీ ఇంకెప్పుడు?

తెలంగాణ రాజకీయాల్లో కాళేశ్వరం కాక రేపుతోంది. పదిహేనేళ్ళపాటు ఓ వెలుగు వెలిగిన ఓ రాజకీయ పార్టీ చిన్నాభిన్నమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఓ కుటుంబంలో చిచ్చు పెట్టింది కాళేశ్వరం ప్రాజెక్టు. ఈ నేపథ్యంలో దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన విచారణ సంస్థగా సీబీఐకి పేరుంది. సీబీఐ విచారణని ఈ రోజుకి అంతా కోరుతారు ఏ కేసు అయినా తీవ్రం అని భావిస్తే సీబీఐకి ఇచ్చేయమంటారు. అంతలా నమ్మకం సీబీఐ మీద జనంలో ఉందని రాజకీయ జనం అభిప్రాయం. అందుకే సీబీఐ విచారణకు సిద్ధమేనా అని ప్రత్యర్థులను సవాల్ చేస్తూంటారు. ఇదిలా ఉంటే తెలంగాణాలో కాళేశ్వరం ప్రాజెక్ట్ అటు తిరిగి ఇటు తిరిగి సీబీఐ విచారణ దాకా వెళ్ళింది. ఏకంగా తెలంగాణా ప్రభుత్వం సీబీఐ విచారణ కోరుతూ నిర్ణయం తీసుకుంది.

**అతి పెద్ద ఖర్చుతో కూడిన ప్రాజెక్ట్ :** కాళేశ్వరం ప్రాజెక్ట్ ని భారీ ఎత్తున ఖర్చు చేసి మరీ నిర్మించారు. ఏకంగా ఒక లక్షా 47 వేల కోట్ల రూపాయలు ఈ ప్రాజెక్ట్ కి ఖర్చు అయింది అని నివేదికలు చెబుతున్నారు. గోదావరి నీటిని ఒడిసిపట్టుకుని తెలంగాణా ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసుకోవడానికి ఈ భారీ ప్రాజెక్ట్ ని తలపెట్టినట్లుగా బీఆర్ఎస్ నేతలు చెబుతూ ఉంటారు. అయితే అప్పులు భారీ వడ్డీలకు తెచ్చి మరీ ఈ ప్రాజెక్ట్ ని చేపట్టారని అయితే ఈ ప్రాజెక్ట్ ద్వారా అనుకున్న లక్ష్యాలు నెరవేరలేదని కానీ అప్పుల కుప్పలా తెలంగాణా మారడానికి ఒక కారణంగా మారిందని అధికార కాంగ్రెస్ పార్టీ ఆక్షేపిస్తోంది.

**సీబీఐ అక్నాలెడ్జ్మెంట్ తో :** ఇదిలా ఉంటే ఈ కేసుని సీబీఐకి అప్పగిస్తునామని తెలంగాణా ప్రభుత్వం చెప్పడమే కాదు సీబీఐకి తెలియజేసింది దాంతో సీబీఐ ఈ కేసు విషయంలో అక్నాలెడ్జ్మెంట్ ఇచ్చింది. అంటే ఈ కేసు విషయంలో సీబీఐ ఏమి చేయబోతోంది అన్నదే ఇపుడు చర్చగా ఉంది. మరో వైపు చూస్తే కాళేశ్వరం ప్రాజెక్ట్ మీద సీబీఐ విచారణ మీద హైకోర్టులో బీఆర్ఎస్ నాయకులు పిటిషన్ దాఖలు చేశారు. దాని మీద విచారించిన హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 7వ తేదీ వరకూ కేసీఆర్ మీద కానీ హరీష్ రావు మీద కానీ ఎలాంటి చర్యలు తీసుకోవద్దు అని ఆదేశాలు జారీ చేసింది.

**కేసుల భారంతో సీబీఐ :** మరో వైపు చూస్తే దేశంలో అత్యంత ప్రతిష్ట కలిగిన దర్యాప్తు సంస్థగా సీబీఐ ఉంది. దాంతో దేశవ్యాప్తంగా సీబీఐ మీద కేసుల భారం ఉంది. ఇప్పటిదాకా చూస్తే సీబీఐ పరిధిలో ఉన్న అవినీతి కానీ అక్రమాలపైన వివిధ కోర్టులలో విచారించే కేసుల సంఖ్య కానీ చూస్తే కనుక 7,022 ఉన్నట్లుగా చెబుతున్నారు ఇది ఎవరో చెప్పినది కాదు కేంద్ర నిఘా కమిషన్ ప్రతీ ఏటా ఇచ్చే నివేదికలో వెల్లడించింది. ఇవన్నీ పెండింగులో ఉండగా మరో 379 కేసులు అయితే ఏకంగా రెండు దశాబ్దాలకు పైగా పెండింగులో ఉన్నట్లుగా కూడా చెబుతున్నారు. అలాగే మరో 1506 కేసులు చూస్తే కనుక అవి 2024 డిసెంబర్ నెలాఖరు నాటికి పెండింగులో ఉన్నాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్ట్ లో చోటు చేసుకున్న అవినీతి నిగ్గు తేల్చాలని తెలంగాణా ప్రభుత్వం సీబీఐని కోరింది. సీబీఐ ఈ కేసుని విచారించినా ఇప్పట్లో తేలుతుందా అన్నదే చర్చ. అంతే కాదు మరో మూడేళ్ళలో తెలంగాణాలో ఎన్నికలు ఉన్నాయి అప్పటికి అయినా తేలే అవకాశాలు చూస్తే చాలా తక్కువ అని అంటున్నారు ఇవన్నీ పక్కన పెడితే సీబీఐ ఎపుడు ఎంట్రీ ఇస్తుంది అన్నది కూడా చర్చగా ఉంది. ఇక సీబీఐ ఎంట్రీ ఇస్తే కనుక నోటీసులు ఇచ్చి మరీ బీఆర్ఎస్ పెద్దలను విచారణకు పిలుస్తుందా అన్నది మరో ఉత్కంఠను కలిగించే విషయంగా చెబుతున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

చురకలు






## ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడి

హైదరాబాద్: భారత రాష్ట్ర సమితిలోని కొందరు తనపై పనిగట్టుకుని దుష్ప్రచారం చేశారని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ సంతోష్‌ను ఉద్దేశించి ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. భారత రాష్ట్ర సమితి నుంచి సస్పెండ్ చేసిన నేపథ్యంలో కవిత మీడియా సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో మాట్లాడారు. భారత రాష్ట్ర సమితి ప్రాథమిక సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఈ సందర్భంగా కవిత ప్రకటించారు. పార్టీలో ఉంటూ కేవలం డబ్బు సంపాదించుకోవాలనే ఆలోచన ఉన్నవాళ్లు, వ్యక్తిగత లబ్ధి పొందాలనుకునే వాళ్లు మేం ముగ్గురం కలిసి ఉండకూడదని ఇలా కుట్రలు చేశారని కవిత ఆరోపించారు. ఈ సందర్భంగా ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. “మా కుటుంబం బాగుండొద్దు.. మేం విచ్ఛిన్నమైతేనే వాళ్లకు అధికారం వస్తుంది. నేను, నాన్న, అన్న కలిసి ఉండటం చాలా మందికి ఇష్టం లేదు. దీనిలో భాగంగా మొదటిగా నన్ను బయటకు పంపించారు. అదిక్కడితో ఆగదు. నాన్నా.. మీ చుట్టూ ఏం జరుగుతుందో ఓసారి చూసుకోండి. రేపటి నాడు ఇదే ప్రమాదం రామన్న (కేటీఆర్)కు, మీకూ పొంచి ఉంది. భారత రాష్ట్ర సమితిని హస్తగతం చేసుకునే కుట్రలోనే నన్ను బయటకు పంపించారు” అని కవిత వ్యాఖ్యానించారు.

**అవన్నీ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలా?...** ‘అక్రమ కేసులు పెట్టి తిహాడ్ జైలులో ఐదున్నర నెలలు ఉండి వచ్చాక గతేడాది నవంబర్ 23 నుంచి ప్రజాక్షేత్రంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టానని కవిత తెలిపారు. గురుకులాలు, బీసీ రిజర్వేషన్లు, మహిళలకు రూ.2500 ఆర్థిక సాయం అందించాలని పోస్ట్ కార్డు ఉద్యమం చేశామన్నారు. తెలంగాణ తల్లి స్వరూపాన్ని మార్చినపుడు గళమెత్తినట్లు చెప్పారు. బనకచర్ల, భద్రాచలం సమీపంలోని ముంపు గ్రామాల అంశాలపై రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించినట్లు కవిత తెలిపారు. సీఎం సొంత జిల్లాలో భూనిర్వాసితులకు అండగా ఉన్నామని చెప్పారు. 47 నియోజకవర్గాల్లో పార్టీ కార్యకర్తలను కలుపుకొని.. గులాబీ కండువాలతో అనేక ప్రజాసమస్యలపై మాట్లాడామన్నారు. ఇవన్నీ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు ఎలా అవుతాయని ఆమె ప్రశ్నించారు. ఈ అంశంపై భారత రాష్ట్ర సమితి పెద్దలు పునరాలోచన చేయాలన్నారు.

**హరీశ్‌రావు, సంతోష్ ఇళ్లల్లో బంగారం ఉంటే బంగారు తెలంగాణ అవుతుందా?...** “కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీసీల అంశంపై మాట్లాడుతుంటే పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్నట్లు చిలువలు పలువలుగా ప్రచారం చేశారు. సామాజిక తెలంగాణకు కట్టుబడి ఉన్నానని చెప్పాను. దానిలో తప్పేముంది? నా తండ్రి కేసీఆర్ చిటికెన వేలు పట్టుకుని ఓనమాలు నేర్చుకున్నా. ఆయన స్ఫూర్తితోనే సామాజిక తెలంగాణ అని మాట్లాడా. స్వతంత్ర భారతంలో దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని చెప్పిన గొప్ప నాయకుడు కేసీఆర్. చెప్పింది చెప్పినట్లు ఆయన చేశారు.

ప్రతి కులాన్ని కాపాడుకునే ప్రయత్నం చేశారు. అది సామాజిక తెలంగాణ కాదా? నేనేమైనా తప్పు మాట్లాడానా? సామాజిక తెలంగాణ భారత రాష్ట్ర సమితికి అవసరం లేదా? భౌగోళిక తెలంగాణ వస్తే సరిపోతుందా?బంగారు తెలంగాణ అంటే హరీశ్‌రావు, సంతోష్ ఇళ్లల్లో బంగారం ఉంటే అవుతుందా?సమాజంలో ప్రతి ఒక్కరూ బాగుంటేనే బంగారు తెలంగాణ అవుతుంది.

**రామన్నా.. బుజ్జగించి అడుగుతున్నా..** నేను రామన్న (కేటీఆర్)ను గడ్డం పట్టుకొని, బుజ్జగించి అడుగుతున్నా. ఒక చెల్లిని, మహిళా ఎమ్మెల్సీని.. నాపై కుట్రలు జరుగుతున్నాయని గతంలో తెలంగాణ భవన్‌లో ప్రెస్‌మీట్ పెట్టి చెప్పా. మీరు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఏం జరిగిందో నాకు ఫోన్ చేయరా అన్నా? నేను కూర్చొని ప్రెస్‌మీట్ పెడితేనే న్యాయం జరగలేదంటే.. మామూలు మహిళా కార్యకర్తకు పార్టీలో అన్యాయం జరిగితే స్పందిస్తారా.. నాకైతే అనుమానమే. హరీశ్‌రావు, సంతోష్ గురించి ఆలోచించాలని కేసీఆర్‌కు బిడ్డగా చెబుతున్నా. తెలంగాణ ఉద్యమంలో మొదట్నుంచీ హరీశ్‌రావు లేరు. పార్టీ పెట్టిన 10 నెలల తర్వాత వచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు ఎప్పుడో లొంగిపోయారు. ఆయన్ను గమనించుకో రామన్న (కేటీఆర్). సీఎం రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావు ఒకే విమానంలో ప్రయాణించారా? లేదా? చెప్పాలి. సంతోష్, హరీశ్‌రావు గ్యాంగ్‌లు భారత రాష్ట్ర సమితికి పట్టిన జలగలు” అని కవిత తీవ్రస్థాయిలో విమర్శించారు.




మెదక్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయలను మంజీరా వరద ఉద్ధృతి వీడటం లేదు. 20 రోజులుగా ఏడుపాయల వనదుర్గమ్మ జలదిగ్బంధంలోనే ఉంది. భక్తుల భద్రత దృష్ట్యా రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసి దర్శనం కల్పిస్తున్నారు. గుడి ముందు ఉన్న మూడు పాయలు కలిసి ఒకే పాయగా.. గుడి వెనుక ఉన్న నాలుగు పాయలు అన్నీ కలిసి ఒకే పాయగా మంజీరా నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది.




కంటోన్మెంట్ (సికింద్రాబాద్): భారత రాష్ట్ర సమితి నుంచి ఎమ్మెల్సీ కవిత సస్పెన్షన్‌పై ఆ పార్టీ నేత, మాజీ మంత్రి మల్లారెడ్డి స్పందించారు. పార్టీని ధిక్కరించిన ఆమెపై వేటు వేయడం సరైన నిర్ణయమేనని చెప్పారు. బోయిన్‌పల్లిలో శ్రీవెంకటేశ్వర లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన గణనాథుడి ప్రత్యేక పూజా కార్యక్రమంలో మల్లారెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. “కేసీఆర్‌కు కుమార్తె, కుమారుడు ముఖ్యం కాదు.. ఆయనకు పార్టీయే ముఖ్యం. దేశవ్యాప్తంగా ఇలాంటి సస్పెన్షన్లు ప్రతి పార్టీలో జరిగాయి. ప్రతి కుటుంబంలో గొడవలు సహజం. తెలంగాణ ప్రజలే కేసీఆర్‌కు ముఖ్యం. తన కుమార్తె, కుమారుడి కోసం పార్టీని ఆయన నాశనం చేసుకోలేరు. కాళేశ్వరంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ విషయంలో సీబీఐ మాత్రమే కాదు.. ఎవరూ ఏమీ చేయలేరు. సీబీఐ పేరుతో కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టాలనుకోవడం సరికాదు. ఆయనలాంటి గొప్ప వ్యక్తి తెలంగాణ నాయకుడిగా ఉండటం మనందరి అదృష్టం. కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం అంశంపై ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ డ్రామాలు చేస్తోంది” అని మల్లారెడ్డి విమర్శించారు.




హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి నేతలను ప్రజలు తిరస్కరించారని, అలాంటి వారి వెనుక తాను ఎందుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ కవిత.. హరీశ్‌రావు వెనుకాల రేవంత్‌రెడ్డి ఉన్నారని ఆరోపించారు. ఆమె వ్యాఖ్యలపై సీఎం తాజాగా స్పందించారు. “నేను కవిత వెనుకున్నాను అని కొందరు అంటున్నారు. హరీశ్‌రావు, సంతోష్ వెనుక ఉన్నానని మరికొందరు అంటున్నారు. నేను ఎవరి వెనుకా లేను. ఇప్పటికే ప్రజలు వాళ్లను తిరస్కరించారు. అలాంటి వారితో కలిసే సమయం నాకు లేదు. ప్రజల వెంట మాత్రమే ఉంటాను. మీ కుల, కుటుంబ పంచాయితీల మధ్య మమ్మల్ని తీసుకురావొద్దు”అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

## దేశంలో యూరియా సరైన సమయంలో ఉత్పత్తి చేయలేదు: మంత్రి తుమ్మల

దిల్లీ: ఇతర దేశాల నుంచి యూరియా దిగుమతి చేసుకోలేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో యూరియా సరైన సమయంలో ఉత్పత్తి చేయలేదన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న కొరత తెలంగాణను కూడా పీడిస్తోందని పేర్కొన్నారు. “రాష్ట్రానికి 9.8 లక్షల టన్నుల్లో 5.3 లక్షల టన్నులే సరఫరా చేశారు. ప్రతి నెలలో పంపిణీ చేయాల్సిన యూరియాలో కోత పెట్టారు. సెప్టెంబర్‌లో రావాల్సిన 1.6 లక్షల టన్నులు సరఫరా చేయలేదు. ఇతర దేశాల నుంచి వస్తోన్న యూరియానే సరఫరా చేస్తున్నారు.

రామగుండం పరిశ్రమ నుంచి కూడా ఒక్క బస్తా ఇవ్వలేదు. కొరత కారణంగా రాష్ట్ర రైతులు ఆందోళనలో ఉన్నారు. అన్ని పంటలకు సెప్టెంబర్‌లో యూరియా చివరి కోటా వేయాలి. ఇటీవల భారీ వర్షాల వల్ల ఆరేడు జిల్లాల్లో అన్ని శాఖల్లో తీవ్ర నష్టం సంభవించింది.

రాష్ట్రంలో పంటలు, రోడ్లు, మౌలిక సౌకర్యాలు దెబ్బతిన్నాయి. చేనేత రంగంపై పన్నులు ఉండకూడదని కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నాం. వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ రద్దు చేయాలని కేంద్రాన్ని కోరుతున్నాం. ఆయిల్‌పామ్ దిగుమతిపై సుంకాలు 40 



శాతానికి పెంచాలి” అని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

**కవిత సస్పెన్షన్ వ్యవహారంతో మాకు సంబంధం లేదు...** భారత రాష్ట్ర సమితి నుంచి కవిత సస్పెన్షన్ వ్యవహారంతో తమకు సంబంధం లేని వ్యవహారం అని తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

కాళేశ్వరం వ్యవహారాన్ని సీబీఐ విచారణకు ఇచ్చినట్లు తెలిపారు. ఏది ఉన్నా.. వాళ్లే చూసుకుంటారన్నారు.


## కవిత.. కేసీఆర్ వదిలిన బాణమని నా సందేహం: మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్: కేసీఆర్ కుటుంబ సభ్యులు అవినీతి సొమ్మును పంచుకొని ఇప్పుడు తిట్టుకుంటున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. కవిత చెప్పిన విషయాలన్నీ వాస్తవమేనని, రాష్ట్రంలో పదేళ్లపాటు యథేచ్ఛగా దోపిడీ జరిగిందన్నారు. “పంపకాల్లో విభేదాలు వచ్చి ఇప్పుడు బయటపడుతున్నారు. వాళ్ల పార్టీ లేకుండా వారే చేసుకుంటున్నారు. కవిత ఇన్ని రోజులు బాణాన్ని కేటీఆర్ మీదకు ఎక్కుపెట్టారు. అకస్మాత్తుగా ఆ బాణాన్ని హరీశ్‌రావు మీదకు తిప్పారు. అమెరికా వెళ్లి వచ్చాక కవిత వైఖరిలో మార్పు కనిపించింది.

కవిత.. కేసీఆర్ వదిలిన బాణమని నా సందేహం. కేసీఆర్ కుటుంబంలో ఇది కొత్త నాటకం”అని అన్నారు.

## పార్టీలో ఉన్నప్పుడు వాళ్ల అక్రమాలపై ఎందుకు చర్యలు తీసుకోలేదు?: కవితకు రఘునందన్ ప్రశ్న



హైదరాబాద్: రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావు కుమ్మక్కయ్యారని తాను గతంలోనే చెప్పానని భాజపా ఎంపీ రఘునందన్ రావు అన్నారు. నేడు ప్రెస్‌మీట్‌లో కవిత కొత్తగా చెప్పింది ఏం లేదని పేర్కొన్నారు. వాళ్ల పార్టీ వ్యవహారాల గురించి మాట్లాడదల్చుకోలేదని తెలిపారు. కవిత చెప్పిన మోకిల ప్రాజెక్టు అవకతవకల గురించి విచారించాలని చెప్పారు. పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, నవీన్‌రావు చేసిన అక్రమాలపై విచారణ జరపాలన్నారు. “జడ్పీ అధ్యక్షుడిగా నన్ను ఎవరు ఓడించారో గతంలో కేసీఆర్‌కు చెప్పాను. ఆరోజు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మెదక్ ఎంపీ ఎన్నికల్లో ఇబ్బందిపెట్టాలని చూసినట్లు గతంలోనే చెప్పా. కవిత ఇంకా వేరే విషయాలు కూడా మాట్లాడితే బాగుండేది. ఆమె మాటలతో భారత రాష్ట్ర సమితి అవినీతి పునాదుల మీద విస్తరించబడిందని తేలింది. మళ్లీ వచ్చే ఎపిసోడ్‌లో భారత రాష్ట్ర సమితి పెద్దలు చేసిన అవినీతిని బయటపెడితే బాగుంటుంది. పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌రావు చేసిన అక్రమాల మీద మీరు పార్టీలో, ప్రభుత్వంలో ఉన్నప్పుడు ఎందుకు చర్యలు తీసుకోలేదు” అని రఘునందన్‌రావు కవితను ప్రశ్నించారు.

## కాంగ్రెస్, భాజపా కలిసి భారత రాష్ట్ర సమితిపై కుట్ర చేస్తున్నాయి: కేటీఆర్

ఎర్రవల్లి: కాంగ్రెస్ 21 నెలల పాలనలో ఏ ఒక్క వర్గమూ సంతోషంగా లేదని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఎర్రవల్లిలో మీడియాతో ఆయన మాట్లాడారు. “ప్రతి రైతూ అప్పటి రోజులే బాగుండేవని అంటున్నారు.

కాళేశ్వరం ఎత్తిపోతల ద్వారా హుస్సేన్‌సాగర్ వంటివి రోజుకు రెండు నింపొచ్చు. ఆ ప్రయత్నమే కేసీఆర్ చేశారు.

అంతటి గొప్ప కాళేశ్వరం కట్టిన కేసీఆర్‌పై సీబీఐ కేసులు పెడుతున్నారు. సీబీఐ అనేది భాజపా జేబు సంస్థ అని రాహుల్‌గాంధీ రోజూ అంటున్నారు. కాంగ్రెస్, భాజపా కలిసి భారత రాష్ట్ర సమితిపై కుట్ర చేస్తున్నాయి”అని కేటీఆర్ విమర్శించారు.



## కాళేశ్వరం నుంచి దృష్టి మరల్చేందుకే కవిత అంశం: బండి సంజయ్

హైదరాబాద్: కాళేశ్వరం అవినీతిపై ఎన్డీఎస్ఏ, విజిలెన్స్ రిపోర్టులు వచ్చాక కూడా కాలయాపన చేశారని, ఇప్పుడు సీబీఐకి అప్పగిస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు. మరి ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి ఎందుకు ఇవ్వట్లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. కవిత భారత రాష్ట్ర సమితికి రాజీనామా చేస్తే ఏంటని ప్రశ్నించారు. కాళేశ్వరం నుంచి దృష్టి మరల్చేందుకే కవిత అంశం ముందుకు వచ్చిందన్నారు. కాళేశ్వరం, గొర్రెలు, బర్రెల కుంభకోణంపై చర్చ జరగాలని అన్నారు.






## లావణ్య ఫిర్యాదు.. హీరో రాజ్ తరుణ్‌పై మరో కేసు

హైదరాబాద్: టాలీవుడ్ హీరో రాజ్ తరుణ్‌పై మరో కేసు నమోదు అయింది. కోకాపేటలోని విల్లాలో ఉండగా రాజ్ తరుణ్ అనుచరులను పంపి తనపై దాడి చేయించాడని నార్సింగి పోలీస్ స్టేషన్‌లో లావణ్య ఫిర్యాదు చేసింది. మూడు వేర్వేరు సందర్భాలలో తనను దూషిస్తూ దాడి చేశారని లావణ్య తన ఫిర్యాదులో పేర్కొంది. 2016లో హీరో రాజ్ తరుణ్‌తో కలిసి కోకాపేటలో విల్లా కొనుగోలు చేశానని, వ్యక్తిగత విభేదాల కారణంగా 2024 మార్చి నెలలో రాజ్ తరుణ్ ఇంటిని ఖాళీ చేశాడని లావణ్య తెలిపింది. విల్లాలో ఉండగా రాజ్ తరుణ్ మనుషులు తనపై విచక్షణా రహితంగా దాడి చేశారని ఆమె పేర్కొంది. ఇంటికి సంబంధించిన కేసు ఇంకా కోర్టులో పెండింగ్‌లో ఉండగా బెల్టులు, గాజు సీసాలతో కొట్టి, ధరించిన బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారని లావణ్య తెలిపింది. తన పెంపుడు కుక్కలను కూడా చంపేశారని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో పోలీసులు రాజ్ తరుణ్‌పై కేసు నమోదు చేశారు. రాజ్ తరుణ్‌తో పాటు మణికంఠ తంబాడీ, రాజ్ శేఖర్, సుశి, అంకిత్ గౌడ్, రవితేజలపై కూడా కేసు నమోదు చేశారు.

# పత్రికల పంపిణీలో పేపర్ బాయ్స్ నిరుపమాన సేవలు


## పేపర్ బాయ్స్ సేవలను గుర్తించాలి - సెప్టెంబరు 4... అంతర్జాతీయ పేపర్‌బాయ్ దినోత్సవం



ఆధునిక సమాజంలో ప్రింట్ మీడియా కన్నా సోషల్ మీడియా వేగవంతంగా ముందుకు సాగుతోంది. స్మార్ట్ ఫోన్ లు అందుబాటు లోకి వచ్చాక డిజిటల్ యుగంలో సామాజిక, డిజిటల్ మాధ్యమాల ప్రభావం నానాటికీ పెరిగిపోతోంది. అప్డేట్స్ తో వాట్సాప్, ఫేస్ బుక్, ట్విట్టర్ మాధ్యమాల ద్వారా విషయం వెనువెంటనే బహిరంగం అవుతుండగా, ప్రింట్ మీడియా వాటి వేగానికి, టెక్నిక్స్ కు పోటీ పడలేక పోతోంది. లైవ్ వీడియోలతో వస్తున్న అంశాలు, బ్రేకింగ్ న్యూస్ కోసం అధిక సంఖ్యాకులు ప్రభావితులు అవుతున్నారన్నది వాస్తవం. నేటి వార్త తెల్లవారి మార్కెట్ లోకి ప్రచురితం అయి వచ్చే సాంప్రదాయ పత్రికల కోసం చాలామంది ఎదిరి చూసే పరిస్థితులు కనిపించడం బాధాకరం. ఒకనాడు నిత్యం ప్రపంచంలో ఏ మూల ఏమి జరిగినా ప్రజలకు వార్తా పత్రికలు మాత్రమే చెరవేసేవి. ప్రభుత్వాలకు ప్రజలకు మధ్యవర్తిత్వం వహిస్తూ వారథులుగా పత్రికలు పని చేసేవి. ప్రజా బాహుళ్యానికి నిత్యం చైతన్య పరుస్తూ, ప్రగతికి బాటలు వేసేవి. ఇప్పటికీ కొన్ని ఆ పనులు చేస్తూనే ఉన్నాయి. గతంలో దిన, వార, పక్ష, మాస, త్రైమాసిక, పత్రికలు...సాహిత్య, విద్య, ఉపాధి, పరిశోధన, సినిమా, హాస్య, విజ్ఞాన, ఆధ్యాత్మిక పత్రికలు... చందమామ, బాలమిత్ర, బొమ్మరిల్లు లాంటి పిల్లల పత్రికలు వివిధ రకాలుగా అలరించేవి. దిన పత్రికలు ప్రాచుర్యాన్ని పొందాక, సమాచార వ్యవస్థ అంతంత మాత్రమే ఉన్న నాటి రోజుల్లో నేటి పేపర్ రేపు, ఉదయం రావాల్సిన పత్రికలు మధ్యాహ్నం పాఠకుల చేతికి చేరేవి. అయితే వేగవంతంగా పాఠకుని గుమ్మానికి పత్రికలను చేర్చేందుకు విప్లవాత్మక మార్పులు తెచ్చి, ప్రచురణ కేంద్రాలను పెంచుకుని, సర్క్యులేషన్లను త్వరితం చేసుకున్నాయి. అలాంటి స్థితిలో పత్రికలు పాఠకునికి చేర్చడంలో కీలక పాత్ర పోషించింది నిస్సందేహంగా పేపర్ బాయ్. తొలి పేపర్ బాయ్‌గా గుర్తింపు పొందిన బార్నీ ఫ్లాహెర్టీ జయంతిని పురస్కరించుకొని ప్రతి ఏటా సెప్టెంబరు 4న అంతర్జాతీయ పేపర్‌బాయ్ దినోత్సవం జరుపుతున్నారు. నియమిత స్థలాల్లో పాత్రికేయులు ఆహరహం శ్రమించి, సేకరించి పంపిన వార్తలను ఉప సంపాదకులు సరిచేసి, సంపాదకుని ఆమోద ముద్ర పడిన తర్వాత ముద్రణకు రంగం సిద్ధం చేశాక, ముద్రిత దిన పత్రికలను పాఠకులకు చేరవేయడం లో పేపర్‌బాయ్‌ల కష్టాలు, ఇబ్బందులు అందరికీ తెలిసిందే. నిర్ణీత ప్రదేశాలలో పంపిణీ వాహనాల కోసం అర్ధ రాత్రి దాటి నప్పటి నుంచి ఎదిరి చూస్తూ, అందుకున్న కట్టలు విప్పి, సెట్లుగా అమర్చుకుని, ఇళ్ళల్లో చందాదారులు, కొనుగోలు దారులు నిద్రలేచి, లేవక ముందే నడిచి లేదా సైకిల్‌పై వెళ్లి గడప గడపకు ఆగి, ముంగిళ్ళలో వేసి, తలుపుల బిడియాలకు చెక్కి పై అంతస్తులో ఉంటే ఎగురవేత ద్వారా వేసిన, వేస్తున్న విషయాలు నిత్య జ్ఞాపకాలే. స్వాతంత్రోద్యమ సమయంలో లోకమాన్యుడు బాలగంగాధర్ తిలక్ పీపుల్స్‌వార్ పత్రికకు కొన్నాళ్లపాటు పేపర్ బాయ్‌గా పనిచేశారు. అలాగే ప్రఖ్యాత శాస్త్రవేత్త, దివంగత భారత రాష్ట్రపతిగా పనిచేసిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విద్యార్థి దశలో పేపర్ బాయ్‌గా పని చేయడం, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ, తెలంగాణ తొలి బి సి కమిషన్ ఛైర్మెన్, ప్రముఖ తత్వవేత్త, శతాధిక గ్రంథ రచయిత బి ఎస్ రాములుగా చిర పరిచితులైన బేతి శ్రీరాములు పేపర్ ఏజెంటుగా, బాయ్ గా ఇలా గొప్పవారు పేపర్ బాయ్‌లుగా పనిచేసిన వారే అన్న విషయం తెలుసు కోవాలి. అమెరికా లాంటి దేశాలలో వృత్తిపరంగా పెద్ద ఉద్యోగాలు చేస్తున్నా, నామోషీ గా భావించక వివిధ కారణాలతో కొందరు దిన పత్రికలు పంచడం చేస్తుండటం విశేషం. పేపర్ బాయ్ పేరుతో జయశంకర్ దర్శకత్వం వహించిన, భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన...సంతోష్ శోభన్, రియా సుమన్ తాన్యా హోప్, పోసాని కృష్ణ మురళి, అన్నపూర్ణ, బిత్తిరి సత్తి, విద్యుల్లేఖ రామన్, కల్పలత, సన్నీ, అభిషేక్ మహర్షి, మహేష్ విట్ట తదితర తారాగణం నటించిన ఒక తెలుగు చలన చిత్రం 2018, ఆగష్టు 31న విడుదల కావడం గమనార్హం. వాస్తవానికి ప్రింట్ మీడియా ఇంకా ఎన్నో రకాల ప్రయోజనాలను కల్పిస్తున్నే ఉంది. అమెరికా, కెనడా వంటి అనేక దేశాలు తమ ప్రకటనల వాహకాలుగా ప్రింట్ మీడియాపై ఎక్కువగా ఆధారపడు తున్నాయనే విషయం మరిచి పోలేనిది. ప్రభుత్వాలు కూడా చిన్న పెద్ద పత్రికలకు చేయూతను అందిస్తున్నాయి. పాత్రికేయులకు ఇళ్ళ స్థలాలు, ఆరోగ్య వైద్య సదుపాయాలు, ప్రయాణ టిక్కెట్ టిక్కెట్ల రాయితీ గల బస్ పాస్ లు, వివిధ రకాల యాడ్స్ తదితరాలతో ప్రోత్సాహలను అందించడం జరుగుతున్నది. అలాగే చదువుకోసం, ఆర్థిక స్వావలంబన కోసం, జీవనోపాధి కోసం చాలామంది చాలా పత్రికలకు పేపర్ బాయ్స్ గా పనిచేస్తున్న వారిని ప్రభుత్వాలు, యాజమాన్యాలు గుర్తించాల్సిన అవసరం ఉంది. చేస్తున్న పని చిన్నదా పెద్దదా అన్నది కాకుండా, వారి సేవలను గుర్తించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. **రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**


# గ్రాండ్ ఓల్డ్ మాన్ ఆఫ్ ఇండియా దాదాభాయి నౌరోజీ

## సెప్టెంబర్ 4...దాదాభాయి నౌరోజీ జయంతి



దాదాభాయి నౌరోజీ కాంగ్రెస్ పార్టీకి వ్యవస్థాపకుల్లో ఒకరు. ప్రాతఃస్మరణీయులు. ఆ పార్టీ వ్యవస్థాపక సభ్యుల్లో ఆయన ఒకరు. మూడు పర్యాయాలు జాతీయ కాంగ్రెస్ వార్షిక సభలకు అధ్యక్షత వహించిన నాయకులు. నౌరోజీ జీవిత చరిత్ర 19 వ శతాబ్దంలో భారతీయ జాతీయవాదుల పోరాటాలను స్పష్టంగా తెలుపుతుంది. భారత జాతీయ కాంగ్రెస్ స్థాపించక ముందునుంచే స్వాతంత్ర్యం కోసం గళమెత్తారు. నౌరోజీ, ఎ. ఓ. హ్యూమ్, దిన్షా ఎదుల్జీ వాచాతో కలిసి భారత జాతీయ కాంగ్రెస్ ను స్థాపించారు. 1892 నుండి 1895 వరకు ఇంగ్లాండ్ చట్టసభ అయిన యునైటెడ్ కింగ్‌డమ్ హౌస్ ఆఫ్ కామన్స్ లో కొనసాగారు. ఆయన ఆ పదవి పొందిన మొదటి ఆసియా వ్యక్తి. దాదాభాయ్ నౌరోజీ (సెప్టెంబర్ 4, 1825 %-% జూన్ 30, 1917) పార్సీ మతానికి చెందిన విద్యావేత్త, మేధావి, పత్తి వ్యాపారి, తొలితరం రాజకీయ, సామాజిక నాయకులు, బ్రిటీష్ చట్టసభ సభ్యుడైన తొలి ఆసియా ఖండ వాసి అయిన దాదాభాయ్ నౌరోజీ 1825 సెప్టెంబరు 4 న, బొంబాయిలో నవసారీలో ఒక పార్సీ కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి పలన్ జీదోర్జీ జొరాస్ట్రియన్ మత పురోహితులు. బరోడా మహారాజు మూడవ శాయాజీరావు గైక్వాడ్ సహాయంతో కళాశాల ఎలిఫెన్‌స్టన్ ఇన్‌స్టిట్యూట్‌లో చదివారు. తరువాత అక్కడే ఆచార్య పదవిని పొందారు. మహిళలకు విద్యను ప్రోత్సహించ దానికి జరిగిన ప్రత్యేక తరగతులులో ఆయన బోధించారు. తన జొరాస్ట్రియన్ మతంలో సంస్కరణల కోసం ఆయన పాటు పడ్డారు. నౌరోజీ ఆలోచనలు, ఆర్థికశాస్త్రంపై ఆధారపడినవి. కామా %ఈ% కో' అనే కంపెనీలో భాగస్వామి కావడానికి 1855 సంవత్సరంలో ఆయన లండన్ వెళ్లారు. ఆ కంపెనీ లివర్‌పూల్ లో బ్రిటన్‌లో స్థాపించబడిన మొదటి భారతీయ కంపెనీగా అవతరించింది. భారత స్థితి గతులను ఆంగ్లేయులకు విడమరచి చెప్పారు. నౌరోజీ ఇంగ్లాండ్‌లో లిబరల్ పార్టీలో చేరారు. మూడేళ్లలో దాదాభాయ్ రాజీనామా చేసి, తన సొంత వ్యాపార సంస్థ 'దాదాభాయ్ నౌరోజీ %ఈ% కో.' ప్రారంభించారు. ఇంగ్లండ్‌లో భారతీయులు స్థాపించిన తొలి వాణిజ్య సంస్థ అదే. 1865 నుండి 1866 వరకు, లండన్ విశ్వ విద్యాలయ కళాశాలలో గుజరాతీ భాషా ఉపాధ్యాయులుగా కూడా పనిచేశారు. 1865 లోనే, భారతీయ రాజకీయ, సామాజిక మరియు సాహిత్య సమస్యలు మరియు విషయాలను చర్చించి, ఇంగ్లాండ్ ఓటర్లకు అనుకూలంగా మార్చడం ఉద్దేశ్యంతో దాదాభాయ్ నౌరోజీ 'లండన్ ఇండియన్ సొసైటీని స్థాపించారు. ఆయన 'ఈస్ట్ ఇండియా అసోసియేషన్' ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. అది ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ యొక్క ప్రధాన సంస్థ, స్థాపన ప్రధాన ఉద్దేశం బ్రిటిష్ వారి ముందు భారతీయుల శక్తిని బలోపేతం చేయడం. 1874 లో బరోడా ఇన్సిట్యూట్ యొక్క మున్సి పోస్ట్ బాధ్యతను స్వీకరించారు. 1875 లో, అతను బొంబాయి మునిసిపల్ కార్పొరేషన్ సభ్యుడు అయ్యారు. నౌరోజీ 1886 లో మొదటిసారిగా బ్రిటిష్ పార్లమెంట్ పదవి కోసం పోటీ చేసి, ఓటమి పాలు కాగా, 1892 లో తన రెండవ ప్రయత్నంలో విజయం సాధించి, హౌస్ ఆఫ్ కామన్స్‌కు ఎన్నికైనారు. బ్రిటిష్ పార్లమెంటులో ఎన్నికైన మొదటి ఆసియా వ్యక్తిగా 1892 నుండి 1895 వరకూ పార్లమెంట్ సభ్యుడిగా యునైటెడ్ కింగ్?డమ్ హౌస్ ఆఫ్ కామన్స్ లో కొన సాగారు. బ్రిటిష్ పార్లమెంట్ లో భారత ఉప ఖండంలో వలస రాజ్యాల దోపిడీ సమస్యను మొదట లేవనెత్తారు. 1895 సంవత్సరానికి భారత వ్యయంపై రాయల్ కమిషన్ సభ్యులుగా కూడా నియమించ బడ్డారు. బరోడా మహారాజు శయాజీరావు గైక్వాడ్ కాలంలో సంస్థాన దివానుగా పని చేశారు. 1874 లో, ఆయన బరోడా ప్రధాన మంత్రి, 1885 నుండి 1888 వరకు ముంబై శాసన మండలి సభ్యుడయ్యారు. అలా ప్రజా జీవితంలో ప్రవేశించిన ఆయన "గ్రాండ్ ఓల్డ్ మాన్ ఆఫ్ ఇండియా" గా ప్రసిద్ధి గాంచారు. భారత జాతీయ కాంగ్రెస్ వ్యవస్థాపకులు సురేంద్రనాథ్ బెనర్జీతో పాటు వ్యవస్థాపకుల్లో ఒకరు. 1886 లో నౌరోజీ దాని అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. 1893 లో లాహోరులో జరిగిన జాతీయ కాంగ్రెస్ సమావేశానికి రెండోసారి అధ్యక్షత వహించారు. 1906 లో జరిగిన కలకత్తా సమావేశానికి కూడా అధ్యక్షత వహించి మూడు సార్లు ఈ పదవి పొందిన తొలి నాయకులుగా అవతరించారు. దాదాభాయి నౌరోజీ పలు గ్రంథాలు రచించారు. ఆయన రాసిన పుస్తకం "పావర్టీ మరియు అన్‌బ్రిటిష్ రూల్ ఇన్ ఇండియా" అనే పుస్తకం భారతదేశం నుండి బ్రిటన్ తరలిస్తున్న నిధుల గురించి వివరించిన మొదటి పుస్తకం. అలాగే పార్సీల మర్యాదలు మరియు ఆచారాలు, యూరోపియన్ మరియు ఆసియాటిక్ జాతులు, భారత దేశానికి కావలసినవి మరియు సాధనాలు, భారత దేశంలో పేదరికం మరియు బ్రిటిష్ రహిత నియమం, పార్సీ మతం తదితర రచనలు చేశారు. ఆయన 30 జూన్ 1917 న మరణించారు. బ్రిటిష్ పార్లమెంటులో భారతీయుల కోసం వాదించిన, బ్రిటిష్ విధానాలను విమర్శించిన నిజమైన జాతీయ వాది దాదా భాయిని ప్రతి భారతీయుడు గుర్తెరగాల్సిన అవసరం ఉంది. **రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# మేకిన్ ఇండియా తొలి చిప్.. విక్రమ్ 32 ఎంత పవర్ ఫుల్ అంటే?




భారత అంతరిక్ష పరిశోధనలో 'విక్రమ్-32' అనే మైక్రోప్రాసెసర్ ఆవిష్కరణ ఒక చారిత్రాత్మక ఘట్టం. ఇది కేవలం ఒక ఎలక్ట్రానిక్ చిప్ కాదు, అంతరిక్ష పరిశోధనలో భారత్ స్వయం సమృద్ధిని సాధించబోతోందనడానికి ఒక స్పష్టమైన సంకేతం. ఇస్రో (%ఇస్రో%) , సెమీ కండక్టర్ లేబొరేటరీ సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ చిప్, భారత అంతరిక్ష కార్యక్రమాలకు అవసరమైన కీలకమైన సాంకేతికతను దేశంలోనే రూపొందించుకునే సామర్థ్యాన్ని ప్రదర్శించింది. ఇది మన దేశీయ శాస్త్రవేత్తల కృషి, పట్టుదల, దూరదృష్టికి నిదర్శనం.

**- విక్రమ్-32: ప్రత్యేకతలు...** విక్రమ్-32 అనేది ఒక 32-బిట్ మైక్రోప్రాసెసర్. దీనిని అంతరిక్షంలోని అత్యంత కఠినమైన పరిస్థితులను తట్టుకునేలా ప్రత్యేకంగా డిజైన్ చేశారు. దీని ముఖ్య లక్షణాలు.. ఇది -55%ఈ% నుండి o125%ఈ% వరకు ఉన్న తీవ్రమైన ఉష్ణోగ్రతలను తట్టుకోగలదు. అంతరిక్షంలో ఉండే విపరీతమైన చలి.. వేడిని తట్టుకోవడం దీని గొప్ప ప్రయోజనం. అంతరిక్షంలో అధిక రేడియేషన్ ఉంటుంది, ఇది సాధారణ ఎలక్ట్రానిక్స్‌ను దెబ్బతీస్తుంది. విక్రమ్-32 చిప్‌ను రేడియేషన్‌ను తట్టుకునేలా రూపొందించారు, తద్వారా రాకెట్లు, ఉపగ్రహాల పనితీరులో ఎటువంటి అంతరాయం కలగకుండా చూస్తుంది. ఈ చిప్ రాకెట్ల నావిగేషన్, నియంత్రణ, మిషన్ మేనేజ్‌మెంట్ వంటి కీలకమైన పనులను అత్యంత వేగంగా, సమర్థవంతంగా నిర్వహిస్తుంది. ఇది రాకెట్‌కు 'మెదడు'లా పనిచేసి, దాని ప్రయాణాన్ని సరైన మార్గంలో కొనసాగించేందుకు సహాయపడుతుంది. ఈ చిప్‌ను కేవలం అంతరిక్ష పరిశోధనల కోసం మాత్రమే ప్రత్యేకంగా తయారు చేశారు. ఇది సాధారణ ల్యాప్‌టాప్‌లు లేదా మొబైల్ ఫోన్ల వంటి వాటికి కాదు, రాకెట్లు, ఉపగ్రహాలు ,లాంచ్ వెహికల్ ఏవియానిక్స్ కోసం ఉద్దేశించినది.

**-దేశీయ ఉత్పత్తి యొక్క ప్రాముఖ్యత...** అంతరిక్ష చిప్‌ల ఉత్పత్తి అనేది అత్యంత క్లిష్టమైన..వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగిన ప్రక్రియ. ఇప్పటివరకు, భారత్ ఇటువంటి కీలకమైన సాంకేతికత కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సి వచ్చేది. ఇది ఖర్చుతో కూడుకున్నదే కాకుండా, భద్రతాపరమైన , రాజకీయపరమైన సవాళ్లను కూడా సృష్టిస్తుంది. విక్రమ్-32 ఆవిష్కరణతో భారతదేశం ఈ రంగంలో స్వయం సమృద్ధి దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. ఇది 'ఆత్మనిర్భర భారత్' కలకి ఒక గొప్ప ఉదాహరణగా నిలుస్తుంది. దేశీయంగా తయారైన చిప్‌ల వల్ల భద్రతాపరమైన సమస్యలు తక్కువగా ఉంటాయి. మన దేశ అవసరాలకు తగ్గట్టుగా వీటిని రూపొందించడం వల్ల విశ్వసనీయత కూడా పెరుగుతుంది. ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకునే బదులు, మన దేశంలోనే తయారు చేయడం వల్ల ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. ఇది భవిష్యత్తులో మరిన్ని అంతరిక్ష మిషన్లను చేపట్టడానికి సహాయపడుతుంది.

**- భవిష్యత్తు - సమగ్ర దృక్పథం...** విక్రమ్-32 కేవలం ఒక ప్రాసెసర్ మాత్రమే కాదు, అంతరిక్ష సాంకేతికతలో మన దేశం సాధించిన పురోగతికి ఒక ప్రతీక. ఇది %రారా-జ%60 ప్రాజెక్ట్‌లో విజయవంతంగా పరీక్షించబడింది. దీంతో ఇస్రో శాస్త్రవేత్తలకు మరింత విశ్వాసం వచ్చింది. భవిష్యత్తులో గగన్‌యాన్ వంటి ప్రతిష్టాత్మక మిషన్లకు, ఈ చిప్‌లు చాలా కీలకమైన పాత్ర పోషిస్తాయి. ఇది భారత అంతరిక్ష పరిశోధనలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలికింది. ఈ చిప్‌ను తయారు చేయడంతో పాటు దీనికి అవసరమైన సాఫ్ట్‌వేర్ టూల్స్ (అదా కంపైలర్స్, అసెంబ్లర్స్, లింకర్స్, సిమ్యులేటర్లు) కూడా భారత్‌లోనే అభివృద్ధి చేయడం ద్వారా పూర్తి స్వావలంబన సాధించింది. ఇది కేవలం ఒక చిప్ ఆవిష్కరణ కాదు, అంతరిక్ష రంగంలో మన శాస్త్రవేత్తల బృందాల శక్తి, సామర్థ్యాలకు ఒక గొప్ప నిదర్శనం. విక్రమ్-32 రాబోయే తరాలకు ప్రేరణగా నిలుస్తుంది, భారతదేశం అంతరిక్ష శక్తులలో అగ్రగామిగా నిలవడానికి ఇది ఒక బలమైన పునాది వేస్తుంది.

# రోహిత్ శర్మ.. సూపర్ ఫిట్ నెస్.. 2027 ప్రపంచకప్ ఖాయం

శరీర స్వభావం రీత్యా కాస్త బొద్దుగా కనిపించే టీమ్ ఇండియా వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ ఈ ఏడాది ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) సందర్భంగా ఫిట్ నెస్ కోల్పోయినట్టు కనిపించాడు. ఆపై టెస్టు క్రికెట్ కు వీడ్కోలు పలికాడు. 2024 టీ20 ప్రపంచ కప్ గెలిచిన అనంతరం ఈ ఫార్మాట్ కూ గుడ్ బై చెప్పాడు. కేవలం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీ నెగ్గిన జట్టుకు అతడే కెప్టెన్ కూడా.

**షేప్ ఔట్ అయి...** రోహిత్.. చివరగా క్రికెట్ ఆడింది ఐపీఎల్ లోనే. అదీ జూన్ 1న. అంటే మూడు నెలలు దాటిపోయింది. ఐపీఎల్ లోనూ కొన్ని మ్యాచ్ లలో రోహిత్ ను ఇంపాక్ట్ ప్లేయర్ గా దింపారు. ఫామ్ తో పాటు ఫిట్ నెస్ దీనికి కారణంగా చెప్పొచ్చు.

ఈ మధ్యలోనే కుటుంబంతో ఇంగ్లండ్ వెళ్లిన రోహిత్... వింబుల్డన్, టెస్టు సిరీస్ మ్యాచ్ లను చూశాడు. అయితే, అతడు



తిరిగి వచ్చాక ఎయిర్ పోర్ట్ లో చూస్తే అసలు ప్రొఫెషనల్ క్రికెటర్ తరహాలోనే కనిపించలేదు. శరీరంపై అదుపు కోల్పోయాడా? అన్నట్లు అనిపించింది. కానీ, ఇప్పుడు మాత్రం రోహిత్ ను చూస్తే కెరీర్ మొదట్లో కంటే ఫిట్ గా కనిపిస్తున్నాడు.

**సూపర్ ఫిట్ గా..** అత్యంత కఠినంగా భావించే యోయో ఫిట్ నెస్ టెస్టును మించినదిగా చెబుతున్న బ్రాంకో టెస్టులోనూ రోహిత్ పాసయ్యాడు. దీంతో రోహిత్ ను వచ్చే ఆస్ట్రేలియా టూర్ కు ఎంపిక చేయడం అనేది సెలక్టర్ల చేతిలో ఉంది. అసలు రోహిత్ కేవలం వన్డేల్లో కొనసాగుతున్నది 2027 ప్రపంచకప్ కోసం అని కథనాలు వస్తున్నాయి. ఆ టోర్నీలోనూ జట్టును నడిపించాలని రోహిత్ భావిస్తున్నాడట. బహుశా అందుకేనేమో..సూపర్ ఫిట్ నెస్ సాధించాడు.

**ఆ ఫొటో.. ఈ ఫొటో...** రోహిత్ ఈ ఏడాది ఐపీఎల్ సందర్భంగా కాస్త పొట్టతో, బొద్దుగా ఉన్న ఫొటోను, ఇప్పుడు సూపర్ ఫిట్ నెస్ సాధించిన ఫొటోను పక్కపక్కన పెట్టి చూస్తే భారీగా ట్రాన్స్ ఫార్మ్ అయినట్టు తెలుస్తోంది. అంతేకాదు.. భారత్ లో ఆస్ట్రేలియా-ఎ జట్టుతో వన్డే సిరీస్ కూడా ఆడతాడట.

అందుకే ముందుగానే ఫిట్ నెస్ టెస్టుకు హాజరయ్యాడని తెలుస్తోంది. ఆసీస్ ఏతో సిరీస్ లోనూ తన ఫామ్ నిరూపించుకునే ఆస్ట్రేలియా టూర్ కు అతడే కెప్టెన్. కోరుకున్నంత కాలం వన్డే టీమ్ లోనూ కొనసాగుతాడని చెప్పాల్సిన అవసరం లేదు.

# బంగారం స్మగ్లింగ్: తెలుగు నటుడికి 62కోట్లు, నటికి 102కోట్లు జరిమానా

బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో కన్నడ నటి రన్యారావు బంగారం స్మగ్లింగ్ కేసులో అరెస్ట్ అయిన సంగతి తెలిసిందే. ఈ కేసులో తీగ లాగితే డొంకంతా కదిలింది. ఇందులో తెలుగు నటుడు తరుణ్ రాజ్ పేరు కూడా ప్రముఖంగా వినిపించింది. రన్యారావుకు అతడు రైట్ హ్యాండ్ అన్న ప్రచారం సాగింది. సాహిల్ జైన్, భరత్ జైన్ అనే మరో ఇద్దరితో కలిసి సిండికేట్ స్మగ్లింగ్ ప్లాన్ అమలయ్యేదని కూడా డీఆర్ఐ అధికారుల విచారణలో తేలినట్లు సమాచారం. ఈ కేసులో రన్యారావుకు కోర్టు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించిన సంగతి తెలిసిందే. తాజాగా ట్రిబ్యూన్ ఇండియా కథనం ప్రకారం... రన్యారావుకు 102 కోట్ల జరిమానా విధించగా, తెలుగు నటుడు తరుణ్ రాజుకు 62 కోట్ల మేర జరిమానా విధించినట్లు ట్రిబ్యూన్ ఇండియా తన కథనంలో పేర్కొంది. సాహిల్ జైన్ - భరత్ జైన్ లకు 53 కోట్ల మేర జరిమానా విధించారు. నలుగురికి విధించిన మొత్తం జరిమానా రూ. 270 కోట్లు. ఒక్కొక్క వ్యక్తి దుబాయ్ నుంచి విదేశాలకు తరలించిన అక్రమ బంగారం విలువ (బరువు) ఆధారంగా ఈ జరిమానాల్ని విధించినట్టు తెలిసింది. దేశ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ



ఇంటెలిజెన్స్ (DRI) దర్యాప్తు ప్రకారం..రన్యారావు 127.3 కేజీల బంగారాన్ని అక్రమ రవాణా చేయగా, తరుణ్ రాజ్ 67.6 కిలోల బంగారాన్ని స్మగ్లింగ్ చేశాడు. సాహిల్ జైన్ - భరత్ జైన్ 63.61 కిలోల బంగారాన్ని స్మగ్లింగ్ చేసినట్టు దర్యాప్తులో తేలిందని ట్రిబ్యూన్ కథనం పేర్కొంది. నిర్ణీత వ్యవధిలోపు జరిమానా చెల్లించకపోతే రన్యారావు సహా ఇతర నిందితుల ఆస్తులను జప్తు చేస్తామని అధికారులు హెచ్చరించారు. ఈ కేసుకు సంబంధించి మొత్తం 1200 పేజీల తుది పత్రాన్ని అధికారులకు సమర్పించారు. నిందితులకు పెనాల్టీ నోటీసులు కూడా జారీ అయ్యాయి. అదనపు కేసు COFEPOSA పిటిషన్ హైకోర్టులో విచారణకు వచ్చింది కానీ దానిని సెప్టెంబర్ 11కి వాయిదా వేశారు. జరిమానాలతో పాటు, క్రిమినల్ కేసులు కూడా కొనసాగుతాయని, దొంగిలించిన బంగారాన్ని తిరిగి పొందడానికి అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. బంగారం స్మగ్లింగ్ కేసుల్లో రన్యారావుకు అమెటీమ్ కు విధించిన జరిమానా ఇటీవలి కాలంలో అతిపెద్ద జరిమానాలలో ఒకటి అని ట్రిబ్యూన్ తన కథనంలో పేర్కొంది. ప్రఖ్యాత ట్రిబ్యూన్ కథనం ఆధారంగా టైమ్స్ ఆఫ్ ఇండియా కూడా ఈ కథనంలో వివరాలను అందించింది.

చురకలు

## సంపాదకీయం

# మోడీ ముందర పాక్ ప్రధాని ప్రసంగం తేలిపోయిందే


భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ల మధ్య జరిగిన మాటల యుద్ధం, షాంఘై సహకార సంస్థ సమావేశంలో ఉగ్రవాదంపై తీవ్రమైన చర్చను రేకెత్తించింది. షాంఘై సహకార సంస్థ వేదికపై ఉగ్రవాదంపై జరిగిన చర్చల్లో భారతదేశం, పాకిస్థాన్‌ల మధ్య వైరుధ్యం స్పష్టంగా బయటపడింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉగ్రవాదాన్ని మానవాళి మనుగడకు పెద్ద ముప్పుగా పేర్కొంటూ.. దానిపై ద్వంద్వ ప్రమాణాలను పాటించడం తగదు అని నొక్కి చెప్పారు. మరోవైపు పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తన దేశం ఉగ్రవాద బాధితురాలని పేర్కొంటూ అంతర్జాతీయ సమాజం నుంచి సానుభూతిని పొందడానికి ప్రయత్నించారు. ఈ రెండు వాదనలు అంతర్జాతీయ స్థాయిలో ఉగ్రవాదంపై ఉన్న భిన్న దృక్పథాలను, వాటి వెనుక ఉన్న రాజకీయాలను ప్రతిబింబించాయి.

**– మోడీ సందేశం: ద్వంద్వ ప్రమాణాలకు ముగింపు కావాలి...** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన ప్రసంగంలో ఒక స్పష్టమైన.. సూటి సందేశాన్ని ఇచ్చారు. "ఉగ్రవాదంపై పోరాటంలో ద్వంద్వ ప్రమాణాలకు తావు లేదు" అని ఆయన ఇచ్చిన పిలుపు అంతర్జాతీయ వేదికలపై ఉన్న అస్పష్టతను లక్ష్యంగా చేసుకుంది. గత నాలుగు దశాబ్దాలుగా భారతదేశం ఉగ్రవాదం వల్ల ఎదుర్కొంటున్న సవాళ్లను, ప్రత్యేకించి పహల్గామ్ వంటి ఘటనలను ఆయన ఉదహరించారు. ఈ సంఘటనలు ఉగ్రవాదం అనేది కేవలం భారతదేశానికి సంబంధించిన సమస్య కాదని, ఇది ప్రపంచ భద్రతకు ముప్పు అని నొక్కి చెప్పాయి. SCO సభ్య దేశాలన్నీ ఉగ్రవాదంపై ఒకే గొంతుతో పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఇది ఉగ్రవాదానికి మద్దతు ఇస్తున్న దేశాలపై పరోక్షంగా ఒక తీవ్రమైన హెచ్చరికగా భావించవచ్చు.

**-షరీఫ్ వాదన: బాధితుడా, లేక సహకారదారా?...** మోడీ ప్రసంగం తర్వాత పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చేసిన వ్యాఖ్యలు గందరగోళంగా ఉన్నాయి. పాకిస్థాన్ ఉగ్రవాదానికి బలైందని, వేలాది ప్రాణాలు కోల్పోయిందని ఆయన చెప్పినా, అంతర్జాతీయ సమాజం మాత్రం పాకిస్థాన్ భూభాగం నుంచి ఉగ్రవాద శక్తులు పుట్టుకొస్తున్నాయనే వాస్తవాన్ని గుర్తు చేస్తుంది. లష్కరే తొయిబా, జైషే మొహమ్మద్ వంటి సంస్థలు పాకిస్థాన్ లోనే పుట్టి, భారతదేశంపై దాడులు చేశాయని ప్రపంచానికి తెలుసు. బలూచిస్తాన్, ఖైబర్ పఖ్తుంఖ్వాల్లో జరిగిన దాడుల వెనుక "విదేశీ శక్తులు" ఉన్నాయని షరీఫ్ చేసిన ఆరోపణలు, తన దేశంలో ఉన్న ఉగ్రవాదాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నంగా కనిపించాయి. ఈ విధంగా, బాధితుడిగా తనను తాను చూపించుకునే ప్రయత్నం, పాకిస్థాన్ పై ఉన్న అంతర్జాతీయ అనుమానాలను తొలగించలేకపోయింది.

**– ఎస్‌సీవోలో ప్రతిధ్వని...** SCO వేదికపై మోడీ ప్రసంగం స్పష్టతతో కూడినది కాగా, షరీఫ్ వాదన గందరగోళంగా ఉంది. సభ్య దేశాలు ఈ రెండు దృక్పథాలను విశ్లేషించినప్పుడు, భారతదేశం వాదనకు బలం ఎక్కువగా ఉన్నట్లు స్పష్టమైంది. నిజమైన సహకారం.. ఉగ్రవాదాన్ని అంతం చేయాలంటే, పాకిస్థాన్ తన గతం నుంచి పాఠాలు నేర్చుకోని, ఉగ్రవాద శక్తులపై నిజమైన చర్యలు తీసుకోవాలనే సందేశం ఈ సమావేశంలో ప్రధానంగా వినిపించింది. ఇది కేవలం మాటల యుద్ధం మాత్రమే కాదు, అంతర్జాతీయ స్థాయిలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిజమైన నిబద్ధతను డిమాండ్ చేసే ఒక ముఖ్యమైన సంఘటన. SCO సమావేశంలో మోడీ – షరీఫ్ ప్రసంగాలు ఉగ్రవాదంపై అంతర్జాతీయ సమాజం తీసుకోవాల్సిన వైఖరిని స్పష్టం చేశాయి. ఉగ్రవాదం విషయంలో అర్థరహిత వాదనలు, నిందల మార్పిడితో ఎలాంటి ఉపయోగం ఉండదు. ఈ ముప్పును ఎదుర్కోవడానికి స్పష్టమైన నిబద్ధత, నిష్పక్షపాత వైఖరి.. నిజమైన చర్యలు మాత్రమే అవసరం. మోడీ చెప్పినట్లు, ఇకపై ద్వంద్వ ప్రమాణాలకు తావు లేదు. ప్రపంచంలోని దేశాలన్నీ ఉగ్రవాదంపై పోరాడటానికి నిజమైన సహకారం అందించినప్పుడే భద్రత.. శాంతి సాధ్యమవుతుంది.

# వైవిధ్య భరితం... వామనావతారం



"సంభవామి యుగే యుగే"... ధర్మ సంస్థాపన కోసం అవసరమైన సందర్భాల్లో అవతరిస్తూనే ఉంటా'నని శ్రీమహావిష్ణువు అభయ ప్రదానం చేశాడు. ఆ వరంవరలో ఆవిష్కారమైనది...వామనుడు లేదా త్రివిక్రముడు, హిందూ పురాణాల ప్రకారం శ్రీమహావిష్ణువు యొక్క దశావతారాలలో ఐదవ అవతారం. భాద్రపద శుద్ధ ద్వాదశి నాడు అదితి, కశ్యపుల కుమారుడిగా శ్రీహరి వామన మూర్తిగా అవతరించాడు. దీన్ని వామన ద్వాదశిగా, విజయ ద్వాదశిగా వ్యవహరిస్తారు. సృష్టిలోని జీవావరణంలో జీవులు సూక్ష్మ రూపం నుంచి మహా భారీకాయం వరకు వైవిధ్య భరితంగా గోచరమవుతాయి. ఈ అణుత్వం, మహారూపాలు పరస్పర విరుద్ధమైనవి. కానీ, ఆ వైవిధ్యం ఆత్మ, పరమాత్మల విషయంలో లేదని వేదోక్తి. ఆత్మ అణువు కంటే సూక్ష్మమైనది, మహత్తరమైనది. అది ఎంత సూక్ష్మమైనదో, అంత స్థూల మైనదని కఠోపనిషత్తు ప్రకటించింది. వామనావతార నేపథ్యం ఇదే! దేవాసుర యుద్ధంలో ఇంద్రునితో ఓడిపోయిన బలి, రాక్షస గురువైన శుక్రాచార్యుల దయ వలన బ్రతికి, గురూపదేశంతో విశ్వజిత్ యాగం చేసి బంగారు రథము, మహా శక్తివంతమైన ధనుస్సు, అక్షయ తూణీరములు, కవచము, శంఖములు పొందుతాడు. బల గర్వితుడై ఇంద్రుని మదమణి చేందుకు, రాక్షసుల నందరినీ ఒకచోటచేర్చి, యుద్ధమునకు సంసిద్ధం చేసి అమరావతిపై దండెత్తుతాడు. ఆ దుర్భర దానవ శంఖా విర్భూత ధ్వనులు నిండి, విభుదేంద్ర వధూగర్భములు పగిలి, లోపలి శిశువులు ఆవురని ఆక్రోశించు చుండ, దేవతలు బృహస్పతి వచనములు విని అమరావతి వీడి పారిపోయారు. దేవతల దుస్థితిని చూసి, సుర మాత అదితి, తన భర్తయైన కశ్యప బ్రహ్మను వేడుకున్నది. అంతట కశ్యపుడు అదితికి పయోభక్షణ వ్రతాన్ని ఉపదేశిస్తాడు. ఆమె ఫాల్గుణ మాసం, శుక్లపక్ష పాడ్యమి నుంచి 12 రోజులు హరి సమర్పణంగా వ్రతం చేసి భర్తను చేరగా, భగవ దంశతో, శ్రవణ ద్వాదశి (శ్రవణ నక్షత్రంతో కూడిన భాద్రపద బహుళ ద్వాదశిని శ్రవణ ద్వాదశి అంటారు), ఆనాడు శ్రోణ అభిజిత్ సంజ్ఞాత లగ్నంలో, రవి మధ్యాహ్నమున చరించు నప్పుడు, గ్రహ తారా చంద్ర భద్రస్థితిలో వామనుడు జన్మించాడు. వామనుడు పుట్టినప్పుడు శంఖ, చక్ర, గదా కమల కలిత, చతుర్భుజునిగా, బిశంగ వర్ణ వస్త్రాలతో, మకర కుండల మండిత గండ భాగుడై, శ్రీ విరాజిత లోలంబ, కదంబ వనమాలిగా సమస్త అలంకారాలతో, నిఖిల జన మనోహరుడిగా అవతరించాడు. రూపాంతరంబున తన దివ్య రూపాన్ని ఉపసంహరించుకొని, కపట వటుని వలె, ఉపనయ వయస్కుండై వామన బాలకుడయ్యాడు. బృహస్పతి యజ్ఞోపవీతాన్ని ఇచ్చాడు. కశ్యప మహర్షి మొలత్రాడు ప్రసాదించాడు .తల్లి అదితి కౌపీనాన్ని , భూమాత నల్లజింక చర్మాన్నీ , చంద్రుడు దండాన్నీ , గగనాధిష్ఠ దేవత ఛత్రాన్నీ , బ్రహ్మ కమండలువునూ , సరస్వతి అక్షమాలికనూ (జపం చేసే సమయాన జప సంఖ్యను లెక్కపెట్టు కోవడానికి ), సప్తర్షులు పవిత్రలను ( కుశలను /దర్భలు ) వామన మూర్తికి బహూకరించారు . స్వయంగా సూర్య భగవానుడే గాయత్రీ మంత్రాన్ని ఉపదేశించాడు. వామనుని చూసి జనులు గుజగుజలు పోవుచూ, గజిబిజి పడుచూ, కలకలములై ఎవరీ పొట్టి బాలుడు? శివుడా? హరియా? బ్రహ్మయా? సూర్యుడా? అగ్నియా? ఈ బ్రహ్మచారి ఎవరు? అని విస్మయం చెందారు. కొందరితో చర్చించుచూ కొందరితో జటలు చెప్పుచూ, గోష్ఠిలో పాల్గొనుచూ, తర్కించుచు, ముచ్చటలాడుచు, నవ్వుచూ అనేక విధంబుల అందరికీ అన్ని రూపులై వినోదించుచూ, వెడవెడ నడకలు నడుచుచూ, బుడి బుడి నొడువులు నొడుచుచు, జిడిముడి తడబడగ, వడుగు రాజును సమీపించి "స్వస్తి ! జాగత్త్రయీ భావన శాసన కర్తకు! హాసమాత్ర విధ్వస్త నిలింప భర్తకు, ఉదారపద వ్యవహర్తకు, మునీంద్ర స్తుత మంగళాధ్వ విధాన విహర్తకు, దానవ లోక భర్తకు స్వస్తి అని దీవించెను. బలి అతనికి సముచితాదరమిచ్చి గౌరవించి...వడుగా ! ఎవ్వరి వాడవు? నీకేమి కావలయును కోరుకొమ్మన్నాడు. "ఒంటి వాడను నేను. నాకు ఒకటి, రెండడుగుల మేర యిమ్ము . అయినను అడుగ మంటివి కనుక అడిగితిని. దాత పెంపు సొంపు తలపవలెను గదా! కావున నాకు మూడడుగుల నేలనిమ్ము, చాలు అని మాయా వడుగు పలికెను. ఆ వామనుడిని విష్ణువుగా గుర్తించిన శుక్రుడు బలి చక్రవర్తిని వారించెను. బలి గురువుకు వినయముగా నమస్కరించి ...ఇచ్చెదనని పలికితిని. ఆడిన మాట తప్పను అన్నాడు. అప్పుడు శుక్రాచార్యుడు నీవిచ్చినచో అఖిలంబు పోవును.

**"ఇంతింతై...వటుడింతయై...** అలా ధారా పరిగ్రహంబు చేసి, ఇంతితై వటుడింతయై, దానింతై, నభో వీధిపైనంతై, తోయద మండలాగ్రమున కల్లంతై, ప్రభారాశి పైనంతై, చంద్రునికంతయై, ధ్రువునిపైనంతై, మహర్వాటి పైనంతై, బ్రహ్మాండాంత సంవర్ధియై", సత్యపదోన్నతుడైన విష్ణువునకు అప్పుడే ఉదయించిన సూర్యబింబము మొదట గొడుగులా, తదుపరి శిరోరత్నమై, చెవి కుండలమై, మెడలోని ఆభరణమై, బంగారు కేయూరమై, కంకణమై వడ్డాణపు ఘంటమై, నూపుర ప్రవరమై, చివరకు పాదపీఠమై ఒప్పు అతడు బ్రహ్మాండము నిండినాడు – అని బమ్మెర పోతన భాగవతంలో పద్య రచన అద్భుతంగా చేశాడు. వారి జాక్షులందు, వైవాహికము లందు ప్రాణ విత్త మాన భంగమందు జకిత గోకులాగ్ర జన్మరక్షణ యందు బొంక వచ్చు.....తప్పు లేదు. అది పాపము కాదు. అని శుక్రాచార్యుడు వివరించెను. దానికి బలి చక్రవర్తి ..కారే రాజులు రాజ్యముల్ కలుగవే, గర్వోన్నతిం బొందరే వారేరీ? సిరి మూట గట్టుకొని పోవంజాలిరే? భూమిపై పేరైనంగలదే! శిబి లాంటి దాతల పేరు ఈనాటికీ స్థిరములైనవి కదా! భార్గవా! అని పలుకుతూ తన మాటను తోసి పుచ్చిన రాజును పదభ్రష్టునివి గమ్మని శుక్రాచార్యుడు శపించాడు. అయినను బలిచక్రవర్తి హరి చరణములు కడిగి, "త్రిపాద ధరిణిం దాస్యామి" అనుచు నీటిధార విడిచాడు. ఆ కలశములో సూక్ష్మకీటక రూపమున చేరి శుక్రాచార్యుడు నీటిధారను ఆప బోయాడు. అప్పుడు హరి కుశాగ్రముతో కలశ రంధ్రమును బొడువగా కన్ను పోగొట్టుకొని శుక్రాచార్యుడు ఏక నేత్రుడయ్యెను. "పుట్టి నేర్చుకునెనో, పుట్టక నేర్చెనో.. ఈ పొట్టి వడుగునకీ చిట్టి బుద్ధులెట్లబ్బెనో, ఈతని పొట్టనిండా అన్నీ భూములే.. అని నవ్వుతూ మూడడుగుల నేలను బలి వడుగుకు దానమిచ్చెను. ఒక పాదంబులో భూమిని కప్పి, దేవ లోకమును రెండవ పాదమున నిరోధించి, జగములెల్ల దాటి చనిన త్రివిక్రముడు మరల వామనుడై బలి నవలోకించి నా మూడవ పాదమునకు స్థలము జూపమన్నాడు. అప్పుడు బలి వినయముతో నీ తృతీయ పాదమును నా శిరమున ఉంచమని వేడుకొనగా సమ్మతించిన హరి బలిని ఆశీర్వదించి, ప్రహ్లాదునితో సుతల లోకమునకు పంపి, తానే ఆలోకమునకు ద్వారపాలకు డాయెను. బలి నడిగి సంపాదించిన లోకములను తన సోదరుడైన ఇంద్రున కిచ్చి సంతోషపరిచాడు శ్రీహరి. "ఛలయసి విక్రమణే బలి మద్భుత వామన పదనఖ నీరజ నతజన పావన కేశవ ధృత వామన రూప జయ జగదీశహరే" ం జయదేవుని దశావతార స్తోత్రము ఈ వామనా వతార గాథను విన్న వారు, చదివిన వారు సకల శుభాలను పొందుతారు. దైవారాధన సమయంలో ఎవరైతే త్రివిక్రమ పరాక్రమాన్ని స్మరించు కుంటారో వారికి నిత్య సౌఖ్యాలు కలుగు.తాయని ప్రతీతి. వామన కంచిలో అద్భుతమైన వామన అవతారం గుడి ఉంది. మిత్రానంద పురము వామన మూర్తి దేవాలయం, చెరుపు, త్రిస్సూర్, కేరళ థ్రికక్కర (థ్రికక్కర ఆలయం), కొచ్చిన్, కేరళ కాంచీపురం సమీపంలోని కామాక్షి ఆలయం, ఖజురహో, మధ్యప్రదేశ్, ఉలగ లంథ పెరుమాళ్ దేవాలయం తిరుకొయిలూర్, విల్లుపురము జిల్లా, తమిళనాడు లలో ఆలయాలు ఉన్నాయి. **రామకిష్టయ్య సంగనభట్ల – 9440595494**


# జోహార్... చదల వాడ ఉమేశ్ - సెప్టెంబర్ 4...చదలవాడ ఉమేశ్ చంద్ర వర్ధంతి



ఆయన సంఘ వ్యతిరేక శక్తులకు సింహ స్వప్నం. పోలీసులకు, వారి కుటుంబీకులకు ఆత్మ బంధువు. ప్రజలకు ఆత్మీయులు. ప్రజా ప్రతినిధులకు సంరక్షకులు. సిబ్బందికి మార్గదర్శకులు. తోటి అధికారులకు ఆదర్శనీయులు. లక్ష్య సాధనలో, విధినిర్వహణలో రాజీ పడక, శాంతి భద్రతల పరిరక్షణకే జీవితం దారవోసి తెలుగు ప్రజల హృదయాలలో సుస్థిర స్థానాన్ని పొందిన అసామాన్య అమర పోలీసు అధికారి చదల వాడ ఉమేశ్ చంద్ర. నక్సలిజం, ఫ్యాక్షనిజం, రౌడీయిజం లాంటి ఇజాలకు పోలీసిజం అంటే ఏమిటో చూపించిన ప్రత్యేక పోలీసు అధికారి ఉమేశ్ చంద్ర . నేటి ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానానికి ఆనాడే రూపు దిద్దిన ప్రజాభిమాని ఆయన. చదలవాడ ఉమేశ్ చంద్ర (మార్చి 19, 1966 – సెప్టెంబరు 4, 1999) 19, 1966 న గుంటూరు జిల్లా పెదపూడి గ్రామములో వేణుగోపాల రావు, నయనతార దంపతులకు జన్మించారు. తండ్రి హైదరాబాదు ఆల్విన్ సంస్థలో ఉద్యోగి. హైదరాబాద్ పబ్లిక్ పాఠశాలలో చదివారు. నిజాం కళాశాల నుండి బి.ఎ. (1987) , ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి యం.ఎ. (1989) పట్టాలు పొందారు. రెండింటిలోను ప్రథముడిగా నిలచి బంగారు పతకాలు సాధించారు. 1991లో ఐ. పి. ఎస్.కు ఎంపికై, 1991–92 లో 'జాతీయ పోలీస్ అకాడమీ' లో శిక్షణ పొందారు. మొదట 1992 నుండి 1994 వరకు వరంగల్లులో ఏఎస్పీ గా పని చేశారు. వరంగల్లులో పనిచేసిన కాలంలో "జన జాగృతి" అనే ఒక కార్యక్రమాన్ని ప్రారంభించారు. తద్వారా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో వరంగల్లు గ్రామాల్లో పాతుకుపోయిన నక్షలిజాన్ని రూపు మాపడానికి కృషిచేస్తూ మొదటి నక్షల్స్ కు బద్ధవిరోధిగా మారారు. తరువాత కడప జిల్లాలో ఫాక్షనిజంతో కరుడు గట్టిన పులివెందుల ప్రాంతానికి బదిలీ చేయబడ్డారు. అక్కడ పని చేసింది కేవలం 4 నెలలు మాత్రమే అయినా చిత్తశుద్ధితో, అంకిత భావంతో, చేపట్టిన ప్రత్యేక చర్యలతో అక్కడి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోయారు. నిత్య నూతన సమయోచిత అనుసరణీయ కార్యకలాపాలతో, పులివెందులలో వీధి రౌడీలు, గుండాల నుండి ఇష్టారాజ్యంగా వ్యవహరించిన బడా బడా ఫ్యాక్షనిస్టులకు కంటికి నిద్రలేకుండా చేసారు. సమయం సందర్భం చూడకుండా, విశ్రాంతి అనేదే లేకుండా రైడింగులు చేస్తూ దొరికిన వాడిని దొరికినట్లుగా అరెస్టులు చేస్తూ ప్రజలకు పోలీసు శాఖ పట్ల ఎన్నడూ లేనివిధంగా భరోసా కల్పించారు. ఫిబ్రవరి 1995 లో వరంగల్ 'ప్రత్యేక విధుల అధికారి' గా నియమితులయ్యారు. అక్కడి పరిస్థితుల దృష్ట్యా, తీవ్రవాదంపై ఉక్కు పాదం మోపారు. చెప్పా చెయ్యకా తీవ్రవాదులపై విరుచుకు పడ్డారు. వరంగల్ ప్రాంతంలో తొలిసారిగా ప్రజలు కష్టం వస్తే అన్నలను కాకుండా పోలీసులను కలవడం ద్వారా ప్రజలతో మమేకయ్యే కృషి చేశారు. అలా ప్రజలకు పోలీసులకు మధ్య దూరాన్ని తగ్గించి, ఇటీవల పోలీసులు అనుసరిస్తున్న ఫ్రెండ్లీ పోలీస్ విధానాన్ని అప్పట్లోనే ఆయన ఆచరించి చూపించారు. ప్రజలతో మమేకమై పోలీసులపై సంఘములోగల దురభిప్రాయాలు తొలగించడంపై ప్రత్యేక దృష్టి నిలిపారు. నక్సలైట్లను పట్టుకోవడంలో, లొంగుబాటు బాట పట్టించరంలో సఫలమయ్యారు. 1995 జూన్ లో పోలీస్ సూపరింటెండెంట్ గా పదోన్నతి పొంది కడప జిల్లాకు తిరిగి చేరారు. తర్వాత జూన్ 1997 నుండి ఏప్రిల్ 1998 వరకు కరీంనగర్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ గా విధులు నిర్వర్తించారు. రెండు సంవత్సరాలలో ఆయన చేసిన కృషి ప్రజలకు కొత్త కోణం చూపింది. ఆయన్ని ప్రజలు ఎంతగా అభిమానించారంటే ఆయన బదిలీ ఆపమని ధర్నాలు కూడా చేసారు. ఆయన బదిలీ అయి వెళుతున్న రోజు ప్రజలు పలికిన వీడ్కోలు అంతకుముందు గానీ, ఆ తరువాత గానీ ఎక్కడా ఏ పోలీసు అధికారికి జరగలేదంటే అతిశయోక్తి కాదేమో. నవంబరు 1998 లో ఉప ఇనస్పెక్టర్ జనరల్ (సంక్షేమం, ఆటలు) గా పదోన్నతి పొందారు. ఉమేశ్ చంద్ర సెప్టెంబరు 4, 1999 న ఉదయం ఎప్పటిలాగే, ఉదయం 10 గంటలకు తన కార్యాలయానికి బయలు దేరారు. ఆయన మారుతి వ్యాన్‌లో డ్రైవర్ సత్యనారాయణ మరియు గన్‌మన్ రామచంద్రారెడ్డి ఆయన తో పాటు ఉన్నారు. సంజీవ రెడ్డి నగర్ క్రాస్‌రోడ్స్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద కారు ఆగగా నలుగురు నక్సలైట్లు కాల్పులు జరిపారు. అంగ రక్షకుడు, డ్రైవరు వెంటనే మరణించారు. ఉమేశ్ చంద్ర కారు దిగి నక్సలైట్లను తరిమి వెంటాడారు. ఆయన వద్ద పిస్టల్ లేదని గ్రహించిన నక్సలైట్లు ఆగి రెండు సార్లు కాల్పులు జరిపారు. పడిపోయిన ఉమేశ్ చంద్ర వద్దకు వచ్చి సమీపము నుండి కాల్చి పారిపోయారు. విధినిర్వహణలో అసువులు బాసిన ఆ అమర పోలీసు అధికారి ఆత్మ త్యాగానికి గుర్తుగా, పోలీసులకు స్ఫూర్తిగా, సెప్టెంబరు 4, 2000 న ఉమేశ్ చంద్ర విగ్రహం సంజీవరెడ్డి నగర్ కూడలి వద్ద నెలకొల్పబడింది.

**రామకిష్టయ్య సంగనభట్ల – 9440595494**

# సాటిలేని మేటి జ్యోతిశ్శాస్త్ర ఘనాపాఠి భమిడిపాటి - 6 వేల సంవత్సరాల క్యాలెండర్ రూపకర్త...150 చిత్రాల కథా రచయిత - సెప్టెంబర్ 4... భమిడిపాటి రాధాకృష్ణ వర్ధంతి



Radhakrishna Bhamidipati

కాలచక్రంతో పాటు గ్రహగతులనూ, జ్యోతిశ్శాస్త్రాన్నీ కూలంకషంగా అధ్యయనం చేసి అక్షరాలకూ, సంఖ్యలకూ బ్రహ్మముడులు వేస్తూ ఒక వ్యక్తి పేరులోంచి వారు పుట్టిన సమయాన్ని వెలికి తీసేందుకు తెలుగు భాషలోని అసంఖ్యాక గుణింతాలతో కూడిన ఒక నిర్దిష్ట సూత్రం రూపొందించి దాని ఆధారంగా జాతకాలను అధ్యయనం చేస్తూ జ్యోతి శ్శాస్త్రంలో ఓ వినూత్న ధోరణిని ప్రవేశపెట్టి ఆ శాస్త్రం విలువను ప్రపంచానికి అందిస్తూ ఎందరికో భవిష్యన్మార్గదర్శకం చేసింది ఒక ఆంధ్రుడేనే విషయం చాలా మందికి తెలియదు. అప్పటి వరకూ అనుసరిస్తున్న గణన పద్ధతిలో ఖచ్చితత్వం సరిగా లేక, లోప భూయిష్టమై, తప్పుల తడకలతో నడకలు సాగిస్తున్న ప్రపంచ కాలచక్ర గతులు సరిచేసే నిమిత్తం 45 బి.సి నుంచి 5,555 ఎ.డి వరకూ ఆంగ్ల క్యాలెండర్‌ను సరిదిద్ది సరికొత్త భమిడిపాటి కేలెండర్‌ను రూపొందించిన మేటి విజ్ఞానవేత్త మన తెలుగుబిడ్డ కావడం అది నిజంగా గర్వకారణ అంశం కాక మరేమిటి? సూర్యుని చుట్టూ భూమి చేసే భ్రమణానికి పట్టే సమయం 365.25 రోజులంటూ ప్రపంచం అప్పటి వరకూ నమ్ముతున్న సూత్రాలను తిరగరాసి, ఈ భ్రమణానికి 365.2422 రోజులు పడుతుందంటూ గణిత సూత్రాల ఆధారంగా ఖచ్చితంగా నిరూపించి నిర్ధారించిన మహా శాస్త్రవేత్త, సాటిలేని జ్యోతిశ్శాస్త్ర మేటి ఘనా పాటి భమిడిపాటి రాధాకృష్ణ. భాషా వ్యాకరణ, ఖగోళ, గణితశాస్త్ర సూత్రాలతో అనుసంధానమై నిర్దిష్ట ఫలితాలను నిక్కచ్చిగా అందించే విజ్ఞాన గని అని నిరూపించి, తన వాస్తవిక దృక్పథాన్ని నిరూపించు కున్న వ్యక్తిత్వం ఆయన సొంతం. రాధాకృష్ణ వ్యాకరణ, ఖగోళ, గణిత శాస్త్రాలను అనుసంధానించి అధ్యయనం చేయడం ద్వారా జ్యోతిశ్శాస్త్ర మూలాలను మర్ధించి అసామాన్య జ్యోతిశ్శాస్త్రవేత్తగా ప్రశంసా పాత్రులైనారు. జ్యోతిశ్శాస్త్రంలో పూర్వం నుంచీ ఉన్న ఆ శాస్త్ర గ్రంథాలైన సారావళి, బృహజ్జాతకం, పరాశర గ్రంథం, జాతక మార్తాండ, జాతక సర్వస్వం, జాతక చంద్రిక, కేరళీయం ఇత్యాది గ్రంథాల్లో నిర్దిష్ట అంశంపై పరస్పర విరుద్ధమైన ఫలితాలు పేర్కొనబడడం రాధాకృష్ణ గమనించారు. అనంతరం వాస్తవిక దక్పథంతో ఈ శాస్త్ర గ్రంథాల నిగ్గు తేల్చేందుకు 40 ఏళ్ల పైబడిన వారికి చెందిన 2,600 జాతకాలు, 72 మంది కవలల జాతకాలు సేకరించి పరిశోధించారు. ప్రస్తుతం వాడుకలో ఉన్న ఇంగ్లీషు కాలెండర్‌లో తప్పు ఉందని రుజువు చేసి, దానిని సరి చేసుకొనే విధానాన్ని సూచిస్తూ 1990లో "ది భమిడిపాటి కేలెండర్"ను ఆంగ్లంలో పుస్తక రూపంలో ప్రచురించారు. జపాన్, లండన్ లాంటి విదేశాల్లో ఈ క్యాలెండర్ విడుదలై, విక్రయించ బడి సంచలనం సష్టించింది. ప్రపంచంలో ఇటువంటి ప్రయత్నం ఇదే తొలిసారి కాగా అయన అపూర్వ కృషి... విజ్ఞులు, విమర్శకుల మన్ననలందుకుంది. ఇది ఆంధ్రులందరికీ గర్వకారణం. తన మరణాన్ని సూచించేలా అన్యాపదేశంగా సెప్టెంబర్ 4వ తేదీన ఈ లోకాన్ని వదులుతానని ముందుగానే తన డైరీలో రాసుకున్న రాధాకృష్ణ రాతలు ఆయన నుదుటి మీద గీతలేనన్న వాస్తవాన్ని ఎవరూ ఊహించ లేకపోవడం గమనార్హం. భమిడిపాటి రాధాకృష్ణ 24–11–1929 వ తేదీన రాజమండ్రిలో జన్మించారు. అక్కడే శ్రీ వీరేశలింగం ఉన్నత పాఠశాల లోను, తరువాత రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలలోను విద్యాభ్యాసం చేసి, 1949లో బీ.ఎస్సీ పట్టభద్రు లయ్యారు. తండ్రి శ్రీ కామేశ్వరరావు ఖ్యాతిగాంచిన హాస్య రచయిత కాగా... ఆయన రచనాభినివేశాన్ని తన జీన్స్‌లోనూ జీర్ణించుకున్నారు రాధాకృష్ణ. భమిడిపాటి రాధాకృష్ణ (నవంబరు 24, 1929 – సెప్టెంబరు 4, 2007) లబ్ధ ప్రతిష్టులైన నాటక, సినీ కథా రచయిత, జ్యోతిష శాస్త్ర పండితుడు, సంఖ్యాశాస్త్ర నిపుణుడు. అయన హాస్య రచయిత. "హాస్య బ్రహ్మ" భమిడిపాటి కామేశ్వరరావు కుమారుడు. రాధాకృష్ణ బహుముఖ ప్రజ్ఞశాలి. ఆయన మొదటి రచన భజంత్రీలు నాటిక. దీన్ని మొదటిసారిగా 25–2–1950 వ తేదీన రాజమండ్రిలో ఆర్ట్స్ కాలేజి పూర్వ విద్యార్థి వార్షికోత్సవ సందర్భంలో ప్రదర్శించారు. అయన 3 నాటకాలు, 6 నాటికలు రచించగా ప్రతీ ఒక్కటీ వెయ్యి ప్రదర్శనలకి పైగా ప్రదర్శింపబడి నాటకరంగ ఖ్యాతిని ఇనుమడింప చేశాయి. అవి కన్నడ, తమిళ, హిందీ భాషల్లోకి అనువాదం అయినాయి. "ఇదేమిటి, కీర్తిశేషులు, మన స్తత్వాలు, భజంత్రీలు, దంత వేదాంతం" వంటి నాటికలు, నాటకాలు వ్రాశారు. రావుగోపాల రావు 'కీర్తిశేషులు' లోని ఒక పాత్ర ధరించడం ద్వారా గుర్తింపు తెచ్చుకుని సినీ పరిశ్రమలోనూ అడుగు పెట్టాడు. 28–1–1952న రాజమండ్రిలో జరిగిన సన్మాన సభలో, ఆ సభకి అధ్యక్షత వహించిన అక్కినేని నాగేశ్వర రావు ఆధ్వర్యాన, రాధాకృష్ణకు "దృశ్య కావ్య ధురీణ" అనే గౌరవ పురస్కారం జరిపారు. నిర్మాత దుక్కిపాటి మధుసూదన రావు ప్రోద్బలంతో సినీ రంగంలోకి ప్రవేశించి 150 సినిమాలకు కథలందించారు. ఇందులో కె.విశ్వనాథ్ తొలి చిత్రమైన "ఆత్మగౌరవం" కూడా ఉంది. బ్రహ్మచారి, కథానాయకుడు, కీర్తిశేషులు, మరపురాని కథ, విచిత్ర కుటుంబం, పల్లెటూరి బావ, ఎదురులేని మనిషి, గోవుల గోపన్న, సీతారామ కళ్యాణం, నారీనారీ నడుమ మురారి, కాలేజీ బుల్లోడు వంటి వాటితో సహా తెలుగు పలు చిత్రాలకు కథలు వ్రాశారు. ఎన్టీఆర్, ఏఎన్నార్ లకు ఆయన సన్నిహితులు. 1994 తర్వాత క్రమంగా ఆయన సినిమా రంగానికి దూరమయ్యారు. తనకు ఎంతో ఇష్టమైన గణిత రంగంపై మక్కువ చూపారు. భమిడిపాటి రాధాకృష్ణ క్యాలెండర్ పేరిట క్రీస్తుపూర్వం 45 నుంచి క్రీస్తుశకం 5555 వరకు అంటే ఆరు వేల సంవత్సరాల క్యాలెండర్ రూపొందించారు. జ్యోతిష రంగంలో కూడా ఆయనకు పట్టు ఉంది. సంఖ్యాశాస్త్ర పరంగానే కాకుండా చిన్నారుల నామకరణ సమయంలో బియ్యంలో రాసే అక్షరాలను బట్టి కూడా ఆయన జాతకాలు చెబుతారనే పేరు సంపాదించు కున్నారు. ఆయన 79 సంవత్సరాల వయస్సులో రాజమండ్రిలో మరణించారు. భజంత్రీలు, దంత వేదాంతంబీ కీర్తిశేషులుబీ మన స్థత్వాలుబీ తరం–అంతరంబీ తదితర నాటకాలను ఆయన రచించారు. ఆత్మ గౌరవం (1965) (డైలాగ్స్ రచయిత)బీ మరపురాని కథ (1967)బీ కథానాయకుడు (1969)బీ అల్లుడే మేనల్లుడు (1970)బీ ఆడ జన్మ (1970)బీ బొమ్మా బొరుసా (1971)బీ రామ రాజ్యం (1973)బీ ఆడపిల్లల తండ్రి (1974)బీ అల్లుడొచ్చాడు (1976)బీ పొగరు బోతు (1976)బీ మనిషి రోడ్డున పడ్డాడు (1976)బీసాహస వంతుడు (1978)బీ షోకిల్లా రాయుడు (1979)బీ నారి నారి నడుమ మురారి తదితర చిత్రాలకు సంభాషణలు రాశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.. 9440595494**

చురకలు



# రోడ్లకు వర్షం దెబ్బ!

కొత్తగూడెం : ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులు ఛిద్రమయ్యాయి. ఎడతెరిపి లేని వానలతో కొన్ని మార్గాలు అధ్వానంగా మారాయి. అడుగుకో గతుకు ఉండటంతో వాహనదారులు ఆచీతూచి నడవాల్సిన, వాహనాలను నడపాల్సిన పరిస్థితి. భారీ వర్షాలతో జిల్లా వ్యాప్తంగా 221.58 కిలోమీటర్ల మేర రోడ్లు ధ్వంసమయ్యాయి. జిల్లా నుంచి ఖమ్మం జిల్లాలోని పలు మండలాలకు అనుసంధానంగా ఉన్న ప్రధాన రహదారులు విపరీతంగా దెబ్బతిన్నాయి.

**తాత్కాలిక మరమ్మతులు...**

డివిజన్‌లో మొత్తం 82.58 కి.మీ. మేర రహదారులు ధ్వంసం అయ్యాయి. ప్రధానంగా బూర్గంపాడు నుంచి ఏటూరు నాగారం వెళ్లే రోడ్డు, బూర్గంపాడు నుంచి మోరంపల్లి బంజర, సారపాక బూర్గంపాడు, భద్రాచలం- చర్ల, అశ్వాపురం రహదారి దెబ్బతిన్నాయి. వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా ఉండేందుకు అధికారులు డోజర్లతో మట్టి, కంకర పోసి తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. తాత్కాలిక మరమ్మతులకు రూ.2.2 కోట్లు, శాశ్వత



మరమ్మతులకు రూ.59.42 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపించినట్లు ఈఈ నాగేశ్వరరావు 'న్యూస్‌టుడే'కి తెలిపారు.

జిల్లాలో ర.భ. రహదారులు: 1615 కి.మీ.

కొత్తగూడెం డివిజన్: 916 కి.మీ.

భద్రాచలం డివిజన్: 699 కి.మీ.

కొత్తగూడెం డివిజన్‌లో..

డివిజన్ పరిధిలో దాదాపు 139 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయి. పాల్వంచ పట్టణం నుంచి దమ్మపేట, అశ్వారావుపేట మార్గంలో రహదారి ఇబ్బందికరంగా గోతులు పడ్డాయి.

గండుగులపల్లి, సత్తుపల్లి నుంచి పట్వారిగూడెం రహదారి విపరీతంగా దెబ్బతింది. తక్షణం మరమ్మతులు చేయాల్సి ఉంది.

జిల్లా వ్యాప్తంగా దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు అంచనాలు రూపొందించి నిధుల కోసం ప్రతిపాదనలు పంపించామని ర.భ. ఈఈ వి.వెంకటేశ్వరరావు తెలిపారు.

# ఏఈఓలకు చేతినిండా పని

ఖమ్మం : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వారం రోజుల క్రితం ప్రారంభమైన 'డిజిటల్ క్రాప్ సర్వే' క్రమంగా పట్టాలెక్కుతోంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం సర్వే చేపడుతున్నారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో కొంత ఆలస్యంగా మొదలైంది. సర్వే పురోగతిని వ్యవసాయ శాఖ డైరెక్టర్ సమీక్షిస్తున్నారు. వచ్చే అక్టోబరు 25నాటికి పూర్తి చేయాల్సి ఉంది. గతేడాది సర్వే నిర్వహణకు ఏఈవోలు చేతులెత్తేయగా ఈ ఏడాది ఆ సమస్య తలెత్తకుండా, సజావుగా సాగేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు.

**ముఖ్యాంశాలు..**

సీజన్‌లో ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి తమ క్లస్టర్ పరిధిలోని రైతులను ప్రత్యక్షంగా కలిసి వాస్తవంగా సాగులో ఉన్న క్షేత్రాన్ని పరిశీలించి ఆ వివరాలను మాత్రమే నమోదు చేయాలి.

మహిళా ఏఈఓలు కనీసం 1,800 ఎకరాల్లో, ఇతర ఏఈఓలు కనీసం 2వేల ఎకరాల్లో డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహిస్తారు. మిగిలిన వాటికి సాధారణ క్రాప్ బుకింగ్ పద్ధతిలో చేస్తారు.

ప్రతి పంటను ఫొటో తీసి అప్‌లోడ్ చేయటం తప్పనిసరి. నమోదు మొత్తాన్ని ఒకే మొబైల్ యాప్ ద్వారా పూర్తి చేస్తారు.

సర్వేలో వరి రకాల వివరాలు పేర్కొనటం తప్పనిసరి. ధాన్యం సేకరణ కోసం ఇది ఉపయోగపడుతుంది.



స్వల్పకాలిక పంటలైన మినుము, పెసర, మొక్కజొన్న వంటి వాటిని ముందుగా నమోదు చేయాలి.

పట్టాదారు పాసుపుస్తకం లేని, పోడు, దేవాదాయ భూముల్లో సాగు చేసే పంటలను రైతు పేరు, ఆధార్, చరవాణి నెంబరు మొదలైన వివరాల సాయంతో నమోదు చేస్తారు.

రైతు సమాచారంక్రాప్ బుకింగ్ 90శాతం పూర్తి కాగానే రైతులకు సంక్షిప్త సమాచారం ద్వారా వివరాలు పంపిస్తారు. రైతు వివరాలు ప్రతి గ్రామ పంచాయతీలో ప్రదర్శించాలి. నమోదులో తప్పులు దొర్లితే సరిచేయమంటూ రైతు దరఖాస్తు ఇవ్వాలి. ఏఈఓ మూడు రోజుల్లో సరిచేసి తుది జాబితా ప్రదర్శించాలి. **ఎందుకీ సర్వే?** దేశంలో ఏ పంట దిగుబడి ఎంత వస్తుందనే అంచనా. దిగుబడులకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, మద్దతు ధరల నిర్ణయం. ప్రకృతి వైపరీత్యాల సమయంలో కచ్చితత్వంతో నష్ట నిర్ధారణ. చీడపీడల ఉనికి, తగిన విధంగా రైతులు తీసుకోవాల్సిన యాజమాన్య చర్యలు సంసిద్ధత. వ్యవసాయ పురోగతి అంచనాకు దోహదపడుతుంది. 'జిల్లాలో డిజిటల్ క్రాప్ సర్వే ముమ్మరంగా సాగుతోంది. తప్పుగా నమోదైన వివరాలు సరిచేసేందుకు అవకాశం ఉంది. ఏఈఓలకు రైతులు సహకరించాలి.' ధనసరి పుల్లయ్య, డీఏఓ, ఖమ్మం.

# ఖమ్మం దరిన చెక్కు చెదర'నిధి'..

ఖమ్మం : 129 ఏళ్ల క్రితం ఖమ్మం తీరాన మున్నేరుపై నిర్మించిన వారధి ఏడాది క్రితం కనీవినీ ఎరుగని రీతిలో వచ్చిన భారీ వరద ఉద్ధృతిని తట్టుకుని సగర్వంగా నిలిచింది. అంతక్రితమూ ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంది. 1896లో నిజాం నవాబు కాలంలో 200 మీటర్లు పొడవు, 20 అడుగుల వెడల్పుతో ఖమ్మం కాల్వొడ్డులో సున్నం, రాళ్లు ఉపయోగించి మున్నేరుపై వంతెన నిర్మించారు. 2024, ఆగస్టు 31 రాత్రి వరద ఉద్ధృతి పోటెత్తింది. 3.25 లక్షల క్యూసెక్కుల ప్రవాహం దిగువకు వెళ్లింది. 33 అడుగుల ఎత్తులో వాగు ప్రవహించింది. పాత వారధికి రెండు వైపులా కొన్నేళ్ల క్రితం ఏర్పాటైన రెండు సిమెంట్ కాంక్రీట్ వంతెనలు భారీ వరదలకు చిగురుటాకుల్లా వణికిపోయాయి. ప్రకాశ్‌నగర్ వద్ద హైలెవల్ వంతెనైతే స్లాబులు పక్కకు జరిగాయి. కానీ పాత రాతి కట్టడం మాత్రం ప్రవాహ వేగాన్ని తట్టుకుని అబ్బురపరిచింది. పాత వంతెనకు ఇరువైపులా కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తున్నారు. ఖమ్మం నగర అభివృద్ధి, విస్తరణలో సజీవ సాక్ష్యంగా నిలిచిన ప్రాచీన వారధిని నవీకరించి చారిత్రక వారసత్వ సంపదగా గుర్తించాలని స్థానికులు కోరుతున్నారు.

# వసతులు పెరిగితేనే సేవల విస్తరణ




ధర్మపురి: ధర్మపురి ప్రభుత్వాస్పత్రిలోని డయాలసిస్ కేంద్రం రోగులకు వరంగా మారిన.. వసతులు పెంచాల్సిన అవసరం ఉంది. 2023 ఫిబ్రవరి 13న ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ధర్మపురి, బీర్‌పూర్, బుగ్గారం, వెల్గటూరు, ఎండపల్లి మండలాలతో పాటు మంచిర్యాల జిల్లాకు చెందిన డయాలసిస్ రోగులు సైతం ఇక్కడ సేవలు పొందుతున్నారు. అంతక ముందు వీరంతా కరీంనగర్, జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో సేవలు పొందుతూ.. వ్యయప్రయాసాలతో బాధపడేవారు. స్థానికంగా ఉచితంగా అందుబాటులోకి రావడంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ధర్మపురిలో మొత్తం 5 యంత్రాలు, 5 పడకలు ఉన్నాయి. ప్రస్తుతం 22 మంది రోగులు సేవలు పొందుతున్నారు.

ఒక డాటా ఎంట్రీ ఆపరేటర్, ఒక స్టాఫ్ నర్సు, ఇద్దరు టెక్నీషియన్లు పనిచేస్తున్నారు.

కేంద్రానికి ప్రత్యేక వైద్యుడిని కేటాయించాలి. మందులు అరకొరగానే పంపిణీ చేస్తున్నారు. పూర్తిస్థాయిలో ఇవ్వాలి. నాలుగు గంటలు డయాలసిస్ సేవలు పొందితే.. కచ్చితంగా పాలు, పండ్లు ఇవ్వాలి. కానీ అమలు చేయటం లేదు.

ధర్మపురి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండుకు సామాజిక ఆసుపత్రి దూరంగా ఉంది. నడవటానికి వీలు లేని రోగులు రూ.100 వెచ్చించి ఆస్పత్రికి వెళ్తున్నారు.

ప్రస్తుతం అయిదు మంచాలకే పరిమితమైన ఈ కేంద్రాన్ని రోగులు పెరిగే అవకాశముండటంతో పదికి పెంచాలి.

**రవాణా సౌకర్యం కల్పిస్తే మేలు**

ధర్మపురిలోని డయాలసిస్ కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంది. 7 నెలల నుంచి ఇక్కడే సేవలు పొందుతున్నాను. ప్రభుత్వం రవాణా పరంగా సదుపాయాలు కల్పించాలి.

లక్ష్మి, జైన, ధర్మపురి

**సమస్యలు అధిగమిస్తూనే..**

ధర్మపురి ఆసుపత్రిలోని డయాలలిస్ కేంద్రంలో రోగులకు ఉచితంగా నాణ్యమైన సేవలందిస్తున్నాం. సమస్యలను అధిగమిస్తూనే రోగులకు బాధ్యతతో చికిత్సలు జరిపిస్తున్నాం. ప్రజలు వినియోగించుకోవాలి. సాయి, కేంద్రం డీఈవో (డాటా ఎంటర్ అధికారి

# పల్లె పాలనకు అవినీతి మరక



కరీంనగర్ : ఆగస్టు 15న పెద్దపల్లి జిల్లా మంథని మండలం చిల్లపల్లి పంచాయతీ కార్యదర్శి రామ్‌కిశోర్ దిల్లీలో జరిగిన స్వాతంత్ర్య వేడుకలకు ప్రత్యేక ఆహ్వానితుడిగా వెళ్లారు. పంచాయతీ జాతీయ స్థాయిలో అవార్డు వచ్చేలా విశేషంగా కృషి చేసినందుకు ఈ గుర్తింపు దక్కింది. దిల్లీలో జ్ఞాపిక అందుకొని జాతీయ స్థాయిలో ఉమ్మడి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేశారు.

ఆగస్టు 29న కరీంనగర్ జిల్లా వీణవంక మండలం చల్లూరు పంచాయతీ కార్యదర్శి నాగరాజు ఇంటి నంబరు కేటాయించడానికి రూ.20 వేలు లంచం తీసుకుంటూ అనిశా అధికారులకు చిక్కారు. ప్రతి పనికీ పైసల కోసం చేయి చాపే అధికారి పట్టుబడిన సంగతి తెలిసిన కొద్దిసేపటికే గ్రామస్థులంతా వచ్చి బాణసంచా కాల్చి ఆనందం వెలిబుచ్చారు.

ఇటీవల జగిత్యాల జిల్లా ధర్మపురి మండలానికి చెందిన ఓ కార్యదర్శి రోజువారీ విధుల నిర్వహణకు వినియోగించే ఫేసియల్ రికగ్నిషన్ యాప్‌లో తన ఫొటో స్థానంలో సీఎం చిత్రపటాన్ని పెట్టి సస్పెన్షన్‌కు గురయ్యారు. ఓవైపు నిధులు సక్రమంగా అందక, పాలకవర్గాలు లేక పల్లె పాలన అస్తవ్యస్తంగా మారగా కొందరు కార్యదర్శుల తీరు మరింత ఇబ్బందులకు గురి చేస్తోంది. కొందరు సొంతంగా నిధులు వెచ్చిస్తూ ఆదర్శంగా నిలుస్తుండగా మరికొందరు ప్రతి పనికీ డబ్బులు ఆశిస్తూ ప్రజలను వేధిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నాలుగు జిల్లాల పరిధిలో కార్యదర్శుల విధి నిర్వహణ విషయంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి.

**ఆయనదంతా సప'రేటు'**

చల్లపల్లి కార్యదర్శి నాగరాజు వ్యవహార శైలి ఆది నుంచీ వివాదాస్పదమేనని స్థానికులు పేర్కొంటున్నారు. ఏ పని కోసం పంచాయతీకి వెళ్లినా 'తనకేంటి' అన్నట్టుగా చేయి చాస్తుంటారన్న విమర్శలున్నాయి. ప్రతి పనికీ ధర నిర్ణయించి, దాన్నిబట్టే పని చేసేవారని చెబుతుంటారు. ఇంటి అనుమతులకు, దళితబంధు రెండో విడత నిధుల మంజూరులోనూ చేతివాటం చూపారని ఆరోపిస్తున్నారు. గతేడాది ఆగస్టులో బదిలీపై వచ్చిన నాగరాజు ఏడాది కాలంలోనే స్థానికుల్లో వ్యతిరేకత పెరిగేలా వ్యవహరించారు.

**కనిపించని పర్యవేక్షణాధికారులు**

ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,218 పంచాయతీలుండగా కార్యదర్శుల పనితీరుపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ అంతంతమాత్రంగానే ఉంది. ఒక్కో కార్యదర్శి రెండు మూడు పంచాయతీల బాధ్యతలు చూస్తుండగా కొన్ని చోట్ల మొక్కుబడిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

ఉదయం పంచాయతీలకు వెళ్లి ముఖ గుర్తింపుతో హాజరు నమోదు చేయడంతో పని అయినట్లుగా కొందరు వ్యవహరిస్తున్నారు.

2024 ఫిబ్రవరి 1 నుంచి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభం కాగా పర్యవేక్షణ లేక కార్యదర్శులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. మంత్రులు, కలెక్టర్లు, ఎమ్మెల్యేల పర్యటనలు మినహా ప్రత్యేకాధికారులు గ్రామాల ముఖం చూడటం లేదు.

# ఉప్పొంగిన మానేరు.. అన్నదాత కన్నీరు



సిరిసిల్ల: మానేరు వాగులో వచ్చిన భారీ వరద పంటలపై పంజా విసిరింది. వరి, పత్తి, కూరగాయల పంటలు పూత, గొలుసు దశలో పచ్చగా కళకళలాడుతున్న సమయంలో ఒక్కసారిగా వచ్చిన వరదలతో మొత్తం అంతా తుడిచిపెట్టుకుపోయాయి. ప్రభుత్వ ఆదేశాలతో వ్యవసాయశాఖ జిల్లాలో పంట నష్టాలను ప్రాథమికంగా అంచనా వేసింది. వాగు పరివాహక ప్రాంతాల్లో 562 ఎకరాల్లో నష్టం జరిగినట్లు గుర్తించారు. నష్టం జరిగిన రైతుల పరిస్థితి దయనీయంగా మారుతోంది.

**ఇదీ పరిస్థితి**

జిల్లాలో ఈ సీజన్‌లో ఇప్పటికీ చెప్పుకొదగిన భారీ వర్షాలు కురవలేదు. ఎగువన కురిసిన భారీ వర్షాలు.. వరదలతో మానేరు ఉప్పొంగింది. ఎగువ మానేరులోకి బుధ, గురువారాల్లో 80 వేల నుంచి లక్ష క్యూసెక్కుల వరద వచ్చింది. గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లిలో వాగు ఉద్ధృతిగా ప్రవహించగా వాగు ఒడ్డున పంటల్లో ఇసుకమేటలు వేశాయి. వరి, పత్తి, ఉద్యాన పంటల్లో రోజుల తరబడి నీరు నిలిచింది. దీంతో సరైన పోషకాలు అందక వేళ్లుకుళ్లిపోతుండటం దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. వ్యవసాయశాఖ క్షేత్రస్థాయిలో పంట నష్టాలను పరిశీలించి రైతులకు సూచనలు అందించాలని కోరుతున్నారు.

పంటలు అతివృష్టి భారిన పడినప్పుడు ప్రభుత్వం నుంచి కొన్నేళ్లుగా ఎలాంటి పంటల బీమా పథకాన్ని అమలు చేయడం లేదు. చాలా చోట్ల వరద ప్రవాహం ఉండటం.. పంట పొలాల్లోకి వెళ్లలేని పరిస్థితి. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రాథమిక నివేదికలు మాత్రమే సిద్ధం చేశారు.

బండరాళ్లే మిగిలాయి : ఈరవేణ చంద్రయ్య, గంభీరావుపేట

మానేరు వాగు ఒడ్డున తనకు ఉన్న ఎకరంతోపాటు పక్కనే రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. పంట గొలుసు దశలో పచ్చగా కళకళలాడుతుంది. వరదలకు పూర్తిగా కొట్టుకుపోయి బండరాళ్లు మిగిలాయి. వాగు సమీపంలో వందల ఎకరాల్లో ఇదే పరిస్థితి. అధికారులు నష్టం అంచనావేసి పరిహారం ఇప్పించాలి.

**పొలంలో ఇసుక మేటలు : కర్రొళ్ల మైసయ్య, తుర్కపల్లి, ముస్తాబాద్ మండలం**

వాగు ఉద్ధృతంగా ప్రవహించడంతో మాకు ఉన్న ఎకరం పొలం పూర్తిగా నీట మునిగింది. నీటి ప్రవాహం తగ్గాక చూస్తే పొలం పూర్తిగా ఇసుక మేటలో కూరుకుపోయింది. వ్యవసాయాధికారులు క్షేత్ర స్థాయిలో పంటను పరిశీలించి ఆదుకోవాలని వేడుకుంటున్నా.

# ఊహకందని నష్టం.. తేరుకోవటమే కష్టం

ఖమ్మం : ఆగస్టు 31న అర్ధరాత్రి.. ఏరు సంద్రమైంది. ఊరు ఏరులా మారింది.. కొన్ని ఉపద్రవాలు ఊహకందవు.. ఉత్పాతాలు మనముందున్నవేవీ మిగల్చవు. మాటలకందని విషాదాన్ని, జీవిత కాలపు నష్టాన్ని తప్ప.. నగరం గాఢనిద్రలో ఉన్న వేళ మొదలైన జాడకందని ప్రవాహం తెల్లారేసరికి మున్నేరు రూపంలో విరుచుకపడింది. మరుసటి రోజు (సెప్టెంబరు 1న) ఉదయానికి ఆ జలవిలయం వేలమందిని నిరాశ్రయుల్ని చేసింది. ఇళ్లను ముంచెత్తింది.. వాకిళ్లను చుట్టేసింది.. అందులో సామగ్రినంతా తనతో తీసుకెళ్లింది. కళ్లలో నీరు, కనుచూపు మేర ఏరు తప్ప ఏమీ కనిపించని పరిస్థితి. భారమైన హృదయాలతో బతుకు జీవుడా అంటూ ప్రాణం అరచేతిన పట్టుకొని వేలమంది పరుగులు పెట్టారు.. సాధించింది, సంపాదించింది గంగర్పాణమాయెనే అంటూ ఆక్రందనలు చేశారు.. మున్నేరు వందేళ్ల చరిత్ర చవి'చూడని' వరద ఎంత ప్రమాదకరంగా మారిందో గతేడాది ఇదే రోజు నగరాన్ని చూసినా, నేటికీ నగరవాసుల్ని అడిగినా తెలుస్తుంది. తనకు రెండు వైపులా ఉన్న ఇళ్లను మున్నేరు మింగేస్తే నడిబొడ్డున గొలుసు'కట్టు తప్పిన' లకారం వాగు వందలమందిని ఆగమాగం చేసింది.. అయిదంతస్తుల మేడల్నీ ఆవాహనం చేసుకుంది..

మున్నేరు జనావాసాల్ని కుదిపేస్తే పాలేరు, ఆకేరు పంటపొలాల్ని మింగేశాయి. గంటల వ్యవధిలో లక్షల క్యూసెక్కుల ప్రవాహం పచ్చని భూముల్ని ఇసుక దిబ్బలుగా మార్చాయి. ఏర్లన్నీ ఏకమైనట్టు తన్నుకొచ్చిన ప్రవాహ ఉద్ధృతిలో దారులు ధ్వంసమయ్యాయి. వంతెనలు తెగిపడ్డాయి. చెరువులు కట్టలు తెచ్చుకున్నాయి. కాల్వలు వేలాది ఎకరాల్ని కలుపుకొనిపోయాయి. దారితప్పిన వాగు రైతులకు గుండెకోత పెట్టింది. పాలేరు ఉపద్రవానికి, ఆకేరు అశాంతికి నేటికి సరిగ్గా ఏడాది.. ఏడాది కాలం కరిగిపోయినా ఉపద్రవం తాలూకు గాయాలు రెండుచోట్లా ఇంకా మానలేదు.. చేదు గుర్తులు చెదిరిపోలేదు.

బాధిత కుటుంబాల్లో కొందరికి ప్రభుత్వం అందించిన రూ.16,500 పరిహారం అందకపోవడంతో ఇబ్బందిగా మారింది. నగరపాలక సంస్థ అధికారులు పలుమార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా స్పందన లేదు. ఇక రహదారులు, విద్యుత్ సమస్యలు, కాల్వల నిర్మాణం వంటి వాటిని రూ.140 కోట్లతో ప్రతిపాదనలు చేయగా, ప్రభుత్వం విడుదల చేయలేదు. మున్సిపల్ సాధారణ నిధులు, కలెక్టర్ ప్రత్యేక నిధులు రూ.2కోట్లతో పునరుద్ధరణ చేపట్టారు.

**మున్నేరు..**

వందేళ్ల మున్నేరు చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో 2024, సెప్టెంబరు 1వ తేదీన 36 అడుగుల వరద ప్రవహించటంతో ఖమ్మం నగరంతోపాటు గ్రామీణ మండలంలోని తీర కాలనీలన్నీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఊహించని పరిణామానికి అధికార యంత్రాంగం సైతం మొదట్లో చేతులెత్తేసింది. ఆ తర్వాత బాధితులకు పునరావాసం మొదలు పునరుద్ధరణ వరకు రెండు నెలలపాటు తీవ్రంగా శ్రమించారు.

పూర్తిగా ఇళ్లు కోల్పోయిన వారి విషయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదు. కొన్ని కుటుంబాలు అక్కడ నుంచి వేరేప్రాంతానికి వెళ్లిపోగా, మరికొంత మంది మరమ్మతులు చేసుకొని జీవిస్తున్నారు. వేల సంఖ్యలో పాడైన ద్విచక్ర వాహనాల మరమ్మతులకు ఒక్కొక్కరికి రూ.వేలల్లో ఖర్చయ్యాయి.

ఇళ్లలో బురద, చెత్త తొలగింపునకు కనిష్ఠంగా రూ.10 వేలు ఖర్చు చేశారు. కొందరికి ప్రభుత్వ పరిహారం ఈ అవసరాలకే సరిపోయింది. స్వచ్ఛంద సంస్థలు ఇళ్ల సామగ్రిని భారీగా వితరణ చేశాయి.

ప్రభావిత ప్రాంతాల్లో నేటికీ సరైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవటం ఇబ్బందికరంగా మారింది.

లకారం వరద సమస్య పరిష్కారానికి చేపట్టిన అండర్ గ్రౌండ్ పనులు నెమ్మదిగా సాగుతున్నాయి.

రెండో వాగుతో గతేడాది సెప్టెంబరు 1నాటి పాలేరు, ఆకేరు వరద ఉద్ధృతికి కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాల్లో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వేలాది ఎకరాల్లో పంట మునిగిపోయింది. సుమారు 400 ఎకరాల్లో ఇసుక, వ్యర్థాలు మేట వేసిన, కోతకు గురయ్యాయి. ఎకరానికి రూ.10వేలు మినహా వీటి మరమ్మతులకు చిల్లిగవ్వ విదిల్చలేదు. నేటికీ వందలాది ఎకరాల్లో రాళ్లు, ఇసుక, వ్యర్థాల మేటలు దర్శనమిస్తున్నాయి. నియోజకవర్గంలో 12,298 ఎకరాల్లో పంట నష్టానికి మాత్రం 12,162 మంది రైతులకు రూ.10వేల చొప్పున పరిహారం అందింది. పాలేరు అలుగుల ప్రాంతంలో కాజ్‌వే ఘోరంగా దెబ్బతింది. పాలేరు- నర్సింహులగూడెం మధ్యలో రాతిబంధం వాగు చప్టా కొట్టుకపోయింది. తిరుమలాయపాలెం మండలంలో సుబ్లేడు- హస్నాబాద్, బీరోలు-బంధంపల్లి, సుబ్లేడు- మేడిదపల్లి గ్రామాల మధ్య రహదారులు ధ్వంసమయ్యాయి. తాత్కాలిక మరమ్మతులు తప్ప శాశ్వత పరిష్కారం నేటికీ లభించలేదు. బీరోలు చెరువుకట్ట పునర్నిర్మాణం, పాలేరు జలాశయం సమీపంలో యూటీ పునర్నిర్మాణం, భక్తరామదాసు మోటార్లు, నర్సింహులగూడెం ఎత్తిపోతల పథకాలు మరమ్మతులకు నోచుకున్నాయి. మున్నేరు దెబ్బకు విలవిలలాడిన ప్రాంతాలుపద్మావతినగర్, వెంకటేశ్వరనగర్, మంచికంటినగర్, బొక్కలగడ్డ, మోతీనగర్, పంపింగ్ వెల్ రోడ్డు, సారథినగర్ కొంత ప్రాంతం, ప్రకాశ్‌నగర్, రామన్నపేట, దానవాయిగూడెం, రామన్నపేట, జలగం నగర్, పెద్దతండా, కరుణగిరి, సాయిప్రభాత్ నగర్, ఆర్టీసీ కాలనీ, టీఎన్జీవో కాలనీ, ఏదులాపురంలో పలు కాలనీలు. లకారం చెరువు ప్రభావిత కాలనీలు.. చైతన్యనగర్, కవిరాజనగర్, వరదయ్యనగర్, మాణిక్యనగర్, చెరువుబజార్, చైతన్యనగర్, అబ్దుల్‌కలాం నగర్, ధంసలాపురం కొత్త కాలనీలు. బీ గ్రామీణ మండలంలో ఆకేరు పరిధిలో వాల్యాతండా, కస్నాతండా, తీర్థాలలో ఇళ్లు నష్టపోయారు. మొత్తం కూలిపోయిన, దెబ్బతిన్న ఇళ్లు: 9,292 (నగర పరిధిలో)

పరిహారం అందింది: 8,700అభివృద్ధి పనులకు, ఇతర అవసరాలకు నగరపాలక సంస్థ సాధారణ నిధుల నుంచి రూ.4కోట్లు ఖర్చు చేశారు.

# కలల వారధి.. జల సమాధి

2024, ఆగస్టు 31.. ఖమ్మం జిల్లాకు కాళరాత్రిగా మారిన రోజు. మున్నేరు ఉద్ధృతితో ఖమ్మం నగరం కకలావికలం కాగా పాలేరు, ఆకేరు వాగులకు వచ్చిన వరద ప్రవాహం పాలేరు నియోజకవర్గ ప్రజలకు పెనుశాపంలా మారింది. ఈ చిత్రంలో ఆనవాళ్లు కోల్పోయిన వంతెన అందులో భాగమే. ప్రారంభం కాకుండానే ఇది జల సమాధి అయింది. తిరుమలాయపాలెం మండలంలోని రావిచెట్టుతండా శివారు నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లా మరిపెడ మండలంలోని ధర్మారంలను కలుపుతూ మధ్యలో ఉన్న ఆకేరుపై గత ప్రభుత్వం వంతెన నిర్మించింది. రెండు జిల్లాల రైతులు, వ్యాపారులకు ఉపయోగపడే వంతెన స్థానిక ప్రజల కల. మరికొద్ది రోజుల్లో ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తుండగా, గతేడాది ఉవ్వెత్తున వచ్చిన వరద ధాటికి వం0తెన పైభాగంలోని స్లాబులు పేకమేడలా నీటి ప్రవాహంలో కొట్టుకుపో యాయి. భారీ పిల్లర్లు సైతం వంగిపోయాయి. అప్రోచ్ రోడ్డు ఆనవాళ్లు లేకుండా పోయింది. ఏడాదైనా నూతన వంతెన ఏర్పాటు కాకపోవటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆర్అండ్‌బీ డీఈ భగవాన్‌ని వివరణ కోరగా.. వంతెన ఆనవాళ్లను పూర్తిగా తొలగించి, అదే ప్రదేశంలో నూతన నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు.

చురకలు



## హే 'గాంధీ'.. తాగునీరేదీ?

హైదరాబాద్ : గాంధీ ఆసుపత్రిలో 3 గంటల నుంచి రాత్రి పొద్దుపోయే వరకు నీటి సరఫరా లేక రోగులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ప్రధాన భవనంలో ఒకటో అంతస్తు నుంచి ఏడో అంతస్తు వరకు అన్ని వార్డుల్లో అగచాట్లు తప్పలేదు. ఆపరేషన్ థియేటర్లకూ సరఫరా లేక శస్త్రచికిత్సలను వాయిదా వేశారు. అత్యవసర చికిత్సలను మాత్రం ఎమర్జెన్సీ బ్లాక్‌లో నిర్వహించారు. బాత్‌రూంల్లో నీళ్లు లేక దుర్గంధం వెలువడింది. రోగుల సహాయకులు బకెట్లు కొనుగోలు చేసి కింద నుంచి నీటిని మోసుకెళ్లారు. ప్రధాన భవనంలో 7 ఆపరేషన్ థియేటర్లు, 27 విభాగాలు, 1500 పడకలకు సంబంధించి అత్యవసర వార్డులు, ఐసీయూలు, సాధారణ వార్డులున్నాయి. 3 మోటార్లతో సరఫరా చేస్తుంటారు. తెల్లవారుజామున విద్యుదాఘాతంతో



అవి కాలిపోయాయి. స్టాండ్‌బైగా ఉన్న మరో 3 కూడా మొరాయించాయి. పునరుద్ధరణలో తీవ్ర జాప్యం నెలకొంది. కనీస అవసరాలు తీర్చుకునేందుకు డ్రమ్ములు లాంటివి కూడా ఏర్పాటు చేసేందుకు చొరవ చూపలేదని రోగులు వాపోయారు. అధికారులు, సిబ్బంది ఒకరిపై ఒకరు చెప్పుకొంటూ కాలం వెళ్లదీశారని ఆరోపించారు. ఎట్టకేలకు మోటార్లకు మరమ్మతులు చేసి పొద్దుపోయిన తర్వాత సరఫరా పునరుద్ధరించారు.

## రాబడికి.. రాజధాని.. రాష్ట్ర ఆదాయంలో 60 శాతం ఓఆర్ఆర్ లోపలే

హైదరాబాద్: హైదరాబాద్ మహానగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న స్థిరాస్తి వ్యాపారం రాష్ట్ర ఖజానాకు దన్నుగా నిలుస్తోంది. తెలంగాణ రాష్ట్ర రిజిస్ట్రేషన్ల ఆదాయంలో సగానికిపైగా ఓఆర్ఆర్ లోపల ఉన్న 38 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచే సమకూరుతోంది. గతేడాది రాష్ట్రానికి రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా రూ.14,500 కోట్ల రాబడి



రాగా అందులో రూ.8,572 కోట్లు నగరం నుంచే సమకూరడం గమనార్హం. రాజధాని చుట్టుపక్కల ఓఆర్ఆర్ వరకు నిత్యం 1400కు పైగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో ఏటా అధికారికంగానే రూ.లక్ష కోట్ల విలువైన ఆస్తుల క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. రంగారెడ్డి సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్, గండిపేట, పటాన్‌చెరు, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి, మేడ్చల్, బంజారాహిల్స్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఆదాయంలో ముందున్నాయి. రంగారెడ్డి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా 2024–25లో రూ.1,084 కోట్లు రాగా తర్వాత స్థానంలో రూ.1,056 కోట్లతో గండిపేట ఉంది. ఈ రెండు కార్యాలయాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్లు అత్యధిక విలువను కలిగి ఉన్నాయి. ప్రధానంగా విల్లాలు, ఖరీదైన అపార్ట్‌మెంట్ల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం భారీగా వస్తోంది. రాష్ట్రంలోనే అత్యధిక రిజిస్ట్రేషన్ రాబడి ఉన్న కార్యాలయాల్లో రంగారెడ్డి, గండిపేట ఉన్నాయి. ఏటా రూ.వెయ్యికోట్లకు పైగా రాబడి తెచ్చే సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులు రెండు ఉండగా, రూ.500 కోట్లకు పైగా రాబడి తెచ్చేవి మరో రెండు ఉన్నాయి. చార్మినార్, అబ్దుల్లాపూర్‌మెట్, ఘట్‌కేసర్, శామీర్‌పేట రిజిస్ట్రేషన్ల ఆఫీసుల నుంచి సగటు ఏడాదికి రూ.60 కోట్ల కంటే తక్కువ ఆదాయం వస్తోంది. గతేడాది అతి తక్కువ రాబడి చార్మినార్‌లో రూ.34 కోట్లుగా నమోదైంది.

## నైపుణ్యాలకు పదును.. ఆవిష్కరణలకు దన్ను

కరీంనగర్ : పాఠశాలల స్థాయి విద్యార్థులు శాస్త్ర, సాంకేతికతను అందిపుచ్చుకొని, నైపుణ్యాలను పెంచుకున్నప్పుడే భవిష్యత్తులో రాణిస్తారు. అందులో ఒకటి రోబోటిక్స్. ప్రైవేటు విద్యాలయాలు అయితే అదనపు రుసుం తీసుకొని దీనిపై శిక్షణ ఇస్తుంటాయి. ప్రభుత్వ పాఠశాల, గురుకుల, కేంద్రీయ, కస్తూర్బాగాంధీ, నవోదయ విద్యార్థులకు ఈ సేవలు లభించడం కష్టమే. కానీ గత రెండేళ్లుగా సోహం అకాడమీ వారు రోబోటిక్స్‌లో మెలకువలు నేర్పిస్తున్నారు. వీరు రాష్ట్రంలో 24 జిల్లాలో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. కరీంనగర్ జిల్లాలో కలెక్టర్ పమేలా సత్పతి, విద్యాశాఖ సహకారంతో 15 పాఠశాలల్లో దీనిని అమలు చేస్తున్నారు.ఇప్పటివరకు 2685 మంది విద్యార్థులు ఈ శిక్షణతో ప్రయోజనం పొందినట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. ప్రాథమిక సిద్ధాంతాలు, సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థికి సమగ్రంగా అందిస్తున్నారు. వారి పరిజ్ఞానంతో కొత్త ఆవిష్కరణలు తయారు చేసేందుకు ప్రయత్నిస్తుంటారు. గత రెండేళ్లుగా జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రోబో ఆవిష్కరణలు పోటీల్లో ప్రదర్శించి ప్రశంసలు పొందారు.అకాడమీకి చెందిన ఇన్‌స్ట్రక్టర్లు ఒక్కో పాఠశాలలో నెలకు 3,4 తరగతుల చొప్పున తర్ఫీదు ఇస్తుంటారు. ప్రతి పాఠశాలలో 15 మందితో కలిసి రోబోటిక్స్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. పిల్లలు రూపొందించిన ఆవిష్కరణల వీడియోలు తీసి, సంబంధిత అకాడమీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ప్రతిభ చూపే విద్యార్థులను రాష్ట్ర స్థాయి మినీ హక్‌థాన్, వార్షిక రోబోటిక్స్ ఎగ్జిబిషన్ పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నారు.విద్యార్థులకు సంస్థ వారే రోబోటిక్ కిట్లు (సెన్సార్లు, మోటార్లు వంటివి) అందజేస్తున్నారు. వినూత్నంగా ఆలోచించడం, ప్రోగ్రామింగ్, ఎలక్ట్రానిక్, మెషిన్ డిజైన్ వంటి సాంకేతిక నైపుణ్యాలు పాఠశాలల స్థాయిలోనే అలవడుతున్నాయి. విద్యార్థుల ఆసక్తి దృష్ట్యా కరీంనగర్‌లోని జిల్లా సైన్స్ మ్యూజియంలో ఒక గదిని కేటాయించి, వారు తయారు చేసిన వాటిని ఏర్పాటు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు.

# చదువులమ్మ ఒడిలో.. మత్తు జాడలు!



హైదరాబాద్ :ముంబయికి చెందిన ఇద్దరి నుంచి భారీఎత్తున ఈ–సిగరెట్స్ స్వాధీనం చేసుకున్నారు. వీరి వద్ద 500 మంది కొనుగోలుదారులున్నట్టు పోలీసులు గుర్తించారు. వీరిలో 15 పాఠశాలల్లో చదువుతున్న 300 మంది ఉన్నట్టు నిర్ధారించారు. ఆ పిల్లలకు తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. నగర శివారులోని ఓ అపార్ట్‌మెంట్‌లో రేవ్‌పార్టీ భగ్నం చేసిన పోలీసులు ముగ్గురు ఇంజినీరింగ్ విద్యార్థులను అరెస్ట్ చేశారు. తాజాగా ప్రముఖ వర్సిటీలో గంజాయి తీసుకుంటున్న 50 మంది విద్యార్థులను గుర్తించారు. వీరికి అంతర్రాష్ట్ర ముఠాలతో సంబంధాలు న్నట్టు నిర్ధారించారు. వరుస ఘటనలతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. విద్యాసంస్థల నిర్వాహకులు, బోధన సిబ్బందికి అవగాహన సదస్సులు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు.

**వసతి గృహాల్లోనే అధికం**

పాఠశాల వయసులో ఈ–సిగరెట్‌కు అలవాటవుతున్నారు. కళాశాలకు చేరగానే గంజాయి లాగిస్తున్నారు. విశ్వవిద్యాలయంలో కాలుపెట్టగానే సింథటిక్ డ్రగ్స్‌కు బానిసలవుతున్నారు. పలు విద్యాసంస్థల్లోని విద్యార్థులకు అంతర్రాష్ట్ర ముఠాలు మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్నాయి. గతేడాది సుమారు ఆరు వర్సిటీల్లో 120 మంది విద్యార్థులు గంజాయి తీసుకుంటున్నట్టు టీజీన్యాబ్ గుర్తించింది. వసతిగృహాల్లో ఉంటున్న వారిపై పర్యవేక్షణ కొరవడటంతో తేలికగా ప్రాంగణంలోకి మత్తుపదార్థాలు చేరుతున్నట్టు తేల్చారు. దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులు వీసీలకు సూచించినా ప్రయోజనం లేకుండా పోయింది. కొత్తరుచులు ఆస్వాదించాలనే ఆలోచనతో యువతీ యువకులు తప్పటడుగు వేస్తున్నారని ఈగల్ ఎస్పీ రూపేశ్ కుమార్ అన్నారు.

**బానిసలవుతున్నారిలా..**

నగర శివారున వర్సిటీలో ఓ యువకుడు (18) చేరాడు. సిగరెట్ అలవాటు కూడా లేని అతడు ఏడాదిలో హెరాయిన్ లేకుండా ఉండలేనంతగా మారాడు. ఇటీవల పట్టుబడినప్పుడు తాను డ్రగ్స్‌కు బానిస అయ్యేందుకు అతడు చెప్పిన కారణాలు విని పోలీసు అధికారి విస్మయానికి గురయ్యారు. కొత్తవ్యక్తులు అక్కడ ఉండాలంటే తమ అలవాట్లను అనుసరించాలంటూ సీనియర్లు ఒత్తిడి తెచ్చారు..నెమ్మదిగా మత్తుఉచ్చులోకి లాగారు. పాఠశాల స్థాయి నుంచి వర్సిటీవరకూ ఇదొక నయా ట్రెండ్. తమ జట్టులో కలవాలంటే ఎలా ఉండాలో నిబంధనలు విధిస్తున్నారు. దానికి అంగీకరించకుంటే దూరంగా ఉంచుతారు. చుట్టూ అందరున్నా ఒంటరితనం భరించలేక ఏ దురలవాట్లూ లేని పిల్లలు కూడా తప్పటడుగు వేస్తున్నారని పోలీసు ఉన్నతాధికారి ఆందోళన వెలిబుచ్చారు.

# కరవు తీరేలా.. సిరులు పండేలా..



పరిగి: ఏళ్ల తరవాత కేపీ లక్ష్మీదేవిపల్లి(కొందుర్గు, పరిగి, లక్ష్మీదేవిపల్లి) ప్రాజెక్టు తెరపైకి రావడంతో అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఇటీవల నియోజకవర్గంలో పర్యటించినప్పుడు భూ సేకరణ జీఓ త్వరలో విడుదల కానుందని సంకేతాలిచ్చారు. భారీ సాగునీటి పారుదల శాఖ అధికారులు సైతం ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. పరిగి, షాద్‌నగర్ ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్ నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీరు, ఇతర అధికారులతో కలిసి స్థలం పరిశీలించడం మరింత ఊతమిస్తోంది.

**2.8 టీఎంసీల సామర్థ్యం..**

రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలంలోని కేపీ లక్ష్మీదేవిపల్లి జలాశయం సామర్థ్యం 2.8 టీఎంసీలుగా నిర్ధారించారు. 1,512 ఎకరాల భూమి అవసరం. సామర్థ్యాన్ని 5 టీఎంసీలకు పెంచాలని ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. సుమారు 2వేల ఫీట్ల లోతు పెంచితే 5 టీఎంసీలకు చేరే అవకాశాలను సంబంధిత అధికారులు పరిశీలిస్తున్నారు. పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద తొలి దశలో రూ.1,714 కోట్లు కేటాయించినట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఇందులో భాగంగానే కేపీ లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి రూపకల్పన చేస్తున్నారు.

**ఉదండాపూర్ నుంచి..**

సముద్ర మట్టానికి దాదాపు 630 మీటర్ల ఎత్తులో కేపీ లక్ష్మీదేవిపల్లి ఉంది. దీంతో ఇక్కడ బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నిర్మిస్తారు. ఇందుకోసం సుమారు రూ.8వేల కోట్లు వెచ్చించనున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని ఉదండాపూర్ నుంచి ఇక్కడికి కాల్వల ద్వారా నీరు సరఫరా చేస్తారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో దాదాపు 4 లక్షల ఎకరాలకు సాగునీరందనుంది. శంకర్‌పల్లి వరకు వచ్చిన ప్రాణహిత–చేవెళ్ల టన్నెల్ ద్వారా గోదావరి జలాలనూ తెచ్చేందుకు ప్రయత్నాలు మరింత ముమ్మరమయ్యాయి. అటు గోదావరి ఇటు కృష్ణానీటిని సంగమం చేయడం ద్వారా తరతరాలుగా సాగునీటి సమస్య తీరుతుందని నేతలు యోచిస్తున్నారు.

**పరిగిని సస్యశ్యామలం చేస్తాం.. : టి.రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిగి**

పరిగి ప్రాంతాన్ని సుభిక్షంగా మార్చడమే లక్ష్యం. ఈ గడ్డపై మా పేరు శాశ్వతంగా ఉండాలనుకుంటున్నా. 2.8 నుంచి 5 టీఎంసీలకు పెంచాలని సీఎంను కోరతా. అభివృద్ధి పనుల కోసం అవిరళ కృషి చేస్తున్నాం.

**దశాబ్దాల పోరాట ఫలితం.. : వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్**

కరవు నేలను తడపాలని ఎంతో కాలంగా పోరాటం చేస్తున్నాం. ఇప్పటికి ఆ కల నెరవేరబోతోంది. సాగునీటి కోసం రైతన్నలు అష్టకష్టాలు పడుతున్నారు. బోర్లు వేస్తున్నా చుక్కనీరు రాక ఆర్థికంగా చాలా నష్టపోతున్నారు. రిజర్వాయరు రాకతో కష్టాలన్నీ తీరనున్నాయి.

# ఉప్పొంగిన 'జంట'నదులు



పరిగి: 'జంట' నదులు జల ప్రవాహంతో ఉప్పొంగి పారుతున్నాయి. ఒకవైపు మూసీ.. ఇంకో వైపున ఈసీ నదిలో వరద ప్రవాహం ఉద్ధృతంగా పారుతోంది. లంగర్‌హౌస్ సమీపంలోని త్రివేణి సంగమం వద్ద 'జల' సందడి నెలకొంది. ప్రస్తుతం హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్(గండిపేట) జలాశయాలు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకున్నాయి. దీంతో జలమండలి అధికారులు ఆయా జలాశయాల క్రస్టుగేట్‌లను ఎత్తి నీటిని ఈసీ, మూసీ నదుల్లోకి వదులుతున్నారు. ఈ రెండు జలాశయాలకు సంబంధించి మొత్తంగా 11 క్రస్టుగేట్‌లను ఎత్తి 5వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో ఈసీ నది పరీవాహకప్రాంతంలో కిస్మత్‌పూర్ వంతెన వద్ద వరద ఉగ్రరూపం దాల్చడంతో హనుమాన్ ఆలయం నీటమునిగింది. నార్సింగి–మంచిరేవుల మార్గంలోని వంతెన పైనుంచి ఉరకలెత్తి పారుతోంది. త్రివేణి సంగమం వద్ద జంట నదుల వరద కలుస్తుండగా.. ప్రవాహం దిగువకు మరింత వేగంగా పారుతోంది. శుక్రవారం ఉదయం ఆయా మార్గాల్లో వాహనాల రాకపోకలను నిలిపివేశారు.

**ఎగువ నుంచి పోటెత్తుతున్న ప్రవాహం..**హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌లకు ఈసీ, మూసీ వాగుల ద్వారా భారీగా వరద వచ్చి చేరుతోంది. ఆయా వాగుల ద్వారా జంట జలాశయాలకు సుమారు 2వేల క్యూసెక్కుల మేర వచ్చి చేరుతోంది. ప్రస్తుతం జంట జలాశయాలు పూర్తిస్థాయి నీటిమట్టంలో కొనసాగుతున్నట్లు జలమండలి అధికారులు వెల్లడించారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఏళ్లుగా ఈసీ, మూసీ నదుల్లో దుర్గంధం పేరుకుపోయింది. ప్రస్తుత ప్రవాహంతో అంతా కొట్టుకుపోయింది. కొత్తనీటితో నదులు కొత్త అందాలను ఒలకబోస్తున్నాయి. నీటి ప్రవాహం సవ్వడి పర్యాటకులను ఆకట్టుకుంటోంది.

**ఉస్మాన్‌సాగర్ 8 గేట్లు ఎత్తి నీరు విడుదల**ఉస్మాన్‌సాగర్ (గండిపేట) జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వరద పోటెత్తడంతో 8 గేట్లను ఎత్తి వరద నీటిని దిగువన మూసీలోకి వదులుతున్నారు. జలాశయం నుంచి 4,096 క్యూసెక్కుల నీటిని దిగువకు వదలడంతో మంచిరేవుల – నార్సింగి కల్వర్టుపై సుమారు 6 అడుగుల ఎత్తులో నీరు ప్రవహిస్తోంది. ఈ గ్రామాల మధ్య రాకపోక లు నిలిపివేశారు. నార్సింగి సర్వీసు రోడ్డుపై రాకపోకలు నిలిపివేశారు. టోల్ ప్లాజా ఎగ్జిట్ 18ఎ పూర్తిగా మూసివేశారు. సాయంత్రం వరద తగ్గుముఖం పట్టినా కల్వర్టుల పైనుంచి ఇంకా నీరు పారుతుండటంతో రాకపోకలు నిలిపేశామని నార్సింగి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఉస్మాన్‌సాగర్ పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 3.9 టీఎంసీలు. ప్రస్తుతం 3.693 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

## కాసుల కక్కుర్తి.. వాహనాల్లో కుక్కి!

గంగాధర: వ్యవ'సాయం'లో అన్నదాతలకు చేయూతనందించిన పశువులు వయసు మీద పడటంతో ఏ పనీ చేయలేక భారంగా మారుతున్నాయి. ఈ మధ్య కాలంలో సాగులో యాంత్రీకరణతో పశువుల వినియోగం తగ్గింది. ఈ కారణాలతో రైతులు పశువులను అమ్ముకుంటున్నారు. దీనిని గమనించిన కొందరు దళారులు వారసంతల్లో నిత్యం పశువులను కొనుగోలు చేస్తూ కబేళాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పశువులను వాహనాల్లో ఎక్కించి, దింపే సమయాల్లో ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కదలాడానికి స్థలం లేకుండా చిన్న చిన్న వ్యాన్లలో వందల కిలోమీటర్లు తరలిస్తున్నారు. ఒకదానిపై ఒకటి కుక్కి మరీ తరలిస్తున్నారు. ఊపిరాడక మూగ జీవులు ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. వాహనాల నుంచి కింద పడిపోయి గాయాలైన సంఘటనలున్నాయి. ఈ సమయాల్లో మూగజీవుల బాధ



తీవ్రంగా ఉంటుంది.

**రూ.కోట్లలో వ్యాపారం**

ఉమ్మడి జిల్లాలోని గంగాధర, సుల్తానాబాద్, గర్రెపల్లి, జగిత్యాల, సిరిసిల్ల, నుస్తులాపూర్, ధర్మారం మండలం రాజారాంపల్లి, చొప్పదండి, బెజ్జంకి, మెట్‌పల్లి, ఎల్లారెడ్డిపేట వారసంతల్లో పశువుల క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఒక్క గంగాధర వారసంతలోనే ప్రతి శనివారం 600 నుంచి 800 పశువుల విక్రయాలు జరుగుతుండగా దాదాపు రూ.2 కోట్ల వ్యాపారం జరుగుతోందని అంచనా. నేరుగా గ్రామాల్లో రైతుల వద్దకు వ్యాపారులు వెళ్లి పశువులను తక్కువ ధరలకు కొనుగోలు చేసి వారసంతల్లోకి వాహనాల్లో తరలిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 200 మంది దళారులు వ్యాన్లలో కేరళ, నాందేడ్, మహారాష్ట్ర, మెదక్, హైదరాబాద్, కామారెడ్డి, సిద్దిపేట, ఇతర ప్రాంతాల కబేళాలకు తరలిస్తున్నారు. దీంతో రోజురోజుకూ పశుసంపద తగ్గిపోతోంది.

# వణికిస్తున్న డెంగీ.. మలేరియా

కొత్తగూడెం: జిల్లాలో డెంగీ, మలేరియా కోరలు చాస్తోంది. కేవలం 12రోజుల వ్యవధిలో మలేరియా పాజిటివ్ కేసులు 43, డెంగీ కేసులు 34 నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఆగస్టు 19నాటికి మలేరియా 11, డెంగీ 54 కేసులుండగా.. ప్రస్తుతం మలేరియా 54, డెంగీ 88గా నమోదయ్యాయి. గత కొన్ని రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులు.. ముసురుతో కూడిన వర్షాల కారణంగా అనారోగ్య సమస్యలు అధికమవుతున్నాయి. వైరల్ జ్వరాలు, జలుబులతో పాటు విష జ్వరాలు విజృంభిస్తుండటంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు బాధితులతో కిటకిటలాడుతున్నాయి. ప్రధానంగా ఆళ్లపల్లి మండలంలో డెంగీ కేసులు అధికంగా నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు.

**జులైలో అయిదు.. ఆగస్టుకు 88**

జిల్లాలో నెల వ్యవధిలోనే పరిస్థితులు మారిపోయాయి. ఈ ఏడాది జనవరి నుంచి జులై వరకు డెంగీ కేసులు ఐదు నమోదు కాగా.. ఆగస్టు చివరి నాటికి అవి 88కి చేరాయి. కేవలం ఒక్క నెలలోనే 83 కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి తీవ్రత అర్థం చేసుకోవచ్చు. ఇవన్నీ అధికారిక లెక్కలు. ప్రైవేటు ఆసుపత్రుల్లో, ఇతర నగరాల్లో చికిత్స పొందుతున్న జిల్లా వాసులు అనధికారికంగా పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఇవి కాకుండా జలుబు, దగ్గు, తీవ్ర ఒళ్లు నొప్పులు, కళ్లమంట, శ్వాస సంబంధిత వ్యాధి బాధితులు జిల్లా సర్వజనాసుపత్రికి బారులుదీరుతున్నారు. ఇంటో ఒకరు వ్యాధి బారిన పడితే వరుసగా కుటుంబ సభ్యులందరికీ వ్యాపిస్తోంది. గ్రామాల్లో పారిశుద్ధ్య లేమి, నిధుల కొరత, తేమ వాతావరణం కారణంగా సెప్టెంబరులోనూ సమస్య తీవ్రత అధికంగా ఉండే అవకాశముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**పడకేసిన పారిశుద్ధ్యం**

జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు తోడు.. పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా తయారైంది. ఏజెన్సీలో ఇదే సమస్యతో వ్యాధులు ప్రబలుతున్నట్లు అర్థమవుతోంది. పంచాయతీల్లో నిధుల కొరత కారణంగా దోమల నివారణ చర్యలను గాలికొదిలేస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో వైద్య సదుపాయాల కల్పన ఆశించిన స్థాయిలో లేకపోవటం



ప్రతికూలంగా మారింది. జిల్లాలో మలేరియా హైరిస్క్ విభాగం కింద 80గ్రామాలు, డెంగీ హైరిస్క్ విభాగం కింద 162 గ్రామాలు ఉన్నట్లు అధికారులు ప్రకటించడమే ఇందుకు నిదర్శనం.

**స్వీయ సంరక్షణ చర్యలే కీలకం**

వ్యాధులు విజృంభించకుండా స్వీయ జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇంటి పరిసరాల్లో దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్త పడాలి. వర్షాకాలంలో కాచివడపోసిన నీటిని తాగడం ఉత్తమమని, వేడిగా ఉన్నప్పుడే ఆహార పదార్థాలను తీసుకోవాలని, జ్వరం బారిన పడితే వెంటనే వైద్యులను సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో కేసులు

మలేరియా: 54

డెంగీ: 88

'వైద్యశాఖ పరంగా గ్రామాల్లో దోమల నివారణ చర్యలు చేపడుతున్నాం. ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రై డే నిర్వహిస్తున్నాం. ఇంటింటా జ్వర సర్వే నిర్వహించి, పాజిటివ్ కేసులు నమోదైన ప్రాంతాల్లో దోమల మందు పిచికారి చేయిస్తున్నాం.'డా.స్పందన, మలేరియా జిల్లా ప్రోగ్రాం అధికారి, భద్రాద్రి కొత్తగూడెం

# అదిలించొద్దు.. బెదిరించొద్దు

సూర్యాపేట : వీధి కుక్కలు కనిపిస్తే వాటిని ఏమనకుండా ఉండాలి. అదిరించినా.. బెదిరించినా తిరిగి దాడిచేసే అవకాశం ఉంది. ఆగస్టు, సెప్టెంబరు శునకాల పునరుత్పత్తికి అనువైన సమయం. వాటి గోప్యతకు భంగం కలిగించొద్దు. వ్యతిరేక స్వభావం కలిగి ఉంటాయని గుర్తెరిగి మెలగాలి.

వైరస్ ఇలా సోకుతుంది: కుక్కలు కాటేస్తే లాలాజలం ద్వారా బాధిత వ్యక్తి రక్తంలోకి వైరస్ నెమ్మదిగా వెళ్తుంది. కాలి, చేతి భాగంలో కరిస్తే.. పైభాగంలో కట్టు కట్టాలి. తద్వారా వైరస్ శరీరమంతా వ్యాపించదు. గాయం వద్ద ధారాళంగా పారే నీటితో ఐదు నిమిషాలు కడగాలి. సబ్బు, పసుపు, ఇతరత్రాలు పెట్టొద్దు. ఆలస్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలి.

**రేబిస్ నివారణ:** కుక్క కరిచిన తొలిరోజు నుంచి పోస్టుబైట్ వ్యాక్సినేషన్(మూడు నెలల వ్యవధిలో) ఏడు డోసులు తీసుకోవాలి.



తద్వారా రేబిస్‌ను నివారించుచ్చు. సదరు టీకా పీహెచ్‌సీ, ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల్లో లభిస్తోంది. పశువులకు కరిస్తే ప్రైవేటు మందుల దుకాణాల్లో టీకా దొరుకుతుంది.

పిల్లలను, వృద్ధులను కుక్కలు లక్ష్యంగా చేసుకుంటాయి. ఈ తరుణంలో కుటుంబ సభ్యులు కన్నేసి ఉంచాలి. కళ్లలోకి సూటిగా చూడొద్దు. అనవసరంగా కర్రలు, రాళ్లతో తరమొద్దు, రెచ్చగొట్టేలా వ్యవహరించి పరుగెత్తొద్దు. అవి సమీపిస్తుంటే మౌనంగా వెళ్లిపోవాలి. ద్విచక్ర వాహనాలు వేగంగా నడిపితే కొన్ని సందర్భాల్లో వెంటపడతాయి. అనవసరంగా వాహనాల హారన్ మోగించొద్దు. ఆరోగ్యంగా ఉన్న కుక్కలు కరిస్తే రేబిస్ రాదు.. ఆ వ్యాధి ఉన్న కుక్కలతో జాగ్రత్తగా ఉండాలని పశు వైద్య నిపుణులు జానయ్యకు తెలిపారు.

# మిరప రైతులకు ఊరట!

ఖమ్మం విదేశాలకు భారీ ఎగుమతులు లేవు.. సీజన్ అంతకన్నా కాదు.. కొన్ని నెలలుగా స్తబ్దుగా ఉన్న మిరప ధరలు స్వల్పంగా పెరుగుతుండటంతో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఏసీ మిరప ధరల పరిస్థితి కొంత ఆశాజనకంగా ఉంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం క్వింటా గరిష్ఠ ధర రూ.14,150 పలకటం విశేషం. జిల్లాలోని ఖమ్మం, మధిర, వైరా, తల్లాడ పరిసర ప్రాంతాల్లో శీతల గిడ్డంగులు 49 ఉన్నాయి. వీటి నిల్వ సామర్థ్యం 51,35,500 బస్తాలు కాగా రైతులు, వ్యాపారులు 38,26,572 బస్తాలు నిల్వ చేశారు.

**స్వల్పంగా పెరుగుతున్న ధరలు**

కొద్దిరోజులుగా మిరప ధరలు స్వల్పంగా పెరుగుతున్నాయి. గత సీజన్‌లో సరైన ధర లేకపోవటం వల్ల చాలామంది రైతులు తమ పంట ఉత్పత్తులను శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉంచారు. అప్పటి నుంచి క్వింటా ధర రూ.13,000– 13,600 పలుకుతోంది. ఇబ్బందులు వచ్చినప్పటికీ రైతులు నష్టానికి సరకు అమ్మటం ఇష్టం లేక ఏసీల నుంచి బయటకు తీయలేదు. అత్యవసరమైనవారు మాత్రమే తక్కువ నిల్వలను అమ్ముకున్నారు.

**సాగు విస్తీర్ణం తగ్గటంతో..**

రైతులు నెల తరబడి సరకును విక్రయించకపోవటం, ఈసంవత్సరం మిరప సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గటంతో ప్రస్తుతం మిరప ధరలు ఆశాజనకంగా ఉన్నాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. క్వింటా ధర రూ. 15వేలకు చేరుతుందని అంచనా వేస్తున్నారు. చైనా, థాయ్‌లాండ్, బంగ్లాదేశ్‌కు ఎగుమతులు లేకపోయినా ధర పెరుగుతుండటం రైతులకు ఊరట కలిగించే విషయం. ఇప్పుడు ఇక్కడి సరకుకు దేశీయంగా కొంత డిమాండ్ ఏర్పడింది. ప్రధానంగా ఉత్తరప్రదేశ్, పశ్చిమబంగ, బిహార్ రాష్ట్రాలకు ఎక్కువగా రవాణా చేస్తున్నారు. 'భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లో మిరప నిల్వలు తరిగిపోయాయి. కుటుంబ అవసరాలకు గిరాకీ అధికమవుతోంది. అందుకే ధరల్లో కొంత పెరుగుదల కనిపిస్తోంది. విదేశాల నుంచి ఇప్పుడిప్పుడే ఆర్డర్లు వస్తున్నాయి. రానున్న రోజుల్లో ధరలు పెరిగే అవకాశముంది' అని ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణకుమార్‌కు తెలిపారు.

# ఆగుతూ.. సాగుతూ..!

మణుగూరు బీటీపీఎస్ రైలు మార్గం పనులు ఎప్పుడు పూర్తవుతాయో అంతుపట్టడం లేదు. మణుగూరు నుంచి బీటీపీఎస్ వరకు బొగ్గు రవాణా కోసం రైలు మార్గం పనులు నాలుగేళ్ల క్రితం ప్రారంభించారు. ఇప్పటివరకు 50 శాతం పనులూ పూర్తికాలేదు. రూ.300 కోట్లతో మొదలుపెట్టిన పనులు ఇంకా బండ్ వేయటం వరకు కూడా కాలేదు. అసలు పూర్తవుతాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బీటీపీఎస్‌కి మణుగూరు బొగ్గు గనుల నుంచి రోజుకు 15వేల టన్నుల బొగ్గు రవాణా అవుతోంది. ఇది పూర్తయితే రైలు ద్వారా బొగ్గు రవాణా కానుంది.

**స్థానికుల నుంచి వ్యతిరేకత..**

రైలు మార్గం ఏర్పాటులో స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. చెరువుముందు సింగారం మీదుగా ఏర్పాటు చేస్తుండటంతో అక్కడ 29 ఇళ్లను తీసుకోవాలని కోరుతున్నారు. ఓ వైపు సింగరేణి ఓబీ గుట్టలు, మరోవైపు రైలుమార్గం వెళ్లటాన్ని గాంధీనగర్ వాసులు వ్యతిరేకిస్తున్నారు. రామానుజవరంలో పనులు చేపట్టడాన్ని గ్రామస్థులు వ్యతిరేకిస్తుండటంతో ఆవరోధాలు ఏర్పడుతున్నాయి.

**కొలిక్కిరాని భూ సేకరణ**

మణుగూరు నుంచి బీటీపీఎస్ వరకు 16కి.మీ రైలుమార్గం వేస్తున్నారు. ఇందుకోసం మణుగూరు, సమితిసింగారం, రామానుజవరం గ్రామాల నుంచి ప్రభుత్వం ఆర్ఓఎఫ్ఆర్‌తో కలిపి 129 ఎకరాల మేర భూమిని సేకరించింది. ఆ భూమి విషయంపై కుటుంబీకుల మధ్య వివాదం, పరిహారం పెంచాలని కొంతమంది కోర్టు మెట్లు ఎక్కారు. 47 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇంకా 6 కి.మీ భూమిని సేకరించాలి. పరిహారం చెక్కులు తీసుకోనివారు మరో 200 మంది నిర్వాసితులు ఉన్నారు. ఈ నేపథ్యంలో రైలు మార్గం పూర్తి చేయటం జెన్కోకు సవాల్‌గా మారిందనే వాదనలు వ్యక్తమవుతున్నాయి.

రెవెన్యూ నుంచి భూమి ఇవ్వకపోవటంతో ఆలస్యం అవుతోంది. భూమి ఇవ్వగానే ఏడాదిన్నరలో రైలుమార్గం పనులు పూర్తి చేస్తాం. ఎప్పటికప్పుడు సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తున్నాం.
బిచ్చన్న, సీఈ

# ఆదిలోనే గుర్తిస్తే.. ఆటంకాలు తప్పినట్లే



ఆలేరు : విద్యార్థులు ఇతరులతో మెదిలే తీరు, అలవాట్లు, నడవడిక వారికి భవిష్యత్తులో ప్రభావం చూపుతుంది. విద్యాలయాల్లో ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు ఏరోజుకారోజు మార్గదర్శనం చేయాల్సిన బాధ్యత ఉంటుంది. ఇందుకు పాఠశాలలో నిర్వహించే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం (పీటీఎం) చక్కటి వేదికగా వినియోగించుకోవచ్చు. ప్రభుత్వ పాఠశాలలో ప్రతి నెలా మూడో శనివారం పీటీఎం నిర్వహించాలి. కొన్నిచోట్ల పీటీఎం సమావేశాలు అంతగా నిర్వహించక పోగా మరికొన్ని చోట్ల పీటీఎం సమావేశాలకు 30 శాతమైనా విద్యార్థుల తల్లిదండ్రులు హాజరుకావడం లేదు. బడిలో విద్యార్థుల ప్రవర్తన ఉపాధ్యాయులకు తెలుస్తుంది. ఇంట్లో పిల్లల నడవడిక తల్లిదండ్రులకు తెలుస్తుంది. ఒకరికొకరు తెలుసుకుని పరిష్కార మార్గం కనుగొనాల్సి ఉంటుంది.

**ఏం జరుగుతుందంటే...**

సామాజిక మాధ్యమాల ప్రభావంతో పిల్లలు, తల్లిదండ్రుల మధ్య అంతరం ఏర్పడుతోంది. తల్లిదండ్రులు నెలకోసారైనా పాఠశాలకు వెళ్లి తమ పిల్లల ప్రగతిని తెలుసుకోవడం లేదు.

కొందరు విద్యార్థులు తల్లిదండ్రులకు తెలియకుండా పాఠశాలకు దుమ్మా కొడుతున్నారు. తోటి విద్యార్థులు గేలిచేస్తున్నారనే ఆవేదనతో చదువులపై దృష్టి పెట్టడంలేదు. ఇళ్లలో పిల్లల ముందే కుటుంబ సభ్యులు గొడవలు పడుతున్నారు. ఇది వారిపై ప్రభావం చూపుతోంది.

కొందరు విద్యార్థులు చురుకుగా లేకపోయినప్పటికీ ఉపాధ్యాయులు కొందరు పట్టించుకోవడం లేదు.

**ఇరువురి పాత్రకీలకం**

పిల్లలు క్రమశిక్షణతో కూడిన ఎదుగుదలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకం. కుటుంబంలోని పెద్దలు పిల్లలకు రోజూ కొంత సమయం కేటాయించి వారి చెప్పింది విని అర్థం చేసుకోవాలి. ఉపాధ్యాయులు తోటి విద్యార్థులు ఎలా ఉంటున్నారనేది స్నేహ పూర్వకంగా ఆరాతీయాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల శ్రద్ధ పెడితే పిల్లలకు క్రమశిక్షణ అలవడుతుంది.
ఎర్ర లక్ష్మి, ఎంఈవో, ఆలేరు

# గుంత తీస్తేనే.. ఇంకేను..!



సూర్యాపేట : సూర్యాపేట విద్యానగర్ కాలనీ అధిక జనసాంద్రత ఉన్న ప్రాంతం. అంతటా సీసీరోడ్లు వేశారు. ఇళ్లలోనూ సీసీ పరిచారు. వర్షం, వాడకం నీరు నేలలో ఇంకే పరిస్థితి లేదు. దీంతో వేసవిలోనే కాదు.. వర్షాకాలంలోనూ భూగర్భ జలాలు పడిపోతూ నీటి ఎద్దడి తలెత్తుతోంది. కుళాయి నీరే దిక్కు.. ఇంకుడు గుంతలు నిర్మిస్తే ఈ పరిస్థితి ఉండేది

జిల్లాలోని పురపాలికల్లో ఇంకుడు గుంతల నిర్మాణం అటకెక్కింది. కొత్తగా ఇళ్లు నిర్మించుకొనేవారు కూడా అనుమతి తీసుకుంటున్నారు. కానీ నిర్మాణం చేపట్టడం లేదు. దీంతో చిన్నపాటి వర్షానికి రోడ్లన్నీ జలమయమవుతున్నాయి.

సూర్యాపేటలో అపార్ట్‌మెంట్లు, వీటిపై అవగాహన ఉన్నవారే మాత్రమే నిర్మించుకుంటున్నారు. వార్డుల్లో ప్రధాన చోట్ల వీటిని నిర్మించాల్సి ఉన్నా పుర అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. గతంలో నిర్మించినవి ప్రస్తుతం కనుమరుగయ్యాయి. వాటికి మరమ్మతు కూడా చేపట్టడం లేదు. దీంతో వర్షం నీరు ఇంకే పరిస్థితి లేకుండాపోతోంది.

**నేరేడుచర్లలో నామమాత్రం**

పురపాలికలో నిర్మాణం నామమాత్రంగానే ఉంది. ప్రభుత్వ కార్యాలయాలు, అపార్ట్‌మెంట్లలో మాత్రమే ఉన్నాయి. పట్టణంలో సీసీరోడ్ల నిర్మాణం పెరుగుతున్నందున భూగర్భ జలాలు పెరగాలంటే వీటి నిర్మాణం తప్పనిసరి. ఇంటి నిర్మాణ అనుమతుల సమయంలో ఏర్పాటు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారే తప్ప ఆ తర్వాత చర్యలు తీసుకోవడం లేదు. నేరేడుచర్ల గ్రామ పంచాయతీగా ఉన్నప్పటి గుంతలు తప్ప కొత్తగా లేవు.

**అవగాహన లేక**

తిరుమలగిరి పురపాలికలో ఇంటినిర్మాణాలకు దరఖాస్తు చేసుకునే వారికి అధికారులు ఇంకుడుగుంతల నిర్మాణాలతో కలిగే లాభాలు వివరించడం లేదు. దీంతో ప్రజలకు అవగాహన లేక వాటిపై ఆసక్తి చూపటం లేదు. చిన్నపాటి వర్షానికే రోడ్లపై వరదపారి కాలనీలోకి చేరుతున్నాయి.

**సంతకాలకే పరిమితం**

హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో ఇళ్ల నిర్మాణ సమయంలో చేపడతామని అనుమతి పత్రాలపై యజమానులు సంతకాలు చేస్తారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో అమలు కావడంలేదు. వ్యక్తిగతంగా ఇంటిని నిర్మించుకునే వారే కాకుండా ఇళ్లను నిర్మించి అమ్ముతున్న స్థిరాస్తి వ్యాపారులు కూడా పట్టించుకోవడం లేదు. దీంతో పురపాలికల్లో నిర్మాణం పడకేసింది.

**తప్పక నిర్మించుకోవాలి**

భూగర్భ జలాల పెంపునకు తప్పకుండా ఇంకుడు గుంత అవసరం. కొత్తగా ఇళ్లు కట్టేవారు నిర్మిస్తేనే అనుమతి జారీ చేస్తాం. ఇళ్లను తనిఖీ చేసి నిర్మించకుంటే శాఖపరమైన చర్యలు తీసుకుంటాం. పట్టణంలో పలుచోట్ల నిర్మించిన వాటిని పరిశీలించి మరమ్మతు చేపడతాం.
హనుమంతరెడ్డి, పుర కమిషనర్, సూర్యాపేట

# అనుగ్రహానికి కసరత్తు!



సూర్యాపేట: జిల్లాలో ఇళ్లులేని పేదల సొంతింటి కల నెరవేరబోతోంది. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం పూర్తై.. పంపిణీ జరగని రెండు పడకగదుల ఇళ్ల విషయంలో కదలిక మొదలైంది. వీటిని అర్హులైన పేదలకు కేటాయించాలని ప్రభుత్వం ఆలోచన చేసింది. పంద్రాగస్టు నాటికి లబ్ధిదారులకు గృహాలకు సంబంధించిన పత్రాలను అందజేసేందుకు ఏర్పాట్లు చేయాలంటూ ఇప్పటికే ఆదేశించింది. జిల్లాలో సుమారు 1369 పూర్తైన ఇళ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. వీటిని అర్హులకు అందజేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

**మరమ్మతులు అవసరం**5,424 ఇళ్లను మంజూరు చేయగా.. 3,086 గృహాలు పూర్తి చేశారు. వీటి పంపిణీ కొన్నిచోట్ల నాలుగేళ్లు, మరికొన్ని మండలాల్లో రెండేళ్లు దాటింది. ఆ ప్రక్రియ ఆలస్యం కావడంతో కొన్నిచోట్ల ఇళ్ల తలుపులు, కిటికీలు, విద్యుత్తు మీటర్లు దొంగలు ఎత్తుకెళ్లారు. మరికొన్ని చోట్ల స్థానికంగా ఉన్న పేదలు వాటిల్లోకి అనధికారికంగా చేరిపోయారు. కాగా వస్తువులు చోరీ గురైన, కిటికీల అద్దాలు ధ్వంసమైన ఇళ్లకు మరమ్మతులు చేసేందుకు గతంలో నిధులు మంజూరయ్యాయి. కానీ, చాలాచోట్ల మరమ్మతులు చేపట్టలేదు. పంపిణీ నాటికి మరమ్మతులు చేసేందుకు అవకాశాలున్నాయి. ఈ విషయంలో అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి మరి.!

**ఆక్రమణలకు ప్రయత్నాలు**నిర్మాణాలు పూర్తవుతున్న చోట పేదలు ఎక్కువ సంఖ్యలో ఉండి.. ఇళ్లు తక్కువగా ఉండటంతో లబ్ధిదారుల ఎంపిక విషయంలో సందిగ్ధం ఏర్పడింది. దీంతో ఆయా ప్రాంతాల్లో పంపిణీ ప్రక్రియ జరగలేదు. కొన్నిచోట్ల అప్పటి ప్రజాప్రతినిధులతో కలిసి అధికారులు లబ్ధిదారుల జాబితాలపై కసరత్తు చేశారు. కొన్ని పేర్లతో సిద్ధం చేశారు కూడా. వాటికి ఆమోద ముద్రవేయటంలో ఆలస్యం జరిగింది. ఇంతలో ఎన్నికల కోడ్ రావటం.. కొన్ని చోట్ల అప్పటి ప్రజాప్రతినిధులు ఓటమి చెందటంతో అప్పటి లబ్ధిదారుల జాబితాలను ప్రస్తుత అధికారులు ధ్రువీకరించటం లేదు. ఆయా ప్రాంతాల్లో కొత్తగా లబ్ధిదారుల ఎంపికల కోసం ప్రయత్నాలు జరుగుతుండటంతో గతంలో పేర్లు ఉన్నవారు ఇళ్లను ఆక్రమించుకొనేందుకు పలుమార్లు ప్రయత్నాలు చేయటం ఉద్రిక్తతలకు దారితీసింది. ఇలాంటి పరిణామాల నేపథ్యంలో వివాదాలకు తావులేకుండా ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. తాజాగా పంపిణీకి సిద్ధమవుతున్న క్రమంలో లబ్ధిదారుల ఎంపిక విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారనే విషయాలపై అధికారులు గోప్యతను పాటిస్తున్నారు.

# ప్రత్యామ్నాయం చూపరు.. పరిహారం ఇవ్వరు

సిరిసిల్ల: భవిష్యత్తు అవసరాలు.. అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఇంజినీరింగ్ అధికారులు ప్రణాళికలు చేయాలి. దాని తగినట్లు నిర్మాణాలు ఉండాలి. కానీ సిరిసిల్లలో కరకట్ట నిర్మించిన ఇంజినీరింగ్ అధికారుల పనితీరును చూస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే. ఈ నిర్మాణంతో 418 ఎకరాలు ముంపునకు గురవుతున్నాయి. ఇక్కడి భూములు ఏడేళ్లుగా పంటల సాగుకు నోచుకోవడంలేదు. కనీసం ముంపు తొలగించేలా ప్రత్యామ్నాయ చర్యలు లేవు. ఉన్న భూమినైనా సేకరించి పరిహారం ఇస్తారా అంటే అదీ లేదు. తాజాగా వ్యవసాయాధికారులు ఈ భూములను పరిశీలించి సాగుచేయడంలేదని రైతు భరోసాలో అనర్హులుగా తేల్చేశారు. ఇటు సాగుకు నోచుకోక.. భరోసా అందక ముంపు రైతుల వేదన వర్ణనాతీతం.

**శాశ్వత పరిష్కారం ఎప్పుడో?**

మధ్యమానేరు జలాశయాన్ని 27.55 టీఎంసీ సామర్థ్యంతో నిర్మించారు. దీని వెనక జలాలు మానేరువాగు సిరిసిల్ల పట్టణం వరకు నిలిచి ఉంటాయి. నీరు నిలిచి ఉండే ప్రాంతంలో పట్టణ శివారులో వాగు



పొడవునా కరకట్టను నిర్మించారు. పట్టణం ఎగువ నుంచి వచ్చే వరదనీరు దామెరకుంట, తుమ్మలకుంట నుంచి మానేరులోకి చేరాలి. కానీ ఇక్కడి కట్టిన కరకట్ట అడ్డుగా మారింది. దీనికితోడు జలాశయంలో 20 టీఎంసీల మేరకు నీరు చేరడంతో కరకట్ట పైన ఊటనీరు ఉబికి వస్తుంది. దీంతో వరదనీరు.. ఇటు ఊట నీరుతో సిరిసిల్ల శివారులోని 418 ఎకరాలు ఏడాది పొడవునా ముంపులో ఉంటాయి.

ఈ ముంపు ప్రభావం సిరిసిల్ల పట్టణంపైనా చూపుతోంది. ఎగువ వరదంతా సాఫీగా వెళ్లలేక పట్టణంలోని పలు కాలనీలు ముంపునకు గురవుతున్నాయి. దీనిని తప్పించేందుకు జలాశయం ఇంజినీరింగ్ అధికారులు 120 హెచ్‌పీల సామర్థ్యంతో మూడు మోటార్లతో ఎత్తిపోతలు ఏర్పాటు చేశారు. ఏడేళ్లలో రూ.10 కోట్లకు పైనే ఈ ఎత్తిపోతల కరెంటు బిల్లులకు వెచ్చించారు. ఈ తాత్కాలిక ఉపశమనానికే ఏటా రూ.కోట్లలో ఖర్చు చేస్తున్నారే తప్ప.. శాశ్వత ప్రణాళికలకు మాత్రం అడుగులు పడటంలేదు.

**ఏడేళ్లుగా సాగుకు నోచుకోని భూములు**


రెండు సీజన్లలో వరి సాగు చేసుకునే అయిదు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. పది గేదెలను పెంచుతుండేవాళ్లం. కరకట్ట నిర్మాణంతో వరదనీరు సాఫీగా వెళ్లలేని పరిస్థితి. ఏడేళ్లుగా పంటలు సాగు చేయలేని దుస్థితి. గేదెల పోషణ భారంగా మారింది. వ్యవసాయాన్ని నమ్ముకొని జీవించేవాళ్లం. ముంపుతో కుటుంబం మొత్తం వీధిన పడింది. ఎన్నిసార్లు అధికారులను కలిసినా ప్రయోజనం లేకుండా పోయింది.
– ఖాజా అఫ్జల్ మోహియొద్దీన్, సిరిసిల్ల పట్టణం

# ముర్రేడు బాధితుల గోడు పట్టదా?

కొత్తగూడెం: ముర్రేడు ముంపు బాధితుల కష్టాలు తీరటం లేదు. వర్షాకాలం వచ్చిందంటే చాలు.. ముర్రేడు పరీవాహక ప్రాంత ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికే నదీ తీరం వెంట పదుల సంఖ్యలో కట్టడాలు నేలమట్టమయ్యాయి. ఉన్నవాటినైనా కాపాడుకునేందుకు రక్షణ గోడ నిర్మించాలని స్థానికులు ఏళ్లుగా మొరపెట్టుకుంటున్నా.. ప్రభుత్వం నుంచి ఉలుకూ.. పలుకూ లేదు.

**ప్రజా సమస్యపై చిత్తశుద్ధేది..?**

ముర్రేడు రక్షణ గోడ నిర్మాణ అంశం ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నార్థకంలో పడేస్తోంది. భారాస హయాంలో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి స్థానిక నాయకులు ఆర్భాటంగా శంకుస్థాపన చేసినా.. ఆర్థికపరమైన అనుమతులు ఇవ్వకపోవటంతో పనులు ముందుకు సాగలేదు. కాంగ్రెస్ సర్కారు సైతం అదే బాటలో పయనించటంపై స్థానికులు ఆవేదన



వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**మంత్రుల దృష్టికి చేరినా.. స్పందన అంతంతే**

ముర్రేడు వరదల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంత్రుల దృష్టికి తీసుకెళ్లినా.. స్పందన అంతంతమాత్రంగానే ఉంది. ఏడాది క్రితం ముర్రేడు రక్షణ గోడ దస్త్రం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జలవనరులశాఖ ఈఎన్సీ వద్దకు చేరినా ఇప్పటివరకు వారి నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

**ప్రతిపాదనలకే పరిమితం**

ముర్రేడు పరీవాహకంలో కోతకు గురవుతున్న ప్రాంతాల రక్షణకు కొన్నేళ్లుగా కసరత్తు కొనసాగుతోంది. భారాస హయాంలో రూ.33.50కోట్లతో రక్షణ గోడ(గాబ్రియన్ వాల్) నిర్మించాలని అధికారులు ప్రతిపాదించారు. ఆర్థిక శాఖ నుంచి పరిపాలన అనుమతులు రాకపోవటంతో పనులు పట్టాలెక్కలేదు. అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం మారటంతో గతేడాది డిసెంబర్‌లో నీటిపారుదలశాఖ అధికారులు రూ.45కోట్లతో మరోసారి ప్రతిపాదనలు పంపించారు. గాబ్రియన్ వాల్ స్థానంలో తక్కువ ఖర్చుతో సాధారణ గోడ నిర్మించాలనే అంశాన్ని పరిశీలించారు. తదనంతరం ప్రభుత్వం, పాలకులు పట్టించుకోకపోవటంతో ముర్రేడు అంశం పక్కదారి పట్టింది. ఈ ఏడాది సైతం వరదల ముంపును ఎదుర్కోవాల్సి వస్తుండటంపై బాధితులు ఆవేదన చెందుతున్నారు. ముర్రేడు రిటైనింగ్ వాల్ నిర్మాణ ఆవశ్యకతను ఇటీవల కొత్తగూడెం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఖమ్మం, భద్రాద్రి జిల్లాల సమీక్ష సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారు. తక్షణమే పనులు చేపట్టేలా నిధులు మంజూరు చేయాలని కోరారు. ముర్రేడు రక్షణ గోడ నిర్మాణంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదు. ఇప్పటికే రూ.45కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. సర్కారు ఆర్థికపరమైన అనుమతులిస్తే.. టెండర్ ప్రక్రియ చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. రవికుమార్, డిప్యూటీ సీఈ,

## కాలువలు మారితేనే.. కన్నీళ్లు తొలగేది!

ఆత్మకూరు: సోమశిల జలాశయంలో నీటి నిల్వ 60 టీఎంసీలు దాటింది. మరోవైపు రెండో పంట సాగ్నీళ్లు మొదలవగా– మొదటి పంట సాగు ఆలోచనల్లో రైతులు నిమగ్నమయ్యారు. అదే సమయంలో కాలువల పరిధిలో దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్య లు వారిని వెన్నాడుతుండగా– భూసేకరణ, నిర్వహణ సమస్యలతో ఏటా తమకు ఇక్కట్లు తప్పడం లేదన్న ఆవేదన వ్యక్తమవుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించాలని కోరుతున్నారు.

**నాటి నిర్లక్ష్యంతో పై..**

గత ప్రభుత్వం భూసేకరణ, నిర్వహణ సమస్యలను పట్టించుకోలేదు. దాంతో అవి కాస్త జటిలమయ్యాయి. కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టినా.. పూర్తిగా పరిష్కారం కాలేదు. జలాశయం పరిధిలో అటవీ భూముల సేకరణకు సంబంధించి రూ. 315 కోట్లు చెల్లించాల్సి ఉంది. దీంతో పాటు ప్రత్యామ్నాయంగా భూములు కేటాయించాల్సి ఉంది. ఈ రెండూ ముందుకు కదలడం లేదు. ప్రభుత్వ భూములపై పరిశీలన జరిపినా.. అటవీశాఖకు అప్పగించలేదు.

**అసంపూర్తిగా ఎన్నో..**



అటవీ సమస్యలతో పలు ఉప కాలువల నిర్మాణం అసంపూర్తిగానే ఉంది. చీలు కాలువలు నామమాత్రంగా ఉండటంతో సాగు జలాలు రైతులకు అందడం లేదు. ఉత్తర కాలువ పరిధిలో 42ఆర్ ఉప కాలువ భూసేకరణ సమస్యతో దశాబ్దాలుగా నిరుపయోగంగానే ఉండగా.. 45ఆర్ పరిధిలోని శ్రీ కొలను కాలువ అసంపూర్తిగానే ఉంది. చెరువులకు నీరందించే చీలు కాలువలు భూ సేకరణ సమస్యలతో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. శ్రీకొలను చెరువుకు హసనాపురం అలుగుల నుంచి వదలాల్సి రావడం పరిస్థితికి అద్దం పడుతోంది.

**పూర్తి చేస్తేనే ప్రయోజనం**

శ్రీకొలను కాలువ అసంపూర్తిగా ఉండటంతో సాగునీరు ముందుకు సాగడం లేదు. చీలు కాలువలు పూర్తయితే ఉత్తర కాలువ నీరు పెరమన, జంగాలదొరువు, మదారాబాద్, నీలాయపాళెం పొలాలకు అందుతుంది. రైతులు బాగుపడతారు.తుమ్మల వెంకట పాండురంగారావు

**అడ్డంకులు తొలగిస్తాం**

మొదటి పంట సీజన్‌లో సాగునీటికి అడ్డంకులు లేకుండా ఓ అండ్ ఎం పనులు చేపడతాం. అసంపూర్తి కాలువల విషయాన్ని పరిశీలిస్తున్నాం. తగు చర్యలతో రైతులకు సజావుగా సాగునీరందేలా చేస్తాం. బి.వెంకటరమణారెడ్డి, ఎస్‌ఈ సోమశిల ప్రాజెక్టు

## రాయవరం.. అక్రమార్కుల పరం!

మార్కాపురం : మార్కాపురం మండలం రాయవరం చెరువును అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా యంత్రాలతో యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. దీంతో చెరువు తన స్వరూపాం కోల్పోయింది. గతంలో ఈ చెరువును ఉపాధి హామీ పథకం కింద రూ.లక్షలు వెచ్చించి అభివృద్ధి చేశారు. ప్రస్తుతం అక్రమార్కులు యంత్రాలతో తవ్వేస్తూ



గుల్లచేస్తున్నారు. ఇక్కడ తవ్విన మట్టిని వెంచర్లకు తరలిస్తూ జేబులు నింపుకొంటున్నారు. చెరువులో గుంతలు తీయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో రాకేష్ అనే యువకుడు ఇక్కడ తీసిన గుంతలో పడి మృతిచెందాడు. మట్టి అక్రమ రవాణాపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## అందరికీ నీడ.. పునరావాస మేడ

జంగారెడ్డిగూడెం : పోలవరం పునరావాస కాలనీలు పూర్తి చేసేందుకు కసరత్తు మొదలైంది. వైకాపా ప్రభుత్వం తన పాలనలో పునరావాస కాలనీల నిర్మాణాన్ని గాలికి వదిలేసింది. పూర్తి చేసిన పనులకు కూడా గుత్తేదారులకు బిల్లులు ఇవ్వలేదు. దీంతో గుత్తేదారులు సుమారు నాలుగేళ్ల కిందట పనులు ఆపేశారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేందుకు తొలి ప్రాధాన్యం ఇస్తున్న కూటమి ప్రభుత్వం నిర్వాసితుల పునరావాసంపై దృష్టి సారించింది. ఇప్పటికే నిర్వాసితులకు పునరావాస పరిహారం విడుదల చేసింది.

గతంలో ఆగిపోయిన దగ్గర నుంచి కాలనీలు, మౌలిక వసతులు, సామాజిక భవనాలు నిర్మించేందుకు కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో గతంలో చేసిన నిర్మాణాలకు పెండింగ్ బిల్లులను గుత్తేదారులకు చెల్లించింది. మిగిలిన పనులు పూర్తి చేసేందుకు తాజా అంచనాలు వేసి సుమారు రూ. 365 కోట్లతో టెండర్లు పిలిచారు. ఏలూరు జిల్లా పరిధిలోని పనులకు సంబంధించి సెప్టెంబరు 8న టెండర్లు తెరిచే అవకాశాలు ఉన్నాయి. జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి పంచాయతీ పరిధిలోని చల్లావారిగూడెంలో 1,505 ఇళ్లు, లేఅవుట్ పరిధిలో మౌలిక వసతులకు సంబంధించిన పనులకు రూ. 203 కోట్లకు ఈ నెల 23న టెండర్లు పిలిచారు. వంకావారిగూడెంలో ఎర్రవరం లేఅవుట్ మౌలిక వసతులకు రూ. 6.93 కోట్లు, జీలుగుమిల్లి మండలం స్వర్ణవారిగూడెం, బుట్టాయగూడెంలో సరుగుడు లేఅవుట్ పనులకు రూ. 3.14కోట్లు ఇచ్చారు. బుట్టాయగూడెంలోని 624 ఇళ్లు, కాలనీల్లో వసతులకు సంబంధించి రూ. 68.53 కోట్లు, జీలుగుమిల్లి మండలం దర్భగూడెంలో 358 గృహాలకు సంబంధించి రూ. 51.39 కోట్లు, బుట్టాయగూడెం మండలం దొరమామిడి లేఅవుట్లో 305 ఇళ్లకు సంబంధించి రూ. 30.88 కోట్లకు టెండర్లు పిలిచారు. రాచన్నగూడెంలోని శివగిరి లేఅవుట్లో అసంపూర్తిగా ఉన్న మౌలిక వసతుల కోసం రూ. 1.93 కోట్లు చొప్పున టెండర్లు దాఖలయ్యాయి. సిద్ధంగా ఉన్నాం.. టెండర్లు ఖరారైతే పనులు చేపట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామని గృహ నిర్మాణ సంస్థ ఈఈ కేవీవీఎస్ ప్రసాద్ పేర్కొన్నారు.

# ఖ'నిజం' నిగ్గుతేల్చేదెవరు?



కనిగిరి : జిల్లాలోని కనిగిరి మండలం బాలవెంకటాపురం, అడ్డరోడ్డు, పీసీపల్లి మండలం మురిగిమ్మి, లక్ష్మక్కపల్లి, గుంటుపల్లి, పామూరు మండలం నాశికాత్రయంబకం, మార్కొండాపురం తదితర ప్రాంతాల్లో తెల్లరాయి నిక్షేపాలున్నాయి. దీనికి అంతర్జాతీయ మార్కెట్లో మంచి గిరాకీ ఉండడంతో అక్రమార్కుల కన్ను పడింది. అక్రమంగా తవ్వి తరలించుకుపోతూ రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు.

**విశాఖ, చెన్నై పోర్టుల నుంచి ఎగుమతి..:** తెల్లరాయి (వైట్ క్వార్ట్జ్) అధికంగా గాజు సంబంధిత పరికరాల తయారీలో వినియోగిస్తుంటారు. గ్రేడ్లుగా విడదీసి విక్రయిస్తే మరింత ఆదాయం వస్తోంది. మొదటి శ్రేణి రాయి టన్ను ధర రూ. 5 వేల రూ. 7 వేల వరకు, ద్వితీయశ్రేణి రాయి రూ. 5 వేలు, తృతీయ శ్రేణి రాయి రూ. 3 వేలు వరకు బహిరంగ మార్కెట్లో పలుకుతోంది. మూడు మండలాల్లో నిక్షేపాలున్నాయన్న విషయాన్ని గుర్తించిన తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలకు చెందిన కొందరు స్థానిక చోటామోటా నాయకుల సహకారంతో ప్రభుత్వ, అటవీ భూముల్లో పగలు తవ్వకాలు జరుపుతూ రాత్రి వేళల్లో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇక్కడ నుంచి చెన్నై, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు తరలించి సముద్ర మార్గాన జపాన్, సింగపూర్, మలేషియా, చైనా తదితర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. రాత్రి ఒక్కో లారీలో 30 నుంచి 50 టన్నుల వరకు తరలిస్తూ అక్కడ టన్ను రూ. 20 వేలకు పైగా విక్రయిస్తూ ప్రభుత్వ ఖజానాన్ని దోచుకుంటున్నారు.

**లీజుకు తీసుకున్న వాటితోపాటు..**

జిల్లాలో అత్యధికంగా తెల్లరాయి భూములున్న ప్రాంతం పశ్చిమ ప్రకాశం. కనిగిరి నియోజకవర్గం మొదటి స్థానంలో ఉంది. ఉమ్మడి జిల్లాలో 150 వరకు క్వారీలుంటే వీటిలో అధిక భాగం పశ్చిమ ప్రకాశంలోనే ఉన్నాయి. లీజుకు కొన్నిచోట్లే అనుమతి ఉంది. లీజుకు తీసుకున్న ప్రదేశాలతో పాటు పక్కనే ఉన్న రెట్టింపు చోట్ల ప్రభుత్వ, అటవీ ప్రాంతాల్లో అక్రమంగా తవ్వుతున్నారు. అక్రమ వ్యాపారానికి, రెవెన్యూ పోలీసు, గనులశాఖలు వంత పాడుతున్నట్లు విమర్శలొస్తున్నాయి. వీరి అక్రమ వ్యాపారంలో చోటామోటా నాయకులు భాగస్వాములుగా ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీటిని లీజుకు ఇస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకుని ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూరేవిధంగా చర్యలు తీసుకోవాలి. ఈ విషయమై గనులశాఖ ఏడీ విష్ణువర్ధనరావు మాట్లాడుతూ అక్రమ తవ్వకాలకు పాల్పడేవారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## భూ అక్రమాలు తేలినా.. మీనమేషాలు తగునా?



నెల్లూరు : గత వైకాపా ప్రభుత్వ హయాంలో అధికారమే అండగా ఫ్రీహోల్డ్ భూముల్లో జరిగిన అక్రమాల్లో వేలాది ఎకరాలు వెలుగులోకి వచ్చాయి. నిషిద్ధ జాబితా నుంచి తప్పించి పేదల భూములు కాజేసేందుకు జిల్లాలోని పది మండలాల్లో నిబంధనలకు విరుద్ధంగా మొత్తం 666 రిజిస్ట్రేషన్లు జరిగినట్లు నిర్ధారించారు. జిల్లాలోని కనిగిరి, మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాల పరిధిలోని మండలాల్లో ఈ తరహా భూ అక్రమాలు ఎక్కువగా జరిగాయి. వీఆర్వో నుంచి కలెక్టరేట్ వరకు అప్పటి ప్రజాప్రతినిధుల సిఫార్సులతో వేలాది ఎకరాలు ఫ్రీహోల్డ్ జాబితాలో చేర్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఫ్రీహోల్డ్ భూముల అక్రమాలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. సీసీఎల్ఏ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక బృందాల ద్వారా గతేడాది చేపట్టిన సర్వేలో సుమారు 20 వేల ఎకరాలు నిబంధనలకు విరుద్ధంగా జాబితాలో చేర్చినట్లు గుర్తించారు. దాని ఆధారంగా పలు మండలాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వీటిపై విచారణకు ఆదేశించిన సీసీఎల్ఏ మొదట్లోనే రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని ఉత్తర్వులు జారీ చేయడంతో అక్రమాలకు కొంత మేర అడ్డుకట్ట పడింది.

**10 మండలాల్లో ఇదీ పరిస్థితి**

జిల్లావ్యాప్తంగా 22ఏ, అసైన్డ్ ల్యాండ్ ఫ్రీహోల్డ్, చుక్కల భూములు, షరతుల గల పట్టాకు సంబంధించి మొత్తం 1,75,722.73 ఎకరాల క్రయవిక్రయాలకు హక్కులు కల్పించారు. అందులో అసైన్డ్, ఇతర ఫ్రీహోల్డ్ భూములు 1,36,783.60 ఎకరాలున్నాయి. అందులో సుమారు 2 వేల మంది రైతుల క్రయవిక్రయాలకు సంబంధించి 3,638 రిజిస్ట్రేషన్లు జరిగాయి. పలు మండలాల్లో ఫ్రీహోల్డ్‌కు అర్హత లేని భూములకు కూడా ఆ జాబితాలో చోటు కల్పించారు. ప్రధానంగా పెదదోర్నాల మండలంలో 341.06 ఎకరాలకు రిజిస్ట్రేషన్ చేయగాబీ అందులో 200.94 ఎకరాలు నిబంధనలకు విరుద్ధంగా జరిగినట్లు తేలినా బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు జిల్లా అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తోంది. కనిగిరి, సీఎస్‌పురం మండలాల్లోనూ ఫిర్యాదులందాయి. దస్త్రాల పరిశీలన చేపట్టి ఏడాది కావస్తున్నా ఇంతవరకు బాధ్యులపై చర్యల్లేవు.

**వైకాపా నేతల కనుసన్నల్లోనే :** అసైన్డ్ భూములను క్రయవిక్రయాలు చేయడం నిషేధం. అనుభవంలో ఉన్నవారు తదనంతరం వారసులకు స్వాధీనం చేయాలి. ఒకవేళ అమ్ముకోవాలంటే కలెక్టర్ నుంచి నిరంభ్యతర పత్రం (ఎన్‌వోసీ) పొందాల్సి ఉంటుంది. 1954కు ముందు అసైన్డ్ చేసిన భూములకు మాత్రమే ఎన్‌వోసీ ఇవ్వాలనే నిబంధన ఉంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో గతేడాది నిబంధన సవరించారు. 2003కు ముందు అసైన్డ్ భూములపై అనుభవ దారులకు హక్కులు కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులున్న పేదలకు ఉపశమనం కలిగించినా వాటి వెనుక వైకాపా నాయకులు చక్రం తిప్పారు. దీంతో రహదారుల వెంబడితోపాటు బహిరంగ మార్కెట్‌లో విలువ గల అసైన్డ్ భూములపై వైకాపా నాయకులు కన్ను పడింది. మీ వద్ద డీకేటీ పట్టా (అసైన్డ్ భూములు)కు హక్కులు కల్పించడంతో పాటు తద్వారా అమ్ముకునే అవకాశం ఇవ్వనున్నట్లు అక్రమాలకు తెర లేపారు. దీనిపై డీఆర్వో ఓబులేసు మాట్లాడుతూ అక్రమాలపై చర్యల నిమిత్తం సీసీఎల్ఏకు నివేదించినట్లు తెలిపారు.

# నాలుగో సింహం కన్నెర్ర

నెల్లూరు : రౌడీయిజం చేసిన చరిత్ర ఉందా? కత్తి పట్టుకున్న నేర ప్రవృత్తి ఉందా? గతంలో రౌడీషీట్ ఉందా? ఇలాంటి వారంతా కాస్త ఆలోచించాల్సిందే.. ఏ మాత్రం తోక జాడించినా ఊచలు లెక్కించాల్సిందే.. అవును నగరంలో పోలీసుశాఖ జూలు విధుల్చుతోంది. ఇటీవల జిల్లాలో చోటు చేసుకున్న పరిణామాలు.. జిల్లా ఎస్పీ మొదలు ఐజీ, రాష్ట్ర డీజీపీ వరకు నగరంలోని రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి సారించడం.. ఉన్నతాధికారుల ఆదేశాలతో తమ ప్రతాపం చూపుతోంది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని.. ఆచితూచి వ్యవహరిస్తూ.. స్టేషన్ల వారీగా రౌడీషీటర్లను ఏరివేస్తోంది. ఇటీవల కాలంలో 50 మందికిపైనే రౌడీషీటర్లను కటకటాల వెనక్కు పంపారు.

**అందరికీ.. రాజకీయ అండదండలు ..** కరుడుగట్టిన నేరస్థుడు శ్రీకాంత్ వ్యవహారంతో ఉలిక్కిపడిన పోలీసుశాఖ.. అతడి అనుచరులు, షీటర్లను అదుపులోకి తీసుకునే పనిలో పడ్డారు. నగరంలోని ఆరు పోలీసు స్టేషన్ల పరిధిలో ఈ ప్రక్రియ సాగుతుండగా.. ఆ వెంటనే రాజకీయ నాయకుల నుంచి ఫోన్లు వస్తున్నట్లు సమాచారం. ప్రతి షీటర్‌కు రాజకీయ నేపథ్యం, ప్రజాప్రతినిధుల అండదండలు ఉన్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ పోలీసులు గతానికి భిన్నంగా 'సారీ సార్' అంటూ తమ పని కానిచ్చేస్తున్నారు. స్టేషన్లకు పదేసి చొప్పున అదుపులోకి తీసుకుని.. వారిపై గంజాయి కేసులు నమోదు చేసి జైలుకు పంపుతున్నారు. గతంలో నేరాలకు పాల్పడి జైలు జీవితం అనుభవించి బయట తిరుగుతున్న వారినీ వదలడం లేదు.



**చర్యలు తప్పవు**

సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఊరుకునేది లేదు. రౌడీ షీటర్లపై చర్యలు తీసుకుంటున్నాం. ఈ ప్రక్రియ నిర్విరామంగా ఉంటుంది. నగరంలో ప్రశాంతత నెలకొల్పడమే మా ప్రధాన లక్ష్యం.జి.కృష్ణకాంత్, ఎస్పీ

## రాష్ట్ర పండగ.. పనుల్లో వేగం లేదుగా!

పుట్టపర్తి : ప్రసిద్ధ ఆధ్యాత్మిక కేంద్రంగా పేరొందిన పుట్టపర్తిలో శ్రీసత్యసాయి శతజయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని కూటమి ప్రభుత్వం, ట్రస్టు వర్గాలు నిర్ణయించాయి. దేశ, విదేశాల నుంచి భక్తులు, ప్రముఖులు తరలివస్తారని అంచనా వేశారు. ఆ స్థాయిలో ఏర్పాట్లు చేయాల్సి ఉంది. గడువు ముంచుకొస్తున్నా.. పనులు సాగడం లేదు. ఉత్సవాలను నవంబరులో ప్రారంభించనున్నారు. అదే నెల 23న రాష్ట్ర పండగలా నిర్వహించాలని ప్రభుత్వం ప్రకటించింది. పర్యాటకశాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ ఇప్పటికే పుట్టపర్తికి వచ్చి జిల్లా ఉన్నతాధికారులు, ట్రస్టు వర్గాలు, ప్రజాప్రతినిధులతో సమీక్షించారు. వేడుకల నిర్వహణ కోసం రాష్ట్ర సర్కారు పర్యాటక శాఖ డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్‌ను నోడల్ అధికారిగా నియమించింది.

**రూ. 29 కోట్లతో ప్రతిపాదనలు**

పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులు సీఎం చంద్రబాబును కలిసి వేడుకలకు నిధులు కేటాయించాలని కోరారు. జిల్లా అధికారులు రూ. 29 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు.

**ఎక్కడి సమస్యలు అక్కడే..**

పుట్టపర్తి పరిసరాల్లో భూగర్భ మురుగు పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ధర్మవరం నుంచి పుట్టపర్తికి వచ్చే రోడ్డు అధ్వానంగా ఉంది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో సీసీ రహదారులతోపాటు తాగునీరు, వసతి, మరుగుదొడ్లు తదితరాలకు సంబంధించి ఇప్పటి నుంచే పనులు



చేస్తేనే ఉత్సవాల నాటికి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి.

**ఇప్పటివరకు ఏమి చేశారంటే..**జాయ్ అలుక్కాస్ సీఎస్ఆర్ కింద రూ. 1.25 కోట్లు ఇచ్చింది. ఈ నిధులతో చిత్రావతి నది ఒడ్డున సుందరీకరణ పనులు చేపట్టారు. రూ. 20 లక్షల పుడా నిధులతో చిత్రావతి వద్ద స్నానఘట్టాలు నిర్మించా రు. 'మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రూ. 2.5 కోట్ల పనులకు టెండర్లు పిలిచాం. రూ. 4 కోట్ల పనులకు ప్రతిపాదనలు చేశాం. టెండర్లు ఖరారు చేసి పనులు చేపట్టనున్నట్లు' కమిషనర్ క్రాంతికుమార్ తెలిపారు.

**నిధులు వచ్చిన వెంటనే పనులు**– నరసింహమూర్తి, ప్రజారోగ్య విభాగం డీఈ, పుట్టపర్తిరహదారుల అభివృద్ధి, భూగర్భ మురుగు వ్యవస్థ మెరుగు పరచడం, లైటింగ్ వ్యవస్థ, కంట్రోల్ రూమ్, స్నానపు గదుల నిర్మాణం చేపట్టనున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే పనులు వేగవంతం చేస్తాం.

## వేగ నిరోధకం.. ప్రాణసంకటం

అనంతపురం: జాతీయ రహదారులపై ఏర్పాటు చేసిన వేగ నిరోధకాలు (స్పీడ్ బ్రేకర్లు) ప్రమాద కారకాలుగా మారుతున్నాయి. వాటిని అశాస్త్రీయంగా నిర్మించడంతో వాహనదారులు గాయాల పాలవుతున్నా రు. దూరం నుంచే గుర్తించేలా రేడియం స్టిక్కర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉన్నా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పలు కూడళ్లలో రాత్రివేళల్లో సరైన లైటింగ్ లేకపోవడంతో వాహనాలు హఠాత్తుగా వేగాన్ని తగ్గించే క్రమంలో వెనుక వచ్చే వాహనాలు అదుపుతప్పి ఒకదానికొకటి ఢీకొంటున్నాయి.

**ప్రమాణాలకు విరుద్ధంగా..**

వాస్తవానికి జాతీయ రహదారులపై వేగ నిరోధకాలు ఏర్పాటు చేయకూడదని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయి. యాక్సిడెంట్ జోన్, రెండు జాతీయ రహదారులు కలిసే చోట, మున్సిపాలిటీల పరిధిలో నిర్దేశిత ప్రమాణాల మేరకు మాత్రమే ఏర్పాటు చేయాలి. ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ నిబంధనల మేరకు వేగ నిరోధకం ఎత్తు 10 సెం.మీ.మాత్రమే ఉండాలి. 3.7 మీటర్ల వెడల్పుతో బంప్ 17 మీటర్ల వ్యాసార్థం ఉండాలి. వేగ నిరోధకానికి 40 మీటర్ల ముందే సూచిక బోర్డుతో పాటు తెలుపు, పసుపు రంగుల్లో బ్యాండ్స్ ఏర్పాటు చేయాలి. రాత్రి సమయా ల్లో స్పష్టంగా కనిపించేలా రేడియం స్టిక్కర్‌లతో పాటు సరైన లైటింగ్ వ్యవస్థ ఉండాలి.

**ఎక్కడెక్కడ అంటే..**

హైదరాబాద్–బెంగళూరు జాతీయ రహదారి (ఎన్‌హెచ్44)పై పామిడి, గార్లదిన్నె, కల్లూరు, తపోవనం, ప్రసన్నాయపల్లి క్రాస్, రాప్తాడు,



సోమందేపల్లి, పాలసముద్రం.చెన్నై జాతీయ రహదారిపై ఆకుతోటపల్లి, సంజీవపురం, కుటాగుళ్ల, కదిరిలోని జీవిమాను కూడలి, నల్లచెరువు. అనంతపురం–బళ్లారి మార్గంలో సిండికేట్‌నగర్, కొడిమి, రాచానపల్లి ప్రాంతాల్లో వేగ నిరోధకాలు ఏర్పాటు చేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. **తొలగించాలని చెప్పాం– జగదీశ్, ఎస్పీ, అనంతపురం**జాతీయ రహదారుల్లో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లను తొలగించాలని హైవే అథారిటీ అధికారులకు చెప్పాం. కూడళ్ల వద్ద రేడియం స్టిక్కర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో సూచించాం. త్వరలోనే సమస్య పరిష్కారమయ్యేలా చూస్తాం.

## నిరాశాజనకంగా ఖరీఫ్..!

చిత్తూరు : నైరుతి రుతుపవనాల మందగమనంతో ఖరీఫ్ సీజన్ పంటల సాగు 26 శాతానికి మించలేదు. అదునుకు వర్షాలు కురవకపోవడంతో వేరుసెనగ సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. జూన్, జులైలో లోటు వర్షపాతం నమోదుతో వరినాట్లు పడకపోగా.. ఇతర పంటల సాగుకు అన్నదాత ఆసక్తి చూపలేదు.జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 71,305 హెక్టార్లకు 18,521 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. వేరుసెనగ సాధారణ సాగు 35,238 హెక్టార్లు కాగా, 3,652 హెక్టార్ల(10%)కే పరిమితమైంది. వేరుసెనగకు ప్రత్యామ్నాయంగా రైతులకు వ్యవసాయ శాఖ త్వరలో ఉలవ విత్తనాలు అందజేయనుంది.

**ఆగస్టులో అధిక వర్షం**

ఆగస్టు నెల ఖరీఫ్ సీజన్‌ను ఆదుకుంది. ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 121.2 మి.మీటర్లు కాగా.. 386 మి.మీ. వర్షపాతం నమోదైంది. 28 మండలాల్లో అధికవర్షం కురవగా.. మూడు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా.. ఒక మండలంలోనే లోటు వర్షపాతం నమోదైంది. విస్తారంగా వర్షాలు కురవడంతో.. ఆలస్యంగానైనా వరి, ఇతర పంటల సాగుకు కర్షకులు సమాయత్తమవుతున్నారు. రాబోయే రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటనలతో వరి సాగు పట్ల అన్నదాత ఆసక్తి కనబరుస్తున్నారు. సాధారణ సాగుకు మించి వరి విస్తరించే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

# తడిసినా వదలరా?

కళ్యాణదుర్గం : పెన్నా పరివాహక ప్రాంతాల్లోని సరిహద్దు గ్రామాల నుంచి ఇసుక అక్రమంగా తరలిపోతోంది. వర్షాలు పడుతున్నా ఇసుక తవ్వకం మాత్రం ఆగకపోవడం గమనార్హం. అక్రమార్కులు నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకొంటున్నారు. కళ్యాణదుర్గం, కాలువపల్లి, కంబదూరు ప్రాంతాల్లో ఇసుకదోపిడీ నిత్యకృత్యంగా మారింది. స్థానిక రైతులు అడ్డుకుంటే వారిని బెదిరింపులకు పాల్పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో దాడులకు దిగుతున్నట్లు పలువురు వాపోతున్నారు.

**ఎక్కడికక్కడే తవ్వకాలు...**

ఇసుక తవ్వకంతో నదిలో పలుచోట్ల భారీ గుంతలు ఏర్పడ్డాయి. నది ఒడ్డున కొన్ని ప్రాంతాల్లో నిల్వ వేసి వీలు చిక్కినప్పుడల్లా ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. దీంతో నది అంచులు కోతకు గురవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బోరుబావుల్లో నీటిమట్టం అడుగంటుతోందని వాపోతున్నారు.

**నిత్యం అనంతకు..** ఇసుకాసురులు ఒక ట్రాక్టర్‌ను రూ.4,500 నుంచి రూ.6,000 చొప్పున అనంతపురానికి తరలించి విక్రయిస్తున్నారు. నిత్యం సుమారు 150 ట్రాక్టర్లకు పైగానే ఇసుక అక్రమంగా రవాణా



చేస్తున్నారు. తద్వారా రూ.లక్షల్లో జేబులు నింపుకొంటుండగా.. ప్రభుత్వానికి ఎలాంటి రాయల్టీ చెల్లించకపోవడంతో నష్టం వాటిల్లుతోంది. రెవెన్యూ, పోలీసు, భూగర్భ గనుల శాఖ అధికారులు పెన్నా పరివాహక ప్రాంతం నుంచి ఇసుక తరలిపోకుండా అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**కఠినచర్యలు తీసుకుంటాం–** వసంత్‌బాబు ఆర్డీవో

పెన్నా నది నుంచి ఇసుక తరలింపునకు ఎలాంటి అనుమతులు లేవు. అక్రమంగా ట్రాక్టర్లల్లో ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రత్యేక నిఘా పెట్టి వాహనాలను స్వాధీనం చేసుకుంటాం. అక్రమార్కులపై కేసులు నమోదు చేసి కఠిన శిక్ష పడేలా చేస్తాం.

# నాణ్యతపై 'తారు'మబ్బులు

డోన్ : ఉమ్మడి కర్నూలు జిల్లా మీదుగా వెళ్లే 44వ నంబరు జాతీయ రహదారి నిర్వహణ అధ్వానంగా మారింది. అక్కడక్కడా దెబ్బతిని గుంతలు పడటంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ మార్గంలో ప్రతిరోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. ప్రతి నెలా రూ.కోట్లలో ఆదాయం సమకూరుతున్నా మరమ్మతులపై దృష్టి సారించడం లేదు. కర్నూలు నుంచి ప్యాపిలి వరకు 75 కి.మీ. పొడవునా ఉన్న జాతీయ రహదారి గుంతలమయంగా మారింది. నేషనల్ హైవే కావడంతో వాహనదారులు వేగంగా వెళుతుంటారు. గుంతలు కనపడకపోవడం.. దగ్గరికి వచ్చేసరికి ప్రమాదాన్ని గుర్తించి ఒక్కసారిగా బ్రేకులు వేస్తున్నారు. దీంతో వెనుక వచ్చే వాహనాలతో ముప్పు ఏర్పడుతోంది. డోన్ నుంచి కర్నూలుకు వెళ్లాలంటే గంట ప్రయాణం. రోడ్డుపై గుంతలు ఉండటంతో సుమారు 2 గంటలు పడుతోందని వాహనదారులు పేర్కొంటున్నారు.

**ఆదాయం సమకూరుతున్నా..**

ప్రతిరోజూ ఎన్‌హెచ్ 44 మీదుగా 20 వేలకుపైగా వాహనాలు తిరుగుతుంటాయి. ఒక్క అమకతాడు టోల్‌ప్లాజా పరిధిలో నిత్యం రూ.5 లక్షలకుపైగా టోల్ వసూలవుతుంది. ఈ ఒక్క టోల్‌ప్లాజా నుంచే నెలకు రూ.1.50 కోటి వరకు ఆదాయం సమకూరుతుంది. అయినప్పటికీ రహదారి నిర్వహణను గాలికొదిలేశారన్న విమర్శలున్నాయి. రహదారిపై అక్కడక్కడా వీధి దీపాలు లేకపోవడం.. గుంతలు ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

**పైపై మరమ్మతులు** గతంలో జాతీయ రహదారిపై గుంతలు పడటంతో గుత్తేదారులు అక్కడక్కడా ప్యాచ్‌వర్క్ పనులు చేశారు. గత కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు ప్యాచ్‌వర్క్ వేసిన చోటే తారు లేచిపోయి తిరిగి గుంతలు పడటం గమనార్హం. ఈ నేపథ్యంలో జాతీయ రహదారి నిర్వహణ అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఉంది.

**ఎక్కడెక్కడ ఎలా ఉందంటే..**

డోన్ పరిధిలో దొరపల్లి వంతెన, ఉడుములపాడు వంతెన, ఓబులాపురం మిట్ట, దేవరబండ స్టేజీ, జగదుర్తి స్టేజీ వద్ద గుంతలు పడ్డాయి. వెల్దుర్తి మండల పరిధిలోని మదార్‌పురం, బొమ్మిరెడ్డిపల్లి, మల్లెపల్లి వద్ద రహదారి అధ్వానంగా ఉంది. కల్లూరు మండలంలోని ఉలిందకొండ, చిన్నటేకూరు, పెద్దటేకూరు, దూపాడు, వెంగన్నబావి నుంచి కర్నూలు వెళ్లే వరకు రహదారి పలు ప్రాంతాల్లో దెబ్బతింది.

# ఆక్రమణల చెరలో చెరువులు

రావికమతం : వందలాది ఎకరాల సాగుకు ఆయువుపట్టుగా ఉన్న చెరువులు ఆక్రమణలతో ఉనికిని కోల్పోతున్నాయి. ఏటికేడు చెరువు గర్భాల విస్తీర్ణం తగ్గిపోతోంది. దీంతో నీటినిల్వ సామర్థ్యం తగ్గిపోయి అన్నదాతలకు అష్టకష్టాలు తప్పట్లేదు. రావికమతం మండలం పిల్లవాని పాలెంలోని సర్వే నం. 261–1లోని చినప్పన్న చెరువు గర్భం విస్తీర్ణం 6.07 ఎకరాలు. దీని కింద సుమారు 650 ఎకరాల వరకు ఆయకట్టు రైతులు లబ్ధి పొందుతున్నారు. ప్రస్తుతం ఈ చెరువు చిక్కిసగమైంది. చెరువు గర్భంలో వరి, చెరకు సహా ఇతర పంటలు సాగు చేస్తున్నారు. దీంతో సరిపడా సాగునీరు అందక ఆయకట్టు రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరుపాక రెవెన్యూలోని సర్వే నం. 19–1లోని 3.96 ఎకరాల విస్తీర్ణంగల వియ్యపువాని చెరువుదీ ఇదే పరిస్థితి. మేడివాడ పెద్ద చెరువు విస్తీర్ణం సుమారు 40 ఎకరాల వరకూ ఉంటుంది. ఇందులో 15 నుంచి 20 ఎకరాల వరకు ఆక్రమణకు గురైంది. కొత్తకోట, దొండపూడి, రావికమతం, తట్టబంద, మర్రివలస తదితర గ్రామాల్లోని చెరువుల పరిస్థితి అధ్వానంగా ఉంది.

**చర్యలు తీసుకున్నా మళ్లీ మొదటికే..** సుమారు 25 ఎకరాలు విస్తీర్ణం ఉన్న గొంప మిరియాల చెరువు పూర్తిగా ఆక్రమణకు గురైంది. పలువురు చెరువును ఆక్రమించి సాగుభూమిగా మార్చుకొని వరి, చెరకు, సరుగుడు వంటి పంటలు సాగుచేస్తున్నారు. ఈ చెరువు ఆక్రమణపై స్థానిక రైతులు గతేడాది డిసెంబరులో జరిగిన రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేశారు. అప్పటి తహసీల్దారు స్పందించి సర్వే చేయించి ఆక్రమణలు తొలగించారు. చెరువు చుట్టూ హద్దులు ఏర్పాటు చేయించారు. కానీ పరిస్థితి ఎప్పటిలాగే మారుతోందని స్థానిక రైతులు చెబుతున్నారు. గుడ్డిపలోని సర్వే నం 111లోని 2.07 ఎకరాలు చింత బందల చెరువు సమస్యను రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా గతనెల 21న సర్వే చేయించి ఆక్రమణలను తొలగించారు. ఉపాధి హామీ పనుల్లో చెరువుల్లో మట్టి పనులు చేస్తున్నా ఆక్రమణల సమస్యను గాలికొదిలేస్తున్నారు.

# విదేశీవిద్య కల సాకారం




తిరుపతి: విదేశాల్లో విద్యనభ్యసించాలనుకునే విద్యార్థినుల కలలను శ్రీపద్మావతి మహిళా వర్సిటీ నిజం చేస్తోంది. స్వీడన్‌లోని బ్లెకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీటీహెచ్)తో చేసుకున్న అవగాహన ఒప్పందంలో భాగంగా 2016 నుంచి ఆరేళ్ల బీటెక్, ఎంఎస్ డ్యూయల్ డిగ్రీ నిర్వహిస్తోంది. ఇప్పటివరకు పదుల సంఖ్యలో విద్యార్థినులు కోర్సు పూర్తిచేసుకుని భారత దేశంతోపాటు స్వీడన్, అమెరికా, కెనడా వంటి దేశాల్లో అత్యుత్తమ ప్యాకేజీలతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా ఉద్యోగాలు చేస్తున్నారు.

**మూడేళ్లు ఇక్కడ.. ఏడాది అక్కడ**

మహిళా వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ సీఎస్ఈ గ్రూపులో డ్యూయల్ డిగ్రీ కోర్సు నడుస్తోంది. పది సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మొదటి మూడు సంవత్సరాలు ఇక్కడ నాలుగో సంవత్సరం స్వీడన్‌లో చదవాల్సి ఉంటుంది. ఎంఎస్ చేయాలనుకునే విద్యార్థినులు స్వీడన్‌లోనే మరో రెండు సంవత్సరాలు కొనసాగవచ్చు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ), ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్ (ఏఐఎంఎల్), ఎంఎస్ ఇన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ స్పెషలైజేషన్స్ ఉంటాయి.

**అర్హత, ఫీజు వివరాలు**

ఈఏపీ సెట్, జేఈఈ మెయిన్స్ వంటివాటిలో అర్హత సాధించడంతోపాటు ఇంటర్‌లో 60 శాతం మార్కులు సాధించిన విద్యార్థినులు ఎం సెట్ కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశం పొందవచ్చు. ఏడాదికి రూ.1,50,000 చొప్పున మూడేళ్లకు రూ.4,50,000, బీటీహెచ్‌లో రెండు సెమిస్టర్లకు రూ.8,50,000 చెల్లించాలి.

ఎస్వీయూలోనూ: ఎస్వీ యూ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం విద్యార్థులు స్వీడన్ సంస్థతో ఈ ఏడాది కుదిరిన ఒప్పందంలో భాగంగా డ్యూయల్ డిగ్రీచేసే అవకాశం ఉంది.

**ఏడాదికి రూ.39 లక్షల వేతనం**

నేను మహిళా వర్సిటీలో బీటెక్ డ్యూయల్ డిగ్రీ కోర్సు పూర్తిచేశా. నాలుగో సంవత్సరం స్వీడన్ బీటీహెచ్‌లో చదవడంతో విదేశాల్లో చదవాలనే నా కల నెరవేరింది. మహిళా వర్సిటీలో మూడేళ్లు ఉత్తమ శిక్షణ ఇచ్చారు. చివరి సంవత్సరంలో రెండు సెమిస్టర్లు బీటీహెచ్‌లో చదవుతుండగానే ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం వచ్చింది. అది పూర్తవగానే స్వీడన్‌లోనే ఎరిక్సన్ సంస్థలో ఏడాదికి రూ.39 లక్షల వేతనంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించా. చార్విశ్రీ, స్వీడన్

**బెంగళూరులోనే ఉద్యోగం**

నేను మూడేళ్లు మహిళా వర్సిటీలో, చివరి సంవత్సరం బీటీహెచ్‌లో చదివా. కోర్సు పూర్తవగానే ఇండియాకు వచ్చా. ఈ సర్టిఫికెట్‌కు ఇక్కడి కంపెనీల్లో మంచి ప్రాధాన్యం ఇస్తున్నారు. బెంగళూరులోనే ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఏడాదికి రూ.28 లక్షల వేతనం సంపాదిస్తున్నా. విదేశాల్లో సైతం త్వరగా ఉద్యోగం సాధించవచ్చు. హారిక, బెంగళూరు

**విద్యార్థినులకు మంచి అవకాశం**

విదేశాల్లో విద్యనభ్యసించాలనుకునే విద్యార్థినులకు బీటెక్ డ్యూయల్ డిగ్రీ ఎంతో అనువుగా ఉంటుంది. మహిళా వర్సిటీలో ఈ కోర్సుకు మంచి ఆదరణ ఉంది. ఇప్పటివరకు 31 మంది ప్రవేశాలు పొందగా.. 26 మంది పూర్తిచేసుకుని ఇండియాతోపాటు వివిధ దేశాల్లో ఏడాదికి రూ.25–40 లక్షల ప్యాకేజీతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. ఆచార్య పి.విజయలక్ష్మి, మహిళా వర్సిటీ అంతర్జాతీయ వ్యవహారాల డీన్

# క్యాన్సర్ పని పట్టేలా..!



అనకాపల్లి: నగరంలోని కింగ్‌జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్) రేడియో థెరపీ విభాగంలో అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. కార్పొరేట్ ఆసుపత్రులు, అగనంపూడిలోని హోమీబాబా ఆసుపత్రిలో అందిస్తున్న క్యాన్సర్ సేవల్ని ఇక్కడ రోగులకు ఉచితంగా అందించేందుకు విభాగం సిద్ధమైంది.

**అటు వైద్యం.. ఇటు బోధన..!**

ఇటీవల కూటమి ప్రభుత్వం రూ.40 కోట్ల విలువైన మూడు కీలక వైద్య పరికరాలను ఆసుపత్రికి సమకూర్చింది. వాటిని సోమవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ప్రారంభించనున్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద వచ్చే రోగులతో పాటు పేద రోగులకు ఇక్కడ వైద్యం చేయనున్నారు.

ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు చెందిన వారు, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వచ్చే రోగులకు అన్ని రకాల రేడియో థెరపీ సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారిణి డాక్టర్ ఐ.వాణి తెలిపారు.

నూతన పరికరాల ద్వారా మానవ శరీరంలో ఏ విభాగానికి క్యాన్సర్ వచ్చినా, మెరుగైన వైద్యం అందించేందుకు సాధ్యపడుతుంది. ప్రస్తుతం టెలీ కోబాల్ట్ యంత్రంతో రేడియేషన్ చికిత్స అందిస్తున్నామని, ఆ స్థానంలో ఇప్పుడు కొత్తవి సమకూరాయని డాక్టర్ వాణి పేర్కొన్నారు. రేడియో థెరపీ విభాగంలో చికిత్సతో పాటు పీజీ కోర్సులు బోధించనున్నారు. ఈ విభాగంలో ప్రస్తుతం ఏడుగురు పీజీలు, ప్రొఫెసర్, సహ ప్రొఫెసర్, ఇద్దరు సహాయ ప్రొఫెసర్లు ఉన్నారు.


**పరికరం.. పనితీరు..!**

బ్రాకో థెరపీ యూనిట్ : దీని ద్వారా ఐసీఆర్ (ఇంట్రా కేవిటీ రేడియేషన్), ఐఎల్ఆర్‌టీ (ఇంట్రా లూమినాల్ రేడియో థెరపీ), ఐఎస్‌బీటీ (ఇంటర్ స్టీటియల్ బ్రాచి థెరపీ), మెల్డ్ థెరపీ సేవలు అందిస్తారు.

లీనియర్ యాక్సిలరేటర్: 3డీ సీఆర్‌టీ (3 డైమెన్షనల్ కన్ఫార్మల్ రేడియో థెరపీ, ఐఎంఆర్‌టీ (ఇంటెన్సిటి మాడ్యులేటెడ్ రేడియేషన్ థెరపీ), ఐజీఆర్‌టీ (ఇమేజ్ గైడెడ్ రేడియో థెరపీ), బ్రెయిన్ ట్యూమర్స్ కోసం ఎస్ఆర్ఎస్ (స్టీరియోటాక్టిక్ రేడియో సర్జరీ), ఎస్‌బీఆర్‌టీ (స్టీరియోటాక్టిక్ బాడీ రేడియో థెరపీ) చికిత్సలు చేయనున్నారు.

సీటీ స్టిమ్యులేటర్ : సీటీ స్టిమ్యులేటర్ ద్వారా క్యాన్సర్ బాధితులకు అవసరమైన స్కానింగ్ పరీక్షలు చేస్తారు.

# ఇదీ వేదన.. ఎప్పటికో వంతెన!



అనకాపల్లి: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పలు వంతెనలు శిథిలావస్థకు చేరాయి. మరికొన్ని చోట్ల వంతెనలకు అనుసంధానంగా కట్టిన కాజ్‌వేలు, కల్వర్టులు పూర్తిగా పాడైపోయాయి. గత ప్రభుత్వ హయాంలో వంతెనల నిర్వహణకు, మరమ్మతులకు ఒక్క రూపాయి వెచ్చించలేదు. చాలా ప్రాంతాల్లో తాత్కాలిక ప్రత్యామ్నాయాలతో సరిపెట్టారు. ఫలితంగా వర్షం కురిసిన ప్రతిసారీ రాకపోకలు నిలిచిపోతున్నాయి. వాహనదారులు తప్పనిసరి పరిస్థితుల్లో 10 నుంచి 20 కిలోమీటర్లు చుట్టుతిరిగి రావాల్సి వస్తోంది. కొన్నిచోట్ల నిధుల కొరతతో ఇబ్బంది ఉంటే.. ఇంకొన్నిచోట్ల నిధులున్నా పనులు పట్టాలెక్కడం లేదు. దేవరాపల్లి – కొత్తవలస రహదారిలో రైవాడ జలాశయం నుంచి విశాఖపట్నానికి మంచినీరు సరఫరా చేసే ప్రధాన కాలువపై కల్వర్టు ఇది. విజయనగరం జిల్లా వేపాడ మండలం వావిలపాడు సమీపంలోని క్వారీల నుంచి భారీ లోడుతో మెటల్‌ను తరలించడంతో నాలుగు నెలల క్రితం కుంగిపోయింది. దీంతో ఆ మార్గంలో భారీ వాహనాల రాకపోకలు నిలిపివేశారు. విశాఖ నుంచి ఈ మార్గంలో దేవరాపల్లికి బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. దీనిపై ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి స్పందించి జీవీఎంసీ వాళ్లను ఒప్పించి రూ. 91 లక్షలు మంజూరు చేయించారు. కానీ.. ఇప్పటికీ పనులకు సంబంధించిన టెండర్లు కూడా ప్రారంభం కాలేదు. దీంతో బస్సులు నడవక పోవడంతో విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇది భీమిలి–నర్సీపట్నం రోడ్డులోని విజయరామరాజుపేట దగ్గర తాచేరు నదిపై ఉన్న వంతెన. కొన్ని దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ వంతెన శిథిలావస్థకు చేరడంతో ఏడాది క్రితం కూలిపోయింది. దీని నిర్మాణానికి గతంలో రూ. 13 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. ఇప్పటి వరకు నిధులు మంజూరు కాలేదు. పక్కనే తాత్కాలిక కాజ్‌వే గతంలో నిర్మించారు. ఇటీవల వచ్చిన వరదలకు అదికాస్తా కొట్టుకుపోయింది. దీంతో వడ్డాది, చోడవరం మధ్య రాకపోకలు మొత్తం నిలిచిపోయాయి. ఇది అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు ప్రధాన రహదారి కావడంతో వేల సంఖ్యలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వడ్డాది – నర్సీపట్నం మార్గంలో పెద్దేరు నదిపై ఉన్న వంతెన ఇది. నాలుగేళ్ల క్రితం కుంగిపోయింది. తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టారు. దీనికి అనుసంధానంగా రూ. కోటి నిధులు వెచ్చించి కాజ్‌వే నిర్మించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ కాజ్‌వేకు సంబంధించిన అప్రోచ్ రోడ్డు కోతకు గురైంది. దీంతో ఈ మార్గంలో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సి వస్తోంది. కానీ స్థానిక, పరిసర గ్రామాల ప్రజలు గత్యంతరం లేకుండాపోయింది. కొత్తగా వంతెన నిర్మాణానికి రూ. 25 కోట్ల ప్రతిపాదనలు రూపొందించారు. కానీ.. దస్త్రం ముందుకు కదలకపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. **నిధులు రాగానే నిర్మిస్తాం: సాంబశివరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ, అనకాపల్లి**

నిధుల సమస్య కారణంగా కొన్ని బ్రిడ్జిల నిర్మాణాలు నిలిచాయి. ఆయా ప్రాంతాల్లో ఇబ్బందులను ప్రభుత్వానికి తెలియజేశాం. ఇటీవలే వంతెనల పనులకు అంచనాలు వేశాం. త్వరలో అసంపూర్తి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

# జల ఆశయం నెరవేరక

బేతంచెర్ల: బేతంచెర్ల మండల పరిధిలోని గూటుపల్లె చెరువును జలాశయంగా అభివృద్ధి చేయాలన్న కల నెరవేరడం లేదు. మండల పరిధిలో ఎలాంటి నీటి వనరులు లేకపోవడం.. మరోవైపు తాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతున్న నేపథ్యంలో దీనిని రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయాలని సంకల్పించారు. ఫలితంగా గూటుపల్లెతోపాటు ఆర్.బుక్కాపురం, ఆర్ఎస్ రంగాపురం, అంబాపురం, హెచ్‌కొట్టాల, కొమ్మూరు కొట్టాల, రహిమాన్‌పురం తదితర గ్రామాల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. భూగర్భ జలాలు వృద్ధి చెంది తాగునీటి సమస్యలు తీరుతాయి. గూటుపల్లె, గోర్లగుట్ట చెరువులు మైనర్ ఇరిగేషన్ పరిధిలోకి వస్తాయి. గూటుపల్లె చెరువు 175 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉండగా గోర్లగుట్ట చెరువు 30 ఎకరాలకుపైగా విస్తరించి ఉంది.

**పూడిక తీసి వదిలేశారు**

2014లో తెదేపా ప్రభుత్వ ప్రభుత్వ హయాంలో నీరు–చెట్టు పథకం కింద గూటుపల్లె చెరువును అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.



రూ.10 లక్షలు కేటాయించగా కొంతమేర పనులు జరిగాయి. ఆ తర్వాత 2019లో వైకాపా ప్రభుత్వం వచ్చిన సమయంలో గూటుపల్లె చెరువుకు రూ.1.80 కోట్లు, గోర్లగుట్ట చెరువుకు రూ.కోటి వరకు నిధులు కేటాయించారు. ఆయా చెరువుల్లో కొంతమేర పూడిక తీసి వదిలేశారు. బిల్లులు రాకపోవడంతో పనులు జరగలేదన్న విమర్శలున్నాయి. ఈ రెండు చెరువులపై పర్యవేక్షణ లేకపోవడంతో పలువురు యథేచ్ఛగా కబ్జాలకు పాల్పడుతున్నారు. అయినప్పటికీ జలవనరుల శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. హంద్రీ నీవా ఎత్తిపోతల పథకం ద్వారా ఈ చెరువులకు నీటిని తరలిస్తే సాగు, తాగునీటి సమస్యలు పరిష్కారమవుతాయని జనం పేర్కొంటున్నారు.

# రాయితీతో కా'పాడి'..

కర్నూలు : పశు పోషకులకు చేయూతనివ్వడం ద్వారా పాడి పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పశువులకు వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు, ఇతర వైద్య సేవలు అందించడంతోపాటు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తోంది. ఉమ్మడి జిల్లాలో వంద శాతం రాయితీతో 6 వేలకుపైగా మినీ గోకులం షెడ్లు మంజూరు చేసింది. తాజాగా ఉమ్మడి జిల్లాలో 2 వేల ఎకరాల్లో పశుగ్రాసం క్షేత్రాలను పెంచేందుకుగాను రైతులకు రాయితీపై విత్తనాలు అందించడంతోపాటు రాయితీపై సమీకృత దాణా అందిస్తోంది.

**కొరత లేకుండా..**

పశుగ్రాసం కొరతను అధిగమించేందుకు రాయితీపై గడ్డి విత్తనాలను ప్రభుత్వం అందిస్తోంది. ఉమ్మడి జిల్లాకు 70 మెట్రిక్ టన్నుల విత్తనాలు అవసరమని నిర్ధారించారు. హైబ్రీడ్ జొన్న, మొక్కజొన్న రకాల విత్తనాలను 75 శాతం రాయితీతో ఇస్తున్నారు. జొన్న రకాలు 5 కిలోల ప్యాకెట్ ఖరీదు రూ.460 కాగా.. రైతు వాటాగా రూ.115 చెల్లించాలి. ఒక్కో రైతుకు 5 నుంచి 20 కిలోల వరకు పంపిణీ చేస్తున్నారు. మొక్కజొన్న రకాల గ్రాసం విత్తనాలు 5 కిలోల ప్యాకెట్ ధర రూ.340 కాగా రాయితీ పోనూ రూ.85 చెల్లించాల్సి ఉంది.

**మొదటి విడతగా 500 టన్నులు** సమీకృత దాణాను 50 శాతం రాయితీపై అందిస్తున్నారు. కర్నూలుకు 419, నంద్యాలకు 419 మెట్రిక్ టన్నుల దాణా కేటాయించారు. 50 కిలోల బస్తా ధర రూ.1,110.



ఇందులో రాయితీ రూ.555 పోగా.. రైతు రూ.555 చెల్లించాల్సి ఉంటుంది. ఒక రైతుకు క్వింటా నుంచి 1.50 క్వింటాళ్ల వరకు పంపిణీ చేస్తున్నారు. మొత్తం 838 మె.టన్నుల సమీకృత దాణాలో మొదటి విడతగా 500 టన్నులు పంపిణీ చేశారు. మరో 338 టన్నులు అందించేందుకు సిద్ధం చేస్తున్నారు.

**రైతుల అభ్యున్నతికి సర్వే**

కూటమి ప్రభుత్వం పశు పోషకుల అవసరాలు తెలుసుకునేందుకు సర్వే చేపట్టింది. పశు పోషణకు అవసరమైన రుణాలు, బీమా అవసరాలకు సంబంధించి సెప్టెంబరు 15వ తేదీ వరకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించనుంది. ఉమ్మడి జిల్లాలో సుమారు 1,500 గ్రామాల్లో ఏహెచ్ఏలు, పారా సిబ్బంది సర్వే చేయనున్నారు.

# కల్లాలు దాటక.. కన్నీళ్లు ఆగక

పెద్దకడబూరు: ఉల్లి రైతుకు ఈ ఏడాది కష్టకాలం వచ్చింది. ఒకవైపు అధిక వర్షాలు.. మరోవైపు విపణిలో ధరాఘాతంతో ఉల్లి రైతు కంట కన్నీరు పెడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు మార్కెట్లో గిట్టుబాటు ధర లభించకపోవడంతో కొందరు పొలాల్లోనే గొర్రెలు, మేకలు, పశువులకు వదిలేస్తున్నారు. మరికొందరు ఉచితంగా తెచ్చుకోండంటూ గ్రామాల్లో దండోరా వేయిస్తున్నారు. ఎమ్మిగనూరు మండలం హాలహర్వి గ్రామానికి చెందిన బోయ రమేశ్ సుమారు 200 బస్తాల ఉల్లిని గిట్టుబాటు ధర లేక పొలంలోనే వదిలేశారు. పెద్దకడబూరు మండలం హెచ్.మురవణి గ్రామంలో ఎకరా రూ.35 వేల ప్రకారం రెండెకరాలను ఆయన కౌలుకు తీసుకొని ఉల్లి సాగు చేశారు. కొంత సరకును కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు తీసుకెళ్లగా క్వింటా రూ.200కు అమ్ముడుపోయిందని.. మొత్తం రూ.2.70 లక్షల వరకు నష్టం వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఉల్లికి గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని అన్నదాతలు విన్నవిస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో కర్నూలు జిల్లాలో సాధారణ సాగు 16 వేల హెక్టార్లు కాగా ఇప్పటికే 12 వేల హెక్టార్లలో పంట సాగైంది. నంద్యాల జిల్లాలో సాధారణ సాగు 4,240 హెక్టార్లకుగాను 3 వేల హెక్టార్లకు పైగా ఉల్లిని రైతులు సాగు చేశారు. ఈ సీజన్‌లో సెప్టెంబరు నుంచి ఉల్లి దిగుబడులు కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు పెద్ద ఎత్తున రానున్నాయి. కాగా ఇప్పటికే ధర పడిపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కనీసం పెట్టుబడులు రాక తీవ్రంగా నష్టపోతున్నారు.

## రొయ్యకు మళ్లీ సుంకాల దెబ్బ

నిడదవోలు : సిరుల పంటగా పేరొందిన రొయ్యల సాగుకు అమెరికా సుంకాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో భారత్ నుంచి దిగుమతయ్యే వస్తువులపై 30 శాతం సుంకాలు అమలు చేస్తామని ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఆక్వా రైతులకు ఇచ్చే ధరలపై వేటు పడింది. ఆ సమయంలో వంద కౌంట్ ధర రూ.200కు పడిపోయింది. అదే సమయంలో సుంకాల అమలును మూడు నెలల పాటు వాయిదా వేయడంతో కొంతమేర ఆక్వా రైతులు ఊపిరి పీల్చుకున్నారు. తిరిగి వంద కౌంట్ రూ.260కు చేరింది. ప్రస్తుతం ఈ నెల 1 నుంచి 25 శాతం మేర సుంకాలు వడ్డిస్తామని ప్రకటించడంతో ఆక్వా రైతుల్లో మళ్లీ అలజడి మొదలైంది.

**ఉమ్మడి జిల్లాలో 85వేల ఎకరాల్లో సాగు..** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చేపలు, రొయ్యలు 2.80 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. దీనిలో 80 వేల ఎకరాల్లో రొయ్య పంట సాగులో ఉంది. అధికంగా కోనసీమ జిల్లాలో 45వేల ఎకరాల వరకు సాగులో ఉండగా, మిగిలిన భాగం కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో ఉంది.



**మరో మూడు నెలల్లో పంట చేతికి..**

మరో రెండు మూడు నెలల్లో రైతుల వద్ద పంట ఉంటుంది. అటువంటి తరుణంలో తాజా అమెరికా సుంకాల దెబ్బ ఎంతవరకు ఉంటుందనే ఆవేదన రైతుల్లో ఉంది. మార్చి నెలలో రోజుకు రూ.10ల చొప్పున ధర పడిపోవడంతో రైతులు మానసిక ఆవేదనకు గురయ్యారు. ప్రస్తుతం వంద కౌంట్ రూ.240ల వరకు కొంటున్నారు. రైతుల వద్ద పంట చేతికి వచ్చే సమయంలో సుంకాలు అమలు చేస్తే తిరిగి గతంలో మాదిరిగానే వంద కౌంట్ ధర రూ.200లకు పడిపోయే అవకాశం ఉందని అధికారులు, ట్రేడ్ వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

## భద్రత తడ'బోటు'

నందికొట్కూరు : కృష్ణమ్మ ఉధృతంగా ప్రవహిస్తోంది.. అలలపై ప్రయాణికులను ప్రమాదకరంగా బోట్లలో తరలిస్తున్నారు. నదిలో 1,10,681 క్యూసెక్కుల నీరు పారుతోంది.. శ్రీశైల జలాశయంలో 880 అడుగుల మేర నీటిమట్టం ఉంది. తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ ప్రాంతం.. నందికొట్కూరు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల మధ్య బంధుత్వం ఉంది.. నదిలో నీళ్లు లేనప్పుడు వాహనాల్లో వెళ్తుంటారు. ప్రస్తుతం నది ఉధృతంగా ప్రవహిస్తోంది.. నందికొట్కూరు నుంచి కర్నూలు మీదుగా తెలంగాణలోని పెంట్లవెల్లికి బస్సులో వెళ్లాలంటే 2.37 గంటలు పడుతుంది. నెహ్రూ నగర్‌లో కృష్ణా నది మీదుగా బోటులో వెళ్తే 30 నిమిషాల్లో చేరుకోవచ్చు కర్నూలు నుంచి బస్సులో ఛార్జీ రూ.140 కాగా బోటులో వెళ్తే రూ.50 వసూలు చేస్తారు. ద్విచక్ర వాహనంపై కర్నూలు మీదుగా వెళ్లాలంటే పెట్రోలుకు సుమారు రూ.330 ఖర్చవుతుంది. బోటులో వాహనాన్ని తరలిస్తే రూ.50 వసూలు చేస్తారు. తక్కువ ఖర్చు, త్వరగా గమ్యానికి చేరుతుండటంతో చాలామంది బోట్లను ఆశ్రయిస్తున్నారు.

**నిత్యం ఆరు ట్రిప్పులు**బోటు ప్రయాణం నిషిద్ధమైనప్పటికీ పగిడ్యాల మండలం నెహ్రూ నగర్, కొత్తపల్లి మండలం జానాలగూడెం, సంగమేశ్వరం ప్రాంతాల నుంచి తెలంగాణ ప్రాంతానికి యథేచ్ఛగా వెళ్తున్నాయి. అధికారులు పట్టించుకో కపోవడంతో నిత్యం నాలుగు నుంచి ఆరు ట్రిప్పుల్లో ప్రయాణికులను చేరవేస్తున్నారు. బోటు తిప్పాలంటే పర్యాటక శాఖ అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. ప్రయాణికులను చేరవేసే బోటు వెంట ఇద్దరు గజ ఈతగాళ్లు, ప్రయాణికులకు లైఫ్ జాకెట్లు ఇవ్వాల్సి ఉంది. 10 మందినే తీసుకెళ్లాలి. స్థానికంగా ఎవరూ అనుమతులు తీసుకోవడం లేదు.

## ఉపాధి అక్రమార్కులపై ఏ'ఐ'

నంద్యాల : ఉపాధిహామీ పథకంలో పెద్దఎత్తున అవకతవకలు జరుగుతున్నాయి..పనులు చేయకుండానే నిధులు స్వాహా చేస్తున్నారు. దొంగ హాజరు నమోదు చేస్తున్నారు. నేషనల్ మస్టర్ మానిటరింగ్ సిస్టం (ఎన్ఎంఎంఎస్) ఆధ్వర్యంలో ముఖ ఆధారిత హాజరు విధానం అమల్లోకి తెచ్చినప్పటికీ ఉమ్మడి జిల్లాలో దొంగ మస్టర్లు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. వీటన్నింటికీ అడ్డుకట్ట వేసేందుకు కేంద్రం నిర్ణయించింది. ఈ నెల 10వ తేదీ నుంచి ఏఐ ఆధారిత ముఖ హాజరు విధానాన్ని ప్రవేశపెట్టనుంది.

**చిత్రంలో ఉన్నవారికే మస్టర్లు**

క్షేత్రస్థాయిలో 10 మంది పనిచేస్తుంటే 50 మందికి మస్టర్లు వేసి నిధులు పక్కదారి పట్టిస్తున్నారు. ఎక్కడో ఉండి పనిచేస్తున్నట్లు నమోదు చేస్తున్నారు. వీటన్నింటిని గుర్తించిన కేంద్రం అధునాతన సాంకేతిక పద్ధతులను వినియోగిస్తోంది. ఏఐ ఆధారిత విధానంలో భాగంగా అప్‌లోడ్ చేసిన ఫొటోలో ఎంతమంది ఉన్నారో గుర్తిస్తారు. చిత్రంలో ఉన్నవారికే మస్టర్లు వేస్తారు. జాబ్ కార్డు ఉన్న వ్యక్తి పనికి వచ్చిన వెంటనే ఆ కూలీ ఫొటోను ఎన్ఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ప్రతిరోజూ పని ప్రదేశంలోనే ఉదయం, సాయంత్రం వేళలో సిబ్బంది శ్రామికుల ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు.

**ఏటా రూ.కోట్లలో అవకతవకలు**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉపాధిహామీ పథకం కింద ఏటా రూ.కోట్లలో అవకతవకలు జరుగుతున్నాయి. 2024-25లో రూ.10 కోట్ల వరకు అక్రమాలు బయటపడ్డాయి. ఇదే సమయంలో సిబ్బంది నుంచి రికవరీ చేయడం సాధ్యం కావడం లేదు. మరికొన్నిచోట్ల అక్రమాలు వెలుగులోకి రాకుండా కొందరు అధికారులు, సిబ్బంది వివరాలు తొక్కిపెడుతున్నారు. వీటన్నింటినీ ఏఐ ముఖ ఆధారిత హాజరుతో అరికట్టాలని కేంద్రం భావిస్తోంది. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో దొంగ మస్టర్లకు అడ్డుకట్ట వేయాలని నిర్ణయించింది.

## నిబంధనలకు గండి.. అక్రమాలు దండి!



అనకాపల్లి: క్వారీ నడపాలంటే ముందుగా మైనింగ్ ప్లాన్ ఉండాలి. పర్యావరణ అనుమతులు తెచ్చుకోవాలి. ఎంత విస్తీర్ణంలో తవ్వేది ముందస్తు సమాచారం ఇవ్వాలి. రవాణాకు అనుమతులు తీసుకోవాలి. జిల్లాలో కొందరు క్వారీల నిర్వాహకులు ఇవేవీ లేకుండానే కొండలను కరగదీసేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు నిర్వహిస్తూ.. సర్కార్ ఖజానాకు గండి కొడుతున్నారు. మారుమూల ప్రాంతాల్లో కాదు.. జిల్లా కేంద్రానికి సమీపంలో జరుగుతున్నా.. మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇదే అదునుగా చూసుకుని అక్రమార్కులు రాత్రింబవళ్లు తేడా లేకుండా కొండలను పిండి చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 252 గ్రావెల్, స్టోన్స్, మెటల్ క్వారీలకు అనుమతులున్నాయి. కానీ.. అనధికారికంగా 620కి పైగా క్వారీలు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన ఓ నేత అనుచరులు ఈ దందా నడిపించేవారు. ప్రస్తుతం కూటమికి చెందిన కీలక నేతలు, వారి అనుచరుల కనుసన్నల్లో మైనింగ్ మాఫియా నడుస్తోంది. వేటజంగాలపాలెం సర్వే నంబర్ 84లో ఉన్న కొండ చుట్టూ 15కి పైగా క్వారీలున్నాయి. అందులో ఏ ఒక్కదానికీ అనుమతులు లేవు. అయినా.. దర్జాగా తవ్వకాలు జరుపుతున్నారు.

**మొక్కుబడిగా తనిఖీలు...** జిల్లాలో అనధికారికంగా నడుస్తున్న క్వారీల నిర్వహణ, పేలుళ్లపై స్థానికులు ఫిర్యాదులు చేసినప్పుడు మొక్కుబడిగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. రెండు, మూడు వాహనాలను పట్టుకుని చేతులు దులిపేసుకుంటున్నారు. అనకాపల్లి మండలంలోని మామిడిపాలెం, తుమ్మపాల, మార్టూరు, మాకవరం పరిసర ప్రాంతాల్లో అధిక సంఖ్యలో అక్రమ క్వారీయింగ్ నడుస్తోంది. ఇటీవల కుంచంగి ప్రాంతంలో ఓ అనధికారిక క్వారీలో తవ్వకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే.. తెదేపాకు చెందిన ఓ నేత ఫిర్యాదుదారునికి ఫోన్‌చేసి ఆ క్వారీ జోలికి పోవద్దని హెచ్చరించారు. ఆ ఆడియో కొన్ని రోజుల క్రితం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది.

**కబళిస్తున్న క్వారీ కాలుష్యం...** అనకాపల్లి పట్టణ పరిసర, గ్రామీణ ప్రాంతాల్లో క్వారీలు, క్రషర్ల నిర్వహణ అధికంగా ఉంది. అక్రమార్జనే ధ్యేయంగా కొంతమంది నిబంధనలకు విరుద్ధంగా పేలుళ్లతో నల్లరాళ్లను తరలించేస్తున్నారు. పేలుళ్లు, వాహనాల రాకపోకలతో వెలువడే ధూళి ద్వారా ఎంతో మంది ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. జిల్లాలో ఇటీవల వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో క్వారీలు, క్రషర్ల ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించగా కళ్లుచెదిరే నిజాలు బహిర్గతమయ్యాయి. అనకాపల్లి పరిసర ప్రాంతాల్లోని 11 గ్రామాల్లో 136 మంది కిడ్నీ సమస్యతో బాధపడుతున్నట్లు ప్రాథమిక పరీక్షల్లో వైద్యులు ధ్రువీకరించారు. మాకవరం, మార్టూరు, మామిడిపాలెం, వల్లూరు, బవులువాడ, చింతనిప్పుల అగ్రహారం, వేటజంగాలపాలెం, సంపతిపురం, కుంచంగి, దొంగలివానిపాలెం, సుందరయ్యపేట గ్రామాల్లో ప్రజలు కిడ్నీ సమస్యతో బాధపడుతున్నట్లు వైద్యులు నిర్ధారించారు.

**అక్రమ క్వారీయింగ్ చేస్తే చర్యలు..**

జిల్లాలో గడువు పూర్తయిన ఏ క్వారీకీ అనుమతులు ఇవ్వలేదు. వాటన్నింటిపై నిఘా పెట్టాం. నిబంధనలకు విరుద్ధంగా పేలుళ్లు, రవాణా చేస్తే అపరాధ రుసుం విధిస్తాం. వాహనాలు సీజ్‌చేసి.. క్వారీ యజమానులపై కేసులు నమోదు చేస్తాం. అనుమతులు లేకుండా తవ్వకాలు చేస్తే చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాస్, మైనింగ్ ఏడీ, అనకాపల్లి

## బాలల కళ్లల్లో 'మసక' తుఫాన్



సీతంపేట: పుస్తకాలు చదవాలంటే కంటి చూపు బాగుండాలి. ఆ చూపే క్రమంగా తగ్గిపోతుంటే...రోజురోజుకు కలవరం పెరుగుతుంది. ప్రస్తుత కాలంలో పలు ఉద్యోగాలకు కంటి చూపు చాలా కీలకంగా పరిగణిస్తారు. ఓ స్థాయి దాటి లోపం ఉంటే... ఆ అవకాశాలూ చేజారిపోతాయి. అందుకే చిన్నతనం నుంచి కంటి చూపుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ఈ ఉద్దేశంతోనే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహిస్తున్న నేత్ర వైద్య పరీక్షల్లో నివ్వెరపోయే విషయాలు బయటపడుతున్నాయి. విద్యార్థుల్లో దృష్టి లోప సమస్యను గుర్తించిన ప్రభుత్వం గత నెల 21 నుంచి పాఠశాలల్లో కంటి పరీక్షలు నిర్వహిస్తోంది. అక్టోబరు 31 వరకు ఈ కార్యక్రమం జరగనుంది. జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 16 ఏళ్ల వయస్సుగల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తారు. అవసరం ఉన్నవారికి కళ్లద్దాలు అందించే ప్రయత్నం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ మీనాక్షి ఆధ్వర్యంలో నేత్ర వైద్య బృందం చేస్తోంది. విశాఖపట్నం జిల్లాలో 595 ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 54,000 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 34,500 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టింది. వీరిలో సుమారు 4,500 మందికి దృష్టి లోపం ఉండవచ్చునని అంచనా. 3,600మంది విద్యార్థులకు కంటి అద్దాలు అవసరమవుతాయని భావిస్తున్నారు. సోమవారం నాటికి 61 పాఠశాలల్లో 7,521మందికి నేత్ర పరీక్షలు పూర్తి చేశారు. 806 మందికి దృష్టి లోపాలు ఉన్నట్లు గుర్తించారు. వారిలో 668 మందికి కళ్లద్దాలు అవసరమవుతాయి. 138 మందిని ఇతర పరీక్షలకు రిఫరల్ చేశారు. వీరిలో ఐదుగురు మెల్ల కన్ను ఉన్నవారున్నారు.

**కారణాలు...గుర్తింపు:** బాలలకు తక్కువ వయసులోనే దృష్టి లోపాలకు కారణాలను నేత్ర వైద్యనిపుణులు పాఠశాలల్లో వివరిస్తున్నారు. బీ గర్భిణులు సరైన పోషకాహారం తీసుకోకపోవడం, పిల్లలకు విటమిన్ ఏ లోపం, కొందరు తల్లిదండ్రులకున్న దృష్టి లోపం పిల్లలకు సంక్రమించే అవకాశం ఉండటం చరవాణి, కంప్యూటర్, టీవీ అతిగా చూడటం పాఠశాల గదులు ఇరుకుగా ఉండటం, తగినంత వెలుతురు లేకుండా ఉండటం. పిల్లలు అందరిలో కలవకపోవడం, చదువులో వెనుకబడటం, ఒంటరిగా ఉండడం వంటివి గమనిస్తే వెంటనే నేత్ర వైద్యులను సంప్రదించాలి.

**పాఠశాలల్లో చేర్చేముందే:** 'పిల్లలను పాఠశాలల్లో చేర్చే ముందు కంటి పరీక్షలు చేయించాలి. చాలా మందికి ఏనిమిదేళ్ల వచ్చే వరకు ఈ సమస్య అంతగా బయటపడదు. గుర్తించిన వెంటనే దృష్టిలోపం పెరగకుండా కళ్లద్దాలు వాడాలి. లేదంటే వయసు పెరిగాక తగు చికిత్స చేయించాల్సి ఉంటుంది. ఆకు కూరలు, చేపలు, కాయగూరలు వంటివి ఆహారంగా అందించాలి. సాధ్యమైనంతవరకు కళ్లకు పెన్సిళ్లు, పుల్లలు తగలకుండా చూసుకోవాలి' అని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ మీనాక్షి పేర్కొన్నారు.

## ఉసురు తీస్తున్న నిర్లక్ష్యం!

చిత్తూరు :ఈ ఏడాది ఏప్రిల్‌లో పుత్తూరులోని ఈశలాపురం రెవెన్యూ పరిధిలోని ఓ గ్రానైట్ క్వారీలో బాంబులు పెట్టి రాళ్లు పేల్చారు. పక్కనే మామిడి తోటలో ఆడుకుంటున్న మూడేళ్ల చిన్నారికి బలంగా పదునైన రాయి తాకడంతో గాయపడ్డాడు. నాలుగేళ్ల క్రితం చౌడేపల్లె మండలం కడియాలకుంటకు సమీపంలోని క్వారీలో ఎలాంటి అనుమతి లేకున్నా పేలుడు పదార్థాలు అమర్చి బండరాళ్లను పగలకొట్టడంతో సమీప పొలంలో పనిచేస్తోన్న జాకీర్ అనే వ్యక్తి అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు కోల్పోయారు. యాజమాన్యాలకు కాసుల వర్షం కురిపిస్తున్న క్వారీలు కార్మికుల ఉసురు తీస్తున్నాయి. గనుల్లో సరైన భద్రతా చర్యలు చేపట్టకపోవడం, పర్యవేక్షించాల్సిన యంత్రాంగం పట్టనట్లుగా వ్యవహరించడంతో విలువైన ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో సమీపంలో ఆడుకుంటున్న చిన్నారులు, కూలీలు మృత్యువాత పడుతున్నారు. భద్రతా వారోత్సవాల సమయంలోనే కాకుండా ఏడాదిలో అన్ని రోజులూ కార్మికుల రక్షణపై దృష్టి సారించాల్సిన బాధ్యత అటు యజమానులు, ఇటు అధికారులపై ఉంది. లేదంటే బాపట్ల జిల్లా బల్లికురవ తరహాలోనే జిల్లాలోనూ ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 631 గ్రానైట్ క్వారీలున్నాయి. వీటిపై దాదాపు 40 వేల మంది ఆధారపడ్డారు. ప్రభుత్వానికి ఏటా రూ.200 కోట్ల వరకు ఆదాయం లభిస్తోంది. క్వారీల్లో పనిచేయడానికి ప్రధానంగా ఒడిశా, బిహార్, ఛత్తీస్‌గఢ్ నుంచి కార్మికులు ఎక్కువగా వస్తుంటారు. విద్యుత్తు తీగ ద్వారా (వైర్ షా) గ్రానైట్ బండను కోసే వృత్తుల్లో అత్యధిక శాతం మంది రాజస్థాన్ వాసులు. స్థానిక మేస్త్రీల పర్యవేక్షణలో బ్లాస్టింగ్ జరుగుతోంది. క్వారీలోని మెటీరియల్‌ను బయటకు తీయాలంటే పేలుడు పదార్థాలు వినియోగించడం తప్పనిసరి కాబట్టి ముందస్తుగానే పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం అనుమతి తీసుకోవాలి. ఎవరి నుంచి వాటిని కొనుగోలు చేస్తున్నారు? లైసెన్సు ఉందా? లేదా? అనే సమాచారం కూడా అధికారులకు ఇవ్వాలి.



వ్యక్తిగత భద్రతా పరికరాలు ఇవ్వాల్సిందే..

మరోవైపు క్వారీల్లో పనిచేసే వ్యక్తులకు శిరస్త్రాణం, గ్లౌజులు, షూలు, ఇతర వ్యక్తిగత భద్రతా పరికరాలు ఇవ్వాలి. కేవలం బూట్లు మాత్రమే వారికి ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొన్నిచోట్ల మాత్రం శిరస్త్రాణం అందిస్తున్నారు. కార్మిక శాఖ అధికారులు తనిఖీలు చేసి నిబంధనలు పక్కాగా అమలయ్యేలా చూడాలి. వారు ఈవిషయంలో సరైన శ్రద్ధ చూపకపోవడంతోనే కార్మికులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

**రిమితికి మించి వాడుతూ**

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో బ్లాస్టింగ్‌కు అనుమతి తీసుకుంటున్నప్పటికీ ఆ తర్వాత పరిమితికి మించి పేలుడు పదార్థాలు వాడుతున్నారు. ఈ క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. స్థానికులు, కార్మికులు గాయపడినప్పుడో, మరణించిన సమయంలో మాత్రమే ఘటనలు వెలుగు చూస్తున్నాయి. పేల్చే ముందు అక్కడున్న వ్యక్తులను బయటకు పంపించాలి. స్థానికులను అప్రమత్తం చేయాల్సినప్పటికీ పట్టించుకోవడం లేదు. ప్రధానంగా కుప్పం, నగరి, పుంగనూరు నియోజకవర్గాల్లో ఇలాంటి ఉదంతాలు తరచూ బయటపడుతున్నాయి. పుత్తూరులో ఈశలాపురం, బొజ్జనత్తం, శాంతిపురం మండలం సి.బందపల్లి, కుప్పం మండలం తిమ్మాపురంలోని కంకర పరిశ్రమను ఆపాలని ప్రజలు నిరసన వ్యక్తం చేశారు.

## ఇక స్మార్ట్ రేషన్ కార్డులు

ఒంగోలు: ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులు అందించేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే వీటిని ముద్రిస్తున్నారు. గత వైకాపా సర్కారు ఇచ్చిన బియ్యం కార్డులు ఆ పార్టీ రంగుల్లో ముద్రించారు. ఓవైపు వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి, మరోవైపు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రాలను పొందుపరిచారు. ప్రస్తుతం కొత్తగా ఇవ్వనున్నవి క్యూఆర్ కోడ్‌తో ఏటీఎం కార్డు పరిమాణంలో ఉంటాయి. ఓవైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, లబ్ధిదారు ఫొటో, రేషన్ కార్డు, చౌక దుకాణం నంబర్లుపై వెనుక వైపు లబ్ధిదారు కుటుంబ సభ్యుల వివరాలు ఉండేలా ప్రణాళిక చేశారు. ఈ నెల 25 నుంచి పంపిణీ చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

**అందరికీ లబ్ధి చేకూరేలా...**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలకు రేషన్ కార్డే ప్రామాణికం. అది లేకుంటే పథకాలకు దూరమైనట్లే. ఇంతటి ప్రాధాన్యం ఉన్న కార్డుల మంజూరుకు గత మూడేళ్లుగా అర్హులైన పేద కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి. గత వైకాపా సర్కారు పలు ఆంక్షలు పెట్టడంతో కుటుంబం నుంచి విడిపోయినవారు, వివాహమైన కొత్త దంపతులు బియ్యం కార్డు పొందేందుకు వీల్లేకుండా పోయింది. పేర్ల తొలగింపు, కొత్తగా పిల్లల పేర్లు చేర్పించడం వంటి వాటికీ ఇబ్బందులు పడాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం ఈ చిక్కులు తొలగిస్తూ



చిరునామా మార్పులు, సభ్యుల చేర్పులు, తొలగింపు, కొత్త కార్డుల మంజూరు, విభజనకు అవకాశం కల్పించింది. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో మే 7 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించింది. ప్రస్తుతం జిల్లాలో 6.71 లక్షల కార్డులు ఉండగా... కొత్తగా మంజూరు, ఉన్నవాటిలో మార్పులు చేర్పులకు ఇప్పటి వరకు 90,240 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 57,763 ఆమోదించారు.

విభాగాలవారీ వచ్చిన దరఖాస్తులు ఇలా..

కొత్త కార్డులు: 10,168 చిరునామా మార్పు: 2,200
వివరాల సవరణ: 1,480 ఆధార్ దిద్దుబాట్లు: 1,198
దుకాణం పునరుద్ధరణ: 11 కొత్తగా సభ్యుల చేర్పు: 63,738
సభ్యుల తొలగింపు: 1,481 కార్డు విభజన: 9,918
సరెండర్: 46

## పేరుకే పురమిత్ర!

ఒంగోలు ప్రజలకు సత్వర సేవలందించేందుకు రాష్ట్ర పురపాలకశాఖ ప్రవేశపెట్టిన పురమిత్ర యాప్‌ను నగర పాలక సంస్థ సక్రమంగా నిర్వహించడంలేదు. ఈ మాధ్యమంలో సమస్యలు తెలియజేసినా వారాల తరబడి కనీస సమాచారం ఉండడం లేదని పలువురు ఫిర్యాదుదారులు వాపోతున్నారు.

**సమాచారం ఇవ్వాల్సి ఉన్నా...**

మార్చి 15న తుణుకులో నిర్వహించిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర ప్రారంభ వేదికలో ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఏ సమస్య ఎన్ని రోజుల్లో పరిష్కరిస్తారన్న వివరాలు సైతం పొందుపరిచారు. పని పూర్తిచేశాక ఫిర్యాదుదారుకు ఆ వివరాలు తెలియజేయాలి. వీలుకాని పని అయితే కారణాలు తెలియజేస్తూ సమాచారం ఇవ్వాలి. ఈ ప్రక్రియ సక్రమంగా జరగడం లేదు. నెలవారీ సమీక్షలు కరవయ్యాయి. సకాలంలో సమస్య పరిష్కరించని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్లకు ఆదేశాలిచ్చినా ఫలితం లేదు.

**కనీస స్పందన కరవు...**

ఒంగోలు నగర పరిధిలో ఇప్పటి వరకు 364 సమస్యలు యాప్ ద్వారా వచ్చాయి. వీటిలో 353 పరిష్కరించినట్లు చూపినా... సంబంధిత ఫిర్యాదుదారుకు ఆ సమాచారం ఇవ్వలేదు. సమస్య తెలియజేసిన వారు ఫోన్ చేసినా, వెబ్‌సైట్‌లో తమ విజ్ఞప్తిని నమోదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఉదాహరణకు సాంబశివనగర్ మొదటి లైన్‌లో ఐకాన్ గ్లోబల్ స్కూల్ పక్కన రహదారి వెంట ఉన్న కొబ్బరిచెట్టు మట్టలు ఎండిపోయి అటుగా వెళ్లేవారిపై పడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వాటిని తొలగించాలని స్థానికంగా నివాసముండే సురేష్ చంద్ర ప్రసాద్ జులై 15న యాప్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఇంతవరకు సమస్య పరిష్కరించక పోగా... ఆయనకు కనీస సమాచారమూ ఇవ్వలేదు. ఇప్పటికైనా యాప్‌లో సాంకేతిక చిక్కులు తొలగించి... కార్యాచరణ చేపడితేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది.

## ఆబ్కారీ... ఏదీ జవాబుదారీ

ఒంగోలు: యూనిఫాం సర్వీసుల్లో నిబంధనలు కఠినంగా ఉంటాయి. క్రమశిక్షణకు పెద్దపీట వేస్తారు. ఉన్నతాధికారుల ఆదేశాల పాటించి తీరాల్సిందే. వారికి ఎదురు తిరగడం అంటే అదో సాహసమనే చెప్పాలి. అటువంటి కీలకమైన శాఖల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఒకటి. గత కొన్నాళ్లుగా ఈ విభాగంలో క్రమశిక్షణ కట్టుతప్పింది. ఈ కారణంగానే మూడు నెలల వ్యవధిలో ముగ్గురు అధికారులపై వేటు పడడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

**ఏకపక్షంగా వ్యవహరించి...** జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న ఓ ఉన్నతాధికారిపై ఇటీవల బదిలీ వేటు పడింది. ఇక్కడి నుంచి కమిషనరేట్‌కు పంపారు. లైసెన్సు ఫీజుల విషయంలో అక్రమాలతో పాటు.. ఒకే ప్రాంతంలో మంజూరైన దుకాణాలను మరో ప్రాంతానికి మార్చడంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారంటూ ఆయనపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దుకాణాల నుంచి వసూళ్ల విషయంలోనూ ఆరోపణలు వెల్లువెత్తాయి. క్షేత్రస్థాయి అధికారులతో ప్రమేయం లేకుండా అంతా నేనే అన్నట్లుగా పనిచేశారాయన. అదే సమయంలో ఇతర అధికారులతోనూ విభేదాలు తీవ్రమయ్యాయి. వసూళ్ల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సైతం జరిగాయి. దీంతో అంతర్గత పోరు అధికమైంది. చివరకు బాధ్యతలు చేపట్టిన నెల వ్యవధిలోనే జిల్లా నుంచి ఆయనను సాగనంపారు. ఇప్పటికీ ఎక్కడా పోస్టింగ్ కేటాయించకపోవడం గమనార్హం.

**విభేదాలతో రచ్చకెక్కారు...**

పొదిలిలో ఎస్సై సైమన్ వ్యవహారం తీవ్ర దుమారాన్నే రేపింది. ఓ గొలుసు దుకాణ నిర్వాహకుడిని పట్టుకుని ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా వదిలేయడాన్ని అక్కడి మహిళా సీఐ ప్రశ్నించారు. దీంతో ఆమెపై తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. వ్యక్తిగతంగా కించపరిచేలా మాట్లాడారు. ఉన్నతాధికారులకు ఆమె ఫిర్యాదు చేయడంతో ఆయనను సస్పెండ్ చేశారు. తాజాగా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆయేషాబేగంతో ఒంగోలు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లీనా వ్యవహరించిన తీరు, వారి మధ్య చోటుచేసుకున్న వివాదం రచ్చకెక్కింది. ఈ విషయమై అందిన నివేదికతో ఉన్నతాధికారులు ఆగమేఘాల మీద స్పందించి సీఐను కమిషనరేట్‌కు సరెండర్ చేశారు.

**సిబ్బందిలో కలవరం...** ఆబ్కారీశాఖలో ప్రశాంతమైన జిల్లాగా ప్రకాశానికి పేరుండేది. ఇప్పుడు ఆందుకు భిన్నమైన వాతావరణం నెలకొంది. వరుసగా చోటుచేసుకుంటున్న పరిణామాలు, అధికారులు, సిబ్బంది మధ్య విభేదాలు కలవరం పుట్టిస్తున్నాయి. గతంలో ఏదైనా సమస్య తలెత్తితే అంతర్గతంగా మాట్లాడుకుని సరి చేసుకునేవారు.

# ఆర్థిక చేయూత.. భవితకు భరోసా..!

విశాఖ : విశాఖ జిల్లాలో సుమారు 70 కిలోమీటర్ల మేర సముద్రతీరం ఉంది. ఇక్కడి గ్రామాల్లో వేలాది మంది మత్స్యకారులు ఉన్నారు. వారంతా సముద్రంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఏటా 1.30 లక్షల టన్నుల సముద్ర ఉత్పత్తులను వేటాడి ఒడ్డుకు తీసుకొస్తున్నారు. వారి సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయి. ఆ వివరాలు..

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై)లో భాగంగా చేపలవేట సాగించేందుకు అవసరమైన పరికరాల పంపిణీ, రవాణా వాహనాలు, బోటు ఇంజిన్లు సమకూర్చడం, చేప పిల్లల సరఫరా వంటివి రాయితీపై ఇస్తున్నాయి. సాధారణ మత్స్యకారులకు 40 శాతం రాయితీ, ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం రాయితీ అందిస్తున్నాయి. మొత్తం యూనిట్ విలువలో లబ్ధిదారుడు పది శాతం చెల్లిస్తే సరిపోతుంది. మిగిలిన సొమ్ము బ్యాంకు నుంచి రుణంగా లభిస్తుంది. మెకనైజ్డ్ బోట్లకు తాబేళ్ల సంరక్షణకు వినియోగించే టెడ్ పరికరాలను 100 శాతం రాయితీపై అందిస్తున్నాయి.ప్రధానమంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి యోజన కింద మత్స్య సహకార సంఘాలకు ఆర్థిక సహాయం అందుతుంది. ఆయా సంఘాలు సొసైటీల రిజిస్ట్రేషన్ కింద నమోదై ఉండాలి. ప్రతీ సంఘం మనుగడలో ఉంటే లబ్ధి చేకూరుతుంది.



మత్స్యకార సేవ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వేట విరామ సమయంలో ఒక్కో మత్స్యకారుడికి రూ.20 వేలు చొప్పున ఆర్థికసాయం చేతికొస్తుంది.ఎంఎఫ్ఆర్ చట్టం కింద రిజిస్టరై...చేపలవేట క్రమం తప్పకుండా సాగించే బోట్లకు ఇంధన రాయితీ ఇస్తున్నాయి. లీటర్ డీజిల్‌ను రూ.9లకే సరఫరా చేస్తున్నాయి. నెలకు 3వేల లీటర్ల వరకు అవకాశం ఉంటుంది.సీకేజ్, సీ వీడ్ (సముద్రపు నాచు) పెంపకంపై మత్స్యకార మహిళలకు అవగాహన కల్పించి, ఉపాధి అవకాశాలు సృష్టిస్తున్నాయి. వీటికి అవసరమైన సామగ్రిని రాయితీపై పంపిణీ చేస్తూ, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తున్నాయి.

# ఎర్రమట్టి.. కొల్లగొట్టి

కుందుర్పి: కుందుర్పి మండలంలో పలుచోట్ల సహజసిద్ధంగా ఏర్పడిన ఎర్రమట్టి కొండలను కొందరు ఆదాయార్జనే ధ్యేయంగా పొక్లెయిన్లు, జేసీబీ యంత్రాల సాయంతో కొల్లగొడుతున్నారు. ఈ మట్టిని ఎక్కువగా నూతన గృహ నిర్మాణాల్లో బేస్‌మట్టం, పూడికకు వినియోగిస్తుంటారు. వాణిజ్య పంటలు సాగుచేసే రైతులు సైతం భూమిలో సత్తువకు ఈ మట్టిని వాడుతుండటంతో అధిక డిమాండు ఏర్పడింది. ఈ నేపథ్యంలో అక్రమార్కులు ఎర్రమట్టిని యథేచ్ఛగా తవ్వేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

**రాత్రిళ్లు కొనసాగుతున్న తవ్వకాలు**మహంతపురం– బెస్తరపల్లి గ్రామాల మధ్య ఉన్న మట్టికొండను నిత్యం వేకువజాము నుంచి ఉదయం 10 గంటల వరకూ జేసీబీ సాయంతో తవ్వించి ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో బెస్తరపల్లి సమీపం నుంచి కర్ణాటకకు కూడా దీనిని రవాణా చేస్తున్నట్లు ఆ ప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కుందుర్పి



నుంచి అపిలేపల్లికి వెళ్లే పూలదిబ్బను(ఎర్రమట్టి దిబ్బ) గతంలో అక్రమార్కులు అనేకచోట్ల తవ్వించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధాన దారికి ఆనుకుని ఉన్న ఈ మట్టిదిబ్బల తవ్వకాన్ని అధికారులు గుర్తించి నిలిపివేయడంతో అక్రమార్కులు వారి పంథా మార్చుకున్నారు. రాత్రుళు గుట్టుచప్పుడు కాకుండా తవ్వకాలు చేస్తున్నారు. కుందుర్పి నుంచి బొమ్మాజిపల్లికి వెళ్లే దారి పక్కనున్న నిమ్మాజిగుట్ట రాతిబండ వరకూ మట్టిని ఇప్పటికే తవ్వేశారు.

**సిబ్బందితో నిఘా పెడతాం :** తిప్పేస్వామి ఉప తహసీల్దార్, కుందుర్పి కొండల్లోని ఎర్రమట్టి అక్రమ తవ్వకాల నివారణకు రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేస్తాం. అక్రమంగా తవ్వకం దారులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

# రద్దీ రహదారులకు మహర్దశ

సూళ్లూరుపేట : జిల్లాలోని రహదారులు, భవనాల శాఖ పరిధిలోని రోడ్లకు మంచి రోజులొచ్చాయి. గతంలో జిల్లాలో బాగా రద్దీగా ఉండి రాకపోకలు అధిక సంఖ్యలో సాగే రహదారులను గుర్తించి, ఎన్‌డీబీ కింద ఆధునీకీకరించాలని తలచారు. ఆ మేరకు నిధులు సైతం మంజూరయ్యాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు ఇవ్వడంలో జాప్యం చేయడంతో గుత్తేదారులు ముందుకు రాలేదు. పనులు ప్రారంభానికి నోచుకోలేదు. రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం వాటిని రద్దుచేసి తాజాగా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) విధానంలో చేపట్టాలని నిర్ణయించింది.**హ్యామ్ అంటే?..** జిల్లాలో ఇప్పటి వరకు ఈ విధానంతో ఎక్కడా రహదారుల పనులు చేయలేదు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్(హ్యామ్) విధానంలో రహదారుల నిర్మాణాల నిధుల్లో ప్రభుత్వం ముందుగా 40 శాతం భరిస్తుంది. మిగతా 60 శాతం నిధులను బ్యాంకు రుణం ద్వారా గుత్తేదారునికి ఇచ్చేలా చర్యలు తీసుకుంటుంది. ఈ మొత్తం నిధులతో గుత్తేదారు రహదారులను బాగు చేస్తారు. రుణాన్ని ప్రభుత్వం 15 ఏళ్లలో తిరిగి చెల్లిస్తుంది. గుత్తేదారు 15 ఏళ్ల పాటు రహదారుల నిర్వహణ పనులు చేయాల్సి ఉంటుంది. ఈ విధానంలో జిల్లాలోని సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో కొన్ని రహదారులను ఎంపిక చేశారు.

**రహదారులను పరిశీలిస్తే..** సూళ్లూరుపేట–శ్రీకాళహస్తి రహదారి పెరిమిటిపాడు వరకు రెండు వరుసలుగా ఉంది. అక్కడి నుంచి బుచ్చినాయుడుకండ్రిగ వరకు విస్తరించేందుకు 2018లో ఎన్‌డీబీ నిధులు మంజూరు చేశారు. 2019లో టెండర్లు నిర్వహించగా చిత్తూరుకు చెందిన పీఎల్ఆర్ సంస్థ టెండరు దక్కించుకుంది. వైకాపా ప్రభుత్వంలో మంత్రులు శిలాఫలకం వేయగా అక్కడక్కడ కల్వర్టు పనులు చేసినా విస్తరణ పనులు ప్రారంభించలేదు. కూటమి ప్రభుత్వం వాటిని రద్దుచేసి నూతన విధానంతో బాగు చేయాలని నిర్ణయించింది.

# బుగ్గవంకను చూడండి.. చొరవ చూపండి!



అనంతపురం: కడప నగరం మధ్యలో ప్రవహించే బుగ్గవంక మొన్నటివరకు చెత్తాచెదారం కంపచెట్లతో నిండిపోయి ఉండేది. వరదల సమయంలో ప్రవాహం ముందుకు సాగకుండా రెండువైపులా ఉన్న కాలనీల్లోకి నీరు చేరేది. జనావాసాల నుంచి వచ్చే మురుగు వంకలో కలిసేది. గుర్రపుడెక్క, జంతుకళేబరాలు, ఇతర వ్యర్థాలు చేరడంతో సమీప కాలనీలవాసుల దుర్గంధం మధ్య జీవనం సాగించాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం రాగానే అక్కడి ప్రజాప్రతినిధుల చొరవతో బుగ్గవంకను ప్రక్షాళన చేశారు. వంకను సుందరంగా తీర్చిదిద్ది 3 కి.మీ మేర రక్షణ గోడ నిర్మించి నగరవాసులకు వరద నుంచి రక్షణ కల్పించారు. ఇందుకు జిల్లా జలవనరుల శాఖ అధికారులు రూ.70 కోట్లు ఖర్చు చేశారు. తెదేపా ప్రభుత్వం 2016లో అనంత నగరంలోని నడిమివంకకు రెండువైపులా రక్షణ గోడ నిర్మాణానికి రూ.67 కోట్లు కేటాయించడంతో 50 శాతానికి పైగా పనులు జరిగాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ఏమాత్రం పట్టించుకోలేదు. 2022, అక్టోబరులో వరదలు ముంచెత్తిన సమయంలో రక్షణ గోడ నిర్మాణంపై అప్పటి సీఎం జగన్ స్వయంగా హామీ ఇచ్చినా పనులు పట్టాలెక్కలేదు. సోమనాథ్‌నగర్‌లో కొట్టుకుపోయిన వంతెన పునఃనిర్మాణానికి నోచుకోలేదు. ఐదేళ్లపాటు నిర్వహణను గాలికొదిలేయడంతో చెత్తాచెదారంతో పాటు కంపచెట్లు ఏపుగా పెరిగి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. లక్ష్మీనగర్, ఆజాద్‌నగర్, సీపీఐ కాలనీ, 4, 5, 6 రోడ్లు, రంగస్వామినగర్, సోమనాథ్‌నగర్, శాంతినగర్, భగత్‌సింగ్‌నగర్, రజకనగర్, గౌరవగార్డెన్స్, రుద్రంపేట, కక్కలపల్లికాలనీ, ఆదర్శనగర్‌లకు ముంపు ముప్పు వెంటాడుతోంది.

**పండమేరును పట్టించుకోరా?**

నగరంలోని పండమేరు వంకలో కొన్నేళ్లుగా కంపచెట్లు తొలగించలేదు. ఆర్డీటీ స్టేడియం సమీపాన వంకలో కంపచెట్లు అడవిని తలపిస్తున్నాయి. గతేడాది అక్టోబరులో వచ్చిన వరదలకు ఎగువ ప్రాంతంలోని కళాకారులకాలనీ మునిగింది. ఉప్పరపల్లి పరిధిలో వంకను ఆక్రమించి ఇటుక బట్టీలు, జగనన్న కాలనీల నిర్మాణం చేశారు. కంపచెట్లు తొలగిస్తామని అటు పాలకులు, ఇటు అధికారులు ప్రకటించి ఏడాది గడుస్తున్నా కార్యరూపం దాల్చలేదు. కాలనీలను వరద ముంచెత్తకుండా నివారణ చర్యలు చేపట్టలేదు. కనీసం వంకల్లోని కంపచెట్లు, చెత్తను తొలగించకపోవడం గమనార్హం. ఇప్పటికైనా పాలకులు, యంత్రాంగం చొరవ తీసుకుని కడపలోని బుగ్గవంకలా అనంత నగరంలోని నడిమివంక, పండమేరును సుందరీకరణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# తాడిపత్రికి సౌర వెలుగులు



తాడిపత్రి: తాడిపత్రి పురపాలిక అధికారులు ఇప్పటి వరకు విద్యుత్తు ఛార్జీల భారాన్ని ఎలా తగ్గించుకోవాలో ఆలోచించి సఫలమయ్యారు. అందులో భాగంగా అవరసమైన విద్యుత్తు మాత్రమే వినియోగించి ఆదర్శంగా నిలిచి పురస్కారాన్ని సైతం అందుకున్నారు. ఇదంతా గతం. ప్రస్తుతం రూ.లక్షల విద్యుత్తు బిల్లులను శాశ్వతంగా తగ్గించుకోవాలని పురపాలికంతా సౌరవిద్యుత్తు ఏర్పాటు చర్యలు తీసుకోనున్నారు. సౌర వెలుగుల దిశగా అడుగులు వేస్తున్నారు.

**పురపాలికకు రూ.లక్షల్లో భారం..**

పురపాలికలో మూడు వాటర్ వర్క్స్, రెండు ఎస్టీపీలు, సుమారు 4120 వేల వీధి దీపాలున్నాయి. వీటితో పాటు మున్సిపల్ కార్యాలయం, సచివాలయాలకు కలిపి ప్రతి నెలా రూ.35 లక్షల వరకు విద్యుత్తు ఛార్జీలు వస్తున్నాయి. గతంలో సుమారు రూ.43 లక్షల వరకు చెల్లించేవారు. అవసరమైనప్పుడు మాత్రమే విద్యుత్తు ఉపయోగించుకుంటూ ఆదా చేయడంతో రూ.7లక్షల వరకు తగ్గించుకున్నారు.

**15వ ఆర్థిక సంఘం నిధులతో..**

ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం నిధుల్లో సౌర విద్యుత్తును ఏర్పాటు చేసుకోవచ్చని అనుమతులు రావడంతో స్థానిక మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఒక్కచోటే కాకుండా పురపాలిక అంతా ఏర్పాటు చర్యలు చేపట్టారు. మొదటి దశగా రూ.3.50 కోట్లతో సుమారు ఏడు ఎకరాల్లో సౌర విద్యుత్తు కేంద్రం ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. దీని ద్వారా మూడు వాటర్ వర్క్స్, రెండు ఎస్టీపీలకు విద్యుత్తును అందించవచ్చు. రెండు, మూడు దశల్లో రూ.2 కోట్లతో వీధి దీపాలకు, కార్యాలయాలకు సౌర విద్యుత్తు అందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సౌర విద్యుత్తు కేంద్రం ఏర్పాటైతే ప్రస్తుతం రూ.35 లక్షల విద్యుత్తు బిల్లు నుంచి కేవలం రూ.3 నుంచి రూ.5 లక్షలు మాత్రమే విద్యుత్తు బిల్లు వస్తుంది. 10 రెట్ల వరకు విద్యుత్తు ఛార్జీలు తగ్గించుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

**ఏటా ఖర్చు తగ్గుతుంది : శివరామకృష్ణ, మున్సిపల్ కమిషనర్**

పరపాలికలో సౌర విద్యుత్తు కేంద్రం వస్తే ఏటా సుమారు రూ.3 కోట్ల వరకు ఖర్చు తగ్గుతుంది. విద్యుత్తు అంతరాయంతో సంబంధం లేకుండా పురపాలికలో రాత్రి సమయాల్లోనూ వీధిదీపాలు వెలుగుతాయి. మున్సిపల్ ఛైర్మన్ జేస్మీ ప్రభాకర్‌రెడ్డి సూచనలతో నందలపాడులో ఉన్న ఏడు ఎకరాల మున్సిపల్ స్థలంలో కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. సౌర విద్యుత్తుతో నీటి సరఫరా, ఎస్టీపీల నిర్వహణ, వీధి దీపాలు వెలిగిస్తే దేశంలోనే తాడిపత్రి ఆదర్శంగా నిలిచే అవకాశాలున్నాయి.

# రాబడి ఉన్నా.. వసతులు మృగ్యం



ధర్మవరం : జిల్లాలో అత్యధిక రాబడి ఉన్న సంత మార్కెట్లల్లో ధర్మవరం ఒకటి. 2023లో రూ.8 కోట్లతో 1.79 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన సంతమార్కెట్‌లో 102 దుకాణాల గదుల సముదాయాన్ని నిర్మించారు. ప్రతి నెల మున్సిపాలిటీకి సుమారుగా రూ.6,7 లక్షలు దాకా అద్దెలు వసూలవుతాయి. కూరగాయాల మార్కెట్‌తో పాటు ప్రభుత్వ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఇందులోనే ఉంది. దీంతో ఆస్తుల క్రయ, విక్రయాలతోపాటు నిత్యావసర వస్తువులతో కొనుగోళ్లతో మార్కెట్ నిత్యం రద్దీగా ఉంటుంది. అలాంటి మార్కెట్‌లో మౌలిక వసతులు లేక వినియోగదారులు, దుకాణదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**క్షేత్రస్థాయిలో ఇదీ పరిస్థితి**

పట్టణంలోని వారాపు సంతకు వచ్చే కొనుగోలుదారులు వేలల్లో ఉంటారు. వారికి కనీస వసతులైన మరుగుదొడ్లు, తాగేందుకు మంచి నీళ్లు లేక నానా అవస్థలు పడుతున్నారు. మరుగుదొడ్ల నిర్వాహణ బాధ్యతలను చేజిక్కించుకున్న గుత్తేదారులు వాటిని శుభ్రం చేయకుండా కేవలం బ్లీచింగ్ పొడి చల్లి చేతులుదులుపుకొంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**సేదతీరేందుకు ప్రత్యేక గదులేవీ?**

పట్టణ మార్కెట్‌లోకి కూరగాయాలు విక్రయించుకునేందు వచ్చే వ్యాపారులు, రైతులు కాసేపు సేద తీరుదామంటే ప్రత్యేక గదులు లేవు. దీంతో ఎక్కడపడితే అక్కడే వేచి ఉండి..వారు తెచ్చిన కూరగాయలు, నిత్యావసర వస్తువులు అమ్మకాలైన వెంటనే వెళ్లిపోతున్నారు. సంత మార్కెట్‌కు ఏటా సుంకాల బహిరంగ వేలంపాట ద్వారా రూ.70 లక్షల ఆదాయం వస్తుంది. సుంకాల నుంచి వచ్చిన ఆదాయంతో మార్కెట్‌లో రైతులు, దుకాణదారులకు విశ్రాంతి గది ఏర్పాటు చేయాల్సి ఉండగా, అధికారులు ఆ ఆలోచన చేయడం లేదు.

**మౌలిక వసతులు కల్పిస్తాం** గతంలో తాగునీటి వసతిని ఎందుకు ఏర్పాటు చేయలేదో తెలియదు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. మిగతావాటిపై కూడా చర్చిస్తాం. వీరేశ్ కుమార్, డీఈ, పురపాలక సంఘం

# టోకెన్ తీస్కో.. లోడ్ చేస్కో!

మామిడికుదురు : అధికారికంగా అనుమతులుంటే తీసుకున్న పైకానికి రసీదులు ఇస్తారు.. లేదంటే టోకెన్లు ఇచ్చి ఇష్టారీతిన కొల్లగొడతారు.. వశిష్ఠ నదీ తీరంలోని రాజోలు మండలం సోంపల్లి రీచ్‌లో ఇసుక దందా ఇదే రీతిన సాగుతోంది. అనధికారికంగా ఇసుక తరలిపోతున్నా స్థానిక యంత్రాంగానికి ఏవిధంగా పట్టకపోవడంతో అక్రమానికి అడ్డులేకుండా పోయింది. వరద కారణంగా నదిలో నీటిమట్టం పెరగడంతో కొన్ని రోజుల పాటు ఆగిన అక్రమార్కులు గత పది రోజులుగా యథేచ్ఛగా ఇసుకను తరలిస్తూ సొమ్ములు వసూలు చేసుకుంటున్నారు.

**భారీగా తరలింపులు**

సోంపల్లిలో ఇసుక రీచ్ గురించి సంబంధిత అధికారులను అడిగితే ఏవిధమైన అనుమతులు ఇవ్వలేదని కచ్చితంగా చెబుతున్నారు. విచ్చలవిడిగా ఇసుక తరలిపోతోందని చెబితే పరిశీలిస్తామంటున్నారు. అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేస్తే కొద్ది రోజుల పాటు తాత్కాలికంగా నిలుపుదల చేసి మళ్లీ దందా కొనసాగిస్తున్నారు. స్థానిక బలం అండతో అక్రమ తరలింపులు, వసూళ్లు నిరాటంకంగా సాగిపోతున్నాయి. ఇక్కడ నిత్యం 60 వరకు ట్రాక్టర్ల ఇసుక తరలిపోతోంది. దందా నిర్వాహకులు ప్రతి ట్రాక్టర్‌కు ఓ టోకెన్ ఇస్తున్నారు. ఒక్కో దానికి రూ.1,400



చొప్పున వసూలు చేస్తున్నారు. ఇసుక తీసి లోడ్ చేసే కార్మికులకు రూ.1,050 ఇస్తున్నారు. మిగతా రూ.350 స్వాహా అవుతోంది. ఇక్కడి అక్రమార్కులే దీనికి సమీపంలోని మలికిపురం మండలం దిండి రీచ్‌లోనూ ఇదేవిధంగా ఇష్టారీతిన ఇసుక తరలింపులు చేస్తున్నారు. ఇక్కడ రోజుకు 40 ట్రాక్టర్ల వరకు తరలిస్తున్నారు. ఈ రెండు రీచ్‌ల్లోనూ రోజూ వంద ట్రాక్టర్ల ఇసుక తరలింపులకు సంబంధించి కార్మికులకు ఇచ్చింది పోను అదనంగా రూ.35 వేలు అక్రమార్జన చేస్తున్నారు. వారం వ్యవధిలోనే ఈ సొమ్ము లక్షల్లో పోగవుతోంది. అనుమతి లేని రీచ్‌ల్లో ప్రైవేటు వ్యక్తులు ఎలా ప్రవేశించారు, యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నా చూసీచూడనట్లు అధికారులు ఎందుకు వ్యవహరిస్తున్నారన్న అనుమానాలు ప్రశ్నార్థకంగానే ఉన్నాయి.

**పరిశీలించి చర్యలు చేపడతాం..**

వశిష్ఠ నదీ తీరంలో ఇసుక తీయడానికి ఏవిధమైన అనుమతులు ఇవ్వలేదు. ఇసుక తీసి తరలించడంపై పరిశీలన చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ఎంత మేర ఇసుక తీసినదీ పరిశీలిస్తాం. ఇక్కడ పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తాం. వంశీధర్‌రెడ్డి, ఏడీ, గనుల శాఖ

# నాడి పట్టి.. నడక నేర్పి


కర్నూలు :ఓర్వకల్లు మండలం పూడిచెర్లకు చెందిన నాగమ్మ (72)కు గత నెల 22న కాలు.. చేయి పడిపోయింది. కుటుంబసభ్యులు వెంటనే సర్వజన వైద్యశాలలోని న్యూరో ఐసీయూలో చేర్పించారు. వైద్యులు పరీక్షలు చేసి వారం పాటు చికిత్స అందించారు. ఆరోగ్యం కొంతమేర కుదుటపడింది. దీంతో ఆమెను జనరల్ వార్డుకు మార్చారు. మరో రెండు మూడు రోజుల్లో డిశ్చార్జి చేయనున్నారు. ఆరోగ్యశ్రీ కింద ఆమెకు వైద్యం చేశారు.

నేటి ఆధునిక సమాజంలో వ్యాధులు చుట్టుముడుతున్నాయి. పలువురు పక్షవాతం బారిన పడుతున్నారు. నరాల సమస్య, స్పాండిలోసిస్, సయాటిక తదితర వాటితో బాధపడేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవాలంటే రూ.లక్షలు వెచ్చించాల్సిందే. కర్నూలు సర్వజన వైద్యశాలలో ఇలాంటి బాధితులకు మెరుగైన సేవలు అందుతున్నాయి. నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ఐసీయూలో ఉంచి రోగులకు సేవలందిస్తున్నారు.

న్యూరో ఫిజీషియన్ విభాగంలో ప్రతి సోమ, గురువారాలు ఓపీ ఉంటుంది. మిగతా రోజుల్లో అత్యవసరమైనవారికి వార్డు వద్ద ఓపీ సేవలు అందిస్తారు. కాలు.. చేయి పడిపోయినవారికి అత్యవసర విభాగంలో ప్రాథమిక చికిత్స చేసి న్యూరో ఫిజీషియన్ విభాగంలోని ఐసీయూలో వైద్య సేవలందిస్తారు.

ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచేకాక వివిధ ప్రాంతాల నుంచి ప్రతి నెలా 1,500 నుంచి 2 వేల వరకు ఓపీ ఉంటుంది. ఐసీయూతోపాటు వార్డుల్లో ప్రతి నెలా 150 మంది రోగులకు చికిత్స అందిస్తుంటారు. ఆరోగ్యశ్రీ ఉన్నా.. లేకున్నా కార్పొరేట్ సేవలు అందిస్తున్నారు.

**పది పడకలతో ప్రత్యేక వార్డు**



వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు న్యూరో ఫిజీషియన్ విభాగానికి నిత్యం వస్తుంటారు. రెండేళ్ల కిందటి వరకు ఈ విభాగానికి ప్రత్యేకంగా న్యూరో ఐసీయూ (స్ట్రోక్ యూనిట్) అందుబాటులో ఉండేది కాదు. జనరల్ మెడిసిన్ విభాగం వైద్యులు రోగులను ఏఎంసీలో చేర్చుకొని చికిత్స అందించేవారు.

ప్రస్తుతం 10 పడకలతో ప్రత్యేకంగా న్యూరో ఐసీయూ స్ట్రోక్ యూనిట్ ఏర్పాటు చేశారు. ఫలితంగా బాధితులకు సాంత్వన లభించింది. రక్తపోటు ఎక్కువై కాలు.. చేయి పడిపోయినవారు.. పక్షవాతంతో బాధపడేవారు, మెదడులో కణితులు ఉన్నవారికి న్యూరో ఐసీయూ విభాగంలో వైద్యం అందిస్తున్నారు. ఉత్తమ సేవలు అందుతుండటంతో ఇక్కడ చికిత్స పొందుతున్నవారి సంఖ్య గణనీయంగా పెరిగింది.

ఉత్తమ సేవలందిస్తున్నాం

న్యూరో ఫిజీషియన్ విభాగంలో ఐసీయూ (స్ట్రోక్ యూనిట్) పెట్టిన తర్వాత చికిత్స పొందేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా వైద్యసేవలు అందిస్తున్నాం. డీఎం విద్యార్థులు అందుబాటులో ఉండటంతో రోగులకు 24 గంటలపాటు ఉత్తమ సేవలు వైద్యం అందిస్తున్నాం.

డా.శ్రీనివాసులు, న్యూరో ఫిజీషియన్ విభాగాధిపతి

# ఎరుపెక్కిన అమైరా అందాల షో

కమర్షియల్ యాడ్స్‌లో నటించడం ద్వారా గుర్తింపు దక్కించుకుని ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ అమైరా దస్తూర్. తక్కువ సమయంలోనే ఈ అమ్మడికి ఎక్కువ సినిమాల్లో నటించే అవకాశాలు దక్కాయి. కానీ అదృష్టం కలిసి రాలేదు, ఆమెకు ఆశించిన స్థాయిలో హిట్స్ రాకపోవడంతో కెరీర్ ఆరంభం నుంచి ఇప్పటి వరకు ఒడిదొడుకులు ఎదుర్కొంటూనే ఉంది. 2013 నుంచి ఇప్పటి వరకు సినిమాల్లో నటిస్తూ, వార్తల్లో నిలుస్తూనే ఉంది అంటే కారణం ఆమె అందం అనడంలో సందేహం లేదు. ఆకట్టుకునే అందం తో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అని ఎన్నో సందర్భాల్లో నిరూపితం అయ్యింది. మరోసారి తన అందమైన ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. అందమైన ఈ అమ్మడి యొక్క అందాల షో తో ఫోటోలు వైరల్ అవుతున్నాయి.



**అమైరా దస్తూర్ అందాల ఆరబోత...** ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపుగా 35 లక్షల మంది ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న అమైరా దస్తూర్ ఎప్పుడు ఏ ఫోటోలు షేర్ చేసినా వైరల్ కావడం చాలా కామన్ విషయం. ఇప్పుడు అదే తీరున అమైరా దస్తూర్ అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం ద్వారా చూపు తిప్పుకోలేక పోతున్నాం అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈసారి రెడ్ డ్రెస్ లో నడుము అందం చూపిస్తూ, నాభి షో చేయడం ద్వారా అమైరా దస్తూర్ హీట్ పెంచేసింది. బయట ఉన్న చలికి అమైరా షేర్ చేసిన ఫోటోలతో ఒక్కసారిగా హీట్ పెరిగి పోయిందని నెటిజన్స్ తెగ కామెంట్స్ చేస్తున్నారు. ఇలాంటి అందాల షో చేయడం ద్వారా ఎప్పటికప్పుడు వార్తల్లో నిలిచిన అమైరా దస్తూర్ సినిమాల్లో ఆఫర్లు దక్కించుకోలేక పోవడం మాత్రం చాలా బాధాకరం అని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రభాస్ సినిమా కోసం ఆలిమ్ హకీమ్..!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ త్వరలో ది రాజాసాబ్, ఫౌజీ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతున్నాడు. ఆ సినిమాలు విడుదల కాక ముందే 'స్పిరిట్' సినిమాను పట్టాలెక్కించే అవకాశాలు ఉన్నాయి. అర్జున్ రెడ్డి, యానిమల్ సినిమాలతో పాన్ ఇండియా దర్శకుడిగా నిలిచిన సందీప్ రెడ్డి వంగ దర్శకత్వంలో స్పిరిట్ సినిమా రూపొందబోతుంది. ఈ సినిమా ప్రకటించి దాదాపు రెండు ఏళ్లు కాబోతున్నా ఇప్పటి వరకు కనీసం షూటింగ్ ప్రారంభం కాలేదు. ప్రభాస్ ఇతర కమిట్‌మెంట్స్‌తో బిజీగా ఉండటంతో పాటు, ఇతర కారణాల వల్ల ఈ సినిమా ఆలస్యం అవుతుందని తెలుస్తోంది. ఆలస్యం అవుతున్నా కొద్దీ ఈ సినిమా వెయిట్ పెరుగుతుంది అనడంలో సందేహం లేదు. సినిమా షూటింగ్ ప్రారంభం కోసం ప్రభాస్ అభిమానులు మాత్రమే కాకుండా అన్ని వర్గాల వారు వెయిట్ చేస్తున్నారు.



**సందీప్ వంగ దర్శకత్వంలో స్పిరిట్...** స్పిరిట్ సినిమా షూటింగ్ ప్రారంభం ఎప్పుడు అనే విషయం ఇప్పటివరకు క్లారిటీ లేదు, కానీ రకరకాలుగా పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ముఖ్యంగా ఈ సినిమాలో నటీనటుల గురించి, సాంకేతిక నిపుణుల గురించి, ఇంకా కథ, స్క్రీన్‌ప్లే గురించి కూడా ఎవరికి తోచిన విధంగా వారు మాట్లాడుతున్నారు, తమ విశ్లేషణలు వినిపిస్తున్నాయి. కానీ ఇప్పటి వరకు సందీప్ రెడ్డి వంగ నుంచి ఇప్పటి వరకు క్లారిటీ రాలేదు. ఈ సినిమాలో మొదట దీపికా పదుకునేను హీరోయిన్‌గా తీసుకున్న విషయం తెల్సిందే. కానీ కొన్ని కారణాల వల్ల ఆమెను తొలగించి ఆ స్థానంలో యానిమల్ హీరోయిన్ త్రిప్తి డిమ్రిని ఎంపిక చేయడం జరిగింది. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ వర్క్ చేస్తున్నారని, వర్క్ షాప్ సైతం నిర్వహిస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. దర్శకుడు త్వరలోనే పూర్తి వివరాలను వెల్లడించే అవకాశాలు ఉన్నాయి.
**ప్రభాస్ కి జోడీగా త్రిప్తి డిమ్రి...** ఇక ఈ సినిమాలోని ప్రభాస్ లుక్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారట. ముఖ్యంగా ప్రభాస్ హెయిర్ స్టైల్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు అనే వార్తలు వస్తున్నాయి. ఈమధ్య కాలంలో ప్రముఖ హెయిర్ స్టైలిస్ట్ ఆలిమ్ హకీమ్ పేరు బాగా వినిపిస్తుంది. ఆయన ఎంతో మంది హీరోలకు హెయిర్ స్టైల్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తున్నాడు. ఈ సినిమా కోసం కూడా ఆయన్ను రంగంలోకి దింపేందుకు ఒప్పందాలు జరిగాయి. ప్రభాస్‌ను చాలా యూనిక్‌గా ఇప్పటి వరకు ఏ ఒక్కరూ చూపించని విధంగా, మరే సినిమాలో చూడని విధంగా ఆలిమ్ హకీమ్ చూపించేందుకు గాను ఇప్పటికే వర్క్ మొదలు పెట్టాడు అంటూ ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తుంది. సందీప్ వంగ దర్శకత్వంలో గతంలో వచ్చిన సినిమాలకు ఆయన హెయిర్ స్టైలిస్ట్‌గా వర్క్ చేశాడు.




# రణ్ వీర్ డ్రెస్ ప్రభాస్ ధరించినట్లుంది.. వరుణ్ కొత్త సినిమా టీజర్



బాలీవుడ్ స్టార్ హీరో వరుణ్ ధావన్- జాన్వీ కపూర్ జంటగా నటించిన లేటెస్టు సినిమా సన్నీ సంస్కారి కి తులసి కుమారి. ఈ సినిమా శశాంక్ ఖైతాన్ తెరకెక్కించారు. ఈ సినిమా దసరా కానుకగా అక్టోబర్ 02న గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ మేరకు మేకర్స్ ఇటీవల టీజర్ వీడియో గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ గ్లింప్స్ ను బాలీవుడ్ ప్రముఖ నిర్మాత కరణ్ జోహార్ తన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీనికి సింపుల్ గా ఓ క్యాప్షన్ రాసుకొచ్చారు. నలుగురు వ్యక్తులు, రెండు హార్ట్ బ్రేక్ లు, ఒక పెళ్లి అంటూ సినిమా స్టోరీని షార్ట్ కట్ లో చెప్పే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం ఈ టీజర్ కు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఈ సినిమా కామెడీ రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కింది. నేను బాహుబలి లా ఉన్నానా అంటూ వరుణ్ డైలాగ్ తో టీజర్ ప్రారంభం అయ్యింది. దీనికి రిప్లైగా మరో నటుడు రోహిత్ సరాఫ్.. ప్రభాస్ డ్రెస్ ను రణ్ వీర్ ధరించినట్లు ఉంది అని చెబుతాడు. కాగా, దర్శకుడు శశాంక్ ఖైతాన్.. వరుణ్ తో చేసిన మురీడో సినిమా ఇది. ఇంతకుముందు ఈ ఇద్దరి కాంబోలో హంప్టీ శర్మ కి దుల్హానియా (2014), బద్రీనాథ్ కి దుల్హానియా (2017) సినిమాలు చేశారు. ఈ రెండు సినిమాలు సైతం భారీ బ్లాక్ బస్టర్ అయ్యాయి. ఈ రెండు విజయాల తర్వాత వరుణ్ దర్శకుడితో చేస్తున్న మూడవ ప్రాజెక్ట్ ఇది. అయితే, సన్నీ సంస్కారి కి తులసి కుమారి సినిమాకు బాక్సాఫీస్ వద్ద పోటీ ఎదురుకానుంది. సరిగ్గా అదే కన్నడ స్టార్ హీరో రిషబ్ శెట్టి కాంతారా: ఎ లెజెండ్ - చాప్టర్ 1, హర్షవర్ధన్ రాణే ఏక్ దీవానే కి దీవానియాత్ సినిమాలు రిలీజ్ కానున్నాయి. ఈ రెండు సినిమాలతో పోటీ పడనుంది. ఇటీవల విడుదలైన టీజర్ అభిమానుల నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. వరుణ్ ధావన్ కామెడీ జానర్ లోకి తిరిగి రావడాన్ని వారు ప్రేక్షకులు ఆస్వాదిస్తున్నట్లు కామెంట్ చేస్తున్నారు. ఈ సినిమాను అక్షయ్ ఒబెరాయ్ ధర్మ ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మించారు. ఈ చిత్రంలో వరుణ్ ధావన్, జాన్వీ కపూర్, సన్యా మల్హోత్రా, మనీష్ పాల్, రోహిత్ సరాఫ్ వంటి స్టార్ నటీనటులు కీలక పాత్ర పోషిస్తున్నారు. దీంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. దీంతో సినిమా కోసం మూవీ లవర్స్ ఆత్రుతతో ఎదురుచూస్తున్నారు.

# తారక్ నమ్మకాన్ని నీల్ నిలబెట్టుకుంటారా?



కేజీఎఫ్-2, సలార్ వంటి సినిమాలతో బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకున్న స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్.. ఇప్పుడు టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్ తో వర్క్ చేస్తున్న విషయం తెలిసిందే. హై వోల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కుతున్న ఆ చిత్రంలో సప్త సాగరాలు దాటి ఫేమ్ రుక్మిణీ వసంత్ కథానాయికగా కనిపించనుంది. ప్రముఖ మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్ పై కల్యాణ్ రామ్ నందమూరి, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తున్నారు. డ్రాగన్ అనే టైటిల్ ను ఫిక్స్ చేసినట్లు సినీ వర్గాల్లో ఎప్పటి నుంచి టాక్ వినిపిస్తోంది. కానీ మేకర్స్ దానిని అధికారికంగా ప్రకటించలేదు. అయితే తారక్ లైనప్ లో అనేక సినిమాలు ఉన్నప్పటికీ.. ఇప్పుడు నీల్ తో చేస్తున్న మూవీపై ఆయన భారీ హోప్స్ పెట్టుకున్నారని చెప్పాలి. ఎందుకంటే రీసెంట్ గా ఆయన నటించిన బాలీవుడ్ డెబ్యూ వార్-2 మూవీ బోల్తా పడింది. భారీ అంచనాల మధ్య రిలీజ్ అయిన ఆ సినిమా.. తెలుగు ఆడియన్స్ ను పెద్దగా ఆకట్టుకోలేదు. దీంతో తారక్.. నీల్ మూవీతో గట్టి కమ్ బ్యాక్ ఇవ్వాలని చూస్తున్నారు. వచ్చే ఏడాది జూన్ 25వ తేదీన థియేటర్స్ లో రానున్నారు. అదే సమయంలో ఇప్పుడు సోషల్ మీడియాలో ఓ విషయం వైరల్ గా మారింది. పాన్ ఇండియా చిత్రాలను రూపొందించే టాలెంట్ ఫుల్ గా ఉన్న నీల్.. ఇప్పుడు తారక్ మూవీని వేరే రేంజ్ లో తీస్తున్నారట. ప్రశాంత్ నీల్ సూచనలను తారక్ అన్నీ ఫాలో అవుతున్నారని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఆయనపై భారీ నమ్మకాన్ని పెట్టుకున్నట్లు తెలుస్తోంది. పూర్తిగా నీల్ ఫోకస్ కు కట్టుబడి ఉన్నారని సమాచారం. మొత్తానికి జూనియర్ ఎన్టీఆర్ నమ్మకాన్ని నీల్ ఎంతవరకు నెలబెట్టుకుంటారో.. ఎలాంటి హిట్ అందిస్తారో ఆసక్తికరం. అయితే రీసెంట్ గా ఎన్టీఆర్- ప్రశాంత్ నీల్ మూవీ షూటింగ్ ఉత్తర కన్నడలోని కుంటాలో జరిగినట్లు తెలుస్తోంది. అక్కడ ఒక ఫ్యాక్టరీ సెట్ ను నిర్మించారని సమాచారం. 10 రోజులకు పైగా షూటింగ్ అక్కడే జరిగిందట. ఇప్పుడు తారక్ రిలాక్స్‌డ్ మోడ్ లో ఉన్నారని టాక్. మరికొద్ది రోజుల్లో కొత్త షెడ్యూల్ మొదలుకానుందని వినికిడి. హైదరాబాద్ లో భారీ వ్యయంతో సెట్ ను నిర్మిస్తున్నారట.

# 100 కోట్లు ఇచ్చినా ఇంకా సెకెండ్ ఛాన్స్ రాలేదా?

100 కోట్ల వసూళ్ల సినిమాలో భాగమైన ఏ హీరోయిన్ కైనా తిరుగులేని అవకాశాలొస్తాయి. నటిగా మరింత బిజీ అవుతుంది. దర్శక, నిర్మాతలు అలాంటి నటిని లక్కీ మస్కట్ గా భావిస్తారు. తమ సినిమాలో అదే నటి హీరోయిన్ గా భాగమైతే కలిసొస్తుందని పని గట్టుకుని మరి ఎంపిక చేస్తారు. నిర్మాత పారితోషికం ఆఫర్ చేయడం లోనూ ఎంత మాత్రం ఆలోచన చేయరు. ఎన్నికోట్లు ఇచ్చైనా తమ సినిమాలో భాగం చేసే ప్రయ త్నం చేస్తుంటారు. కానీ కృతిశెట్టి అలియాస్ బేబమ్మకు మాత్రం ఎలాంటి అవకాశాలు రాకపోవడం శోచనీయం.
**పిలిచి మరీ అవకాశాలివ్వాలి:** గత ఏడాది మాలీవుడ్ లో ఏఆర్ ఎమ్ సినిమాతో లాంచ్ అయింది. 30 కోట్ల బడ్జెట్ లో నిర్మాణమైన సినిమా 100 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. సినిమాలో అమ్మడు టోవినో థామస్ కు జోడీగా నటిం చింది. మలయాళంలో టోవినో పెద్ద హీరో. జితిన్ లాల్ డైరెక్ట్ చేసిన చిత్రమిది. ఈ సినిమా రిలీజ్ అయి ఏడాది పూర్తయింది. అయితే ఇంత వరకూ కృతిశెట్టికి మాలీవుడ్ లో సెకెండ్ ఛాన్స్ రాలేదు. ప్రతిగా తమిళ్ లో అవకాశాలు అందుకుంటుంది. మాలీవుడ్ మాత్రం పిలిచి రెండవ ఛాన్స్ ఇవ్వలేదు.
**లోటు చేయని టాలీవుడ్:** హిట్ వచ్చినా? అవకాశాలు అందుకోని



నటిగా కృతి పేరు ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది. మాలీవుడ్ పరిశ్రమతో పోలిస్తే టాలీవుడ్ లోనే ఎంతో బెటర్ గా అవకాశాలు అందుకుంది. తొలి సినిమా ఉప్పెనతో తెలుగులో భారీ విజయం అందుకుంది. దీంతో ఎడతెరపు లేకుండా పరిశ్రమలో అవకాశాలు అందుకుంది. అవి విజయాలు సాధించలేదు గానీ అవకాశాల పరంగా టాలీవుడ్ ఎంత మాత్రం లోటు చేయలేదు. అలాగే తమిళ్ లో సరైన సక్సెస్ లు లేకపోయినా అక్కడా బాగానే అవకాశాలు అందుకుంటుంది.
**గ్లామర్ పాత్రలకు ఛాన్స్ లేదు:** మరి సక్సస్ ఉన్న మాలీవుడ్ లో ఛాన్సులు ఎందుకు రావడం లేదన్నది ఆసక్తికరం. మాలీవుడ్ లో ఏ నటి ఛాన్స్ వదలుకోదు. అక్కడ హీరోయిన్లను వల్గర్ చూపించే ప్రయత్నాలు జరగవు. కథా బలం ఉన్న చిత్రా లు..స్ట్రాంగ్ రోల్స్ తోనే సినిమాను ముందుకు నడిపిస్తారు తప్ప హీరోయిన్ అందాలను ఎరగా వేసి థియేటర కు రప్పించే ప్రయత్నాలు పెద్దగా జరగవు. మరి అలాంటి డీసెంట్ ఇండస్ట్రీ లో బేబమ్మకు ఛాన్సులు రాకపోవడంతో ఏంటో? చూడాలి.

# హారర్ వరల్డ్ లోకి నేషనల్ క్రష్!

నేషనల్ క్రష్ కెరీర్ దేదీప్యమానంగా సాగిపోతుంది. తెలుగు, హిందీ సినిమాలతో క్షణం తీరిక లేకుండా గడుపుతోంది. స్టార్ హీరోలే టార్గెట్ గా సినిమాలు చేస్తోంది. మరోవైపు లేడీ ఓరియేంటెడ్ నాయికగానూ సత్తా చాటే ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఇప్పటికే బాలీవుడ్ లో ఛావా సినిమాతో యేసుభాయ్ భోంస్లే పాత్రతో నటిగా తన స్థాయిని పెంచుకుంది. హీరోల సరసన రొమాంటిక్ రోల్సే కాదు అవసరమైతే స్ఫూర్తి నింపే పాత్రల్లోనూ సత్తా చాటుతుందని యేసుబాయి పాత్రతో రుజువు చేసింది. ఈ పాత్ర రష్మికకు బాలీవుడ్ లో ప్రత్యేకమైన గుర్తింపును తీసుకొచ్చింది. అరుదుగా కీలక పాత్రల్లో సైతం మెప్పింస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా హారర్ హిట్ ఫ్రాంచైజీలోనూ భాగమవుతోంది. %-%కాంచన%-% సిరీస్ లో భాగంగా లారెన్స్ కాంచన 4ని రెడీ చేస్తోన్న సంగతి తెలిసిందే. ఆయన స్వీయా దర్శకత్వంలో తెరకెక్కి స్తోన్న చిత్రమిది. సినిమాలో ఇప్పటికే పూజాహెగ్డే,



నోరా పటేహీలు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఇదే సినిమాలో రష్మికను ఓ ప్రత్యేక పాత్ర కోసం సంప్రదించారుట. లారెన్స్ ఇటీవలే ఆమెను కలిసి పాత్ర గురించి వివరించారు. రష్మిక కూడా పాజిటివ్ గా స్పందించిదని సమాచారం. ఇదే నిజమైతే కాంచన 4 రేంజ్ మారిపోతుంది. రష్మిక భాగ మైందంటే? ఆ సినిమాకు పాన్ ఇండియాలో క్రేజ్ మామూలుగా ఉండదు. తెలుగు అభిమా నులను మంచి బాలీవుడ్ లో క్రేజ్ సంపాదించిన బ్యూటీ రష్మిక. ఈ నేపథ్యంలో కాంచన 4ని అక్కడా కూడా భారీ ఎత్తున రిలీజ్ చేసే అవకాశం ఉంటుంది. రష్మిక సక్సెస్ సెంటిమెంట్ కూడా వర్కౌట్ అవు తుంది. గతంలో సీతారామం చిత్రంలోనూ నేషనల్ క్రష్ ఓ కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ఆ సినిమా కూడా పాన్ ఇండియాలో పెద్ద విజయం సాధించింది. ఎలాంటి అంచనాలు లేకుండానే సంచలనాలు నమోదు చేసిందా చిత్రం. ఆరకంగా కాంచన 4కి ఇదొక పాజిటివ్ సైన్ గా చెప్పొచ్చు. ప్రస్తుతం రష్మిక బాలీవుడ్ లో థామాలో నటిస్తోంది. అలాగే తెలుగులో %-%ది గర్ల్ ఫ్రెండ్%-% లో నటిస్తోంది. ఈ రెండు చిత్రాలపై మంచి అంచనాలున్నాయి. సెప్టెంబర్...అక్టోబర్ లో రిలీజ్ కు రెడీ అవుతున్నాయి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536